గురువారం
22•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 256
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD


హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ తీరాన నిర్మించనున్న అమరవీరుల స్మృతికేంద్రం నమూనా

అమరులకు నివాళిగా
మహా దీపకళిక

తెలంగాణ రాష్ట్ర సాధన సమరంలో అమరులైన వారికి సముచితంగా నివాళులర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. మహోన్నత త్యాగధనులకు అపురూప దీపాంజలి ఘటించేందుకు మహా స్మృతివనాన్ని నిర్మించబోతున్నది. హైదరాబాద్ నడిబొడ్డున హుసేన్‌సాగర్ తీరాన దీప జ్యోతిని దేదీప్యమానంగా వెలిగించనున్నది. తెలంగాణ అమరుల త్యాగాలను దశదిశలా చాటే సమున్నత దీపాకార స్తూపం నమూనా ఖరారైంది. అమరుల సంకల్పానికి దీటుగా దీనిని ఉక్కుతో నిర్మించబోతున్నారు. వచ్చే డిసెంబర్ నాటికి ప్రారంభించాలనేది లక్ష్యం.

- అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రమిద ఆకారంలో స్మృతికేంద్రం
- 23 అడుగుల ఎత్తుతో స్టెయిన్‌లెస్ స్టీల్ నిర్మాణం
- సుమారు రూ.90 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయం
- మార్చి తొలివారంలో టెండర్లు
- డిసెంబరు 9 నాటికి ఆవిష్కరణకు సిద్ధం
- తుది డిజైన్లకు సీఎం కేసీఆర్ ఆమోదం

2

విద్యుత్ సరఫరాలో
రికార్డుల మోత

రాష్ట్రంలో అత్యధికంగా 202 మిలియన్ యూనిట్లు సరఫరా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌తో దేశవ్యాప్తంగా మార్గదర్శకంగా నిలుస్తున్న తెలంగాణ.. తన సత్తాను మరోసారి చాటుకోవడంతోపాటు రికార్డుల మోత మోగిస్తున్నది. గతంలో ఎన్నడూ లేనంత విద్యుత్‌ను అవాంతరాల్లేకుండా సరఫరా చేసి తాజాగా రికార్డు నెలకొల్పింది. రాష్ట్రం ఏర్పడిన సమయంలో చిమ్మచీకట్ల నుంచి ప్రస్థానం ప్రారంభించి, ఒక్కో అడుగును పకడ్బందీగావేస్తూ రెట్టించిన స్ఫూర్తితో ముందుకు సాగుతుండటంతో రికార్డులు బద్దలవుతున్నాయి. ఇప్పటికే 24 గంటల విద్యుత్‌లో, సోలార్‌లో అన్నింటా ప్రథమస్థానం. ఇలా చెప్పుకొంటూ పోతే దేశంలోని రాష్ట్రాలన్నీ మన దగ్గర ఏం జరుగుతున్నదని తెలుసుకునేందుకు క్యూ కట్టాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో 200 మిలియన్ యూనిట్లను దాటి 202 మిలియన్

మిగతా 15 వ పేజీలో

నేటి నుంచి బయో ఏషియా సదస్సు



- ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- హెచ్‌ఐసీసీ వేదికగా మూడురోజుల కార్యక్రమం

6

విప్రో సబ్బుల పరిశ్రమ

తెలంగాణకు మరో మెగా ప్రాజెక్టు.. 220 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు


వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో బుధవారం బాలీవుడ్ నటి దీపికా పదుకోణ్‌తో కరచాలనం చేస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు. చిత్రంలో విప్రో సీఎస్‌వో రిషద్ ప్రేమ్‌జీ కూడా ఉన్నారు

మహేశ్వరంలో సబ్బులు, సౌందర్య ఉత్పత్తుల యూనిట్

- మంత్రి కేటీఆర్‌తో విప్రో సీఎస్‌వో రిషద్ ప్రేమ్‌జీ భేటీ
- పరిశ్రమ ఏర్పాటుకు సహకరిస్తామన్న మంత్రి
- టీ హబ్, టీ వర్క్స్, ఇన్నోవేషన్ రంగంలో అవకాశాలపై వివరణ
- వీహబ్‌తో భాగస్వామ్యానికి విజ్ఞప్తి
- సిస్టర్ స్టేట్‌గా తైవాన్ రాష్ట్రం తయువాన్
- పరస్పర వ్యాపార సహకారానికి ఒప్పందం
- ఘనంగా ముగిసిన ఐటీ కాంగ్రెస్, నాస్కాం ఇండియా లీడర్‌షిప్ సదస్సు
- వచ్చే ఏడాది ఆర్మేనియాలో నిర్వహణ
- సదస్సు విజయవంతంపై నాస్కాం కృతజ్ఞతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణకు మరో మెగా ప్రాజెక్టు రానున్నది. ప్రఖ్యాత విప్రో సంస్థ తన ఉత్పత్తి యూనిట్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నది. మూడురోజుల పాటు ఘనంగా జరిగిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్ చివరి రోజైన బుధవారం తెలంగాణ ప్రభుత్వం రెండు కీలక ఒప్పందాలు చేసుకొన్నది. విప్రో సౌందర్య ఉత్పత్తుల తయారీ యూనిట్ ఏర్పాటు ఒప్పందంతోపాటు తైవాన్‌లోని తయువాన్ రాష్ట్రంతో సిస్టర్‌స్టేట్ ఒప్పందం కుదుర్చుకొన్నది. బుధవారం విప్రో సంస్థ ముఖ్య ప్రణాళికాధికారి (సీఎస్‌వో) రిషద్ ప్రేమ్‌జీతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి తారకరామారావు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో తాము తెలంగాణలో ఒక తయారీ కేంద్రాన్ని నెలకొల్పనున్నట్లు మంత్రికి రిషద్ ప్రేమ్‌జీ తెలిపారు. విప్రో వినియోగదారుల సంరక్షణ ఉత్పత్తుల విభాగం ఆధ్వర్యంలో సబ్బులు, ఇతర

మిగతా 6వ పేజీలో


వనపర్తి జిల్లా కనిమెట్టలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

వనపర్తి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

రెండు కార్లు ఢీకొని తొమ్మిది మంది మృతి

2

మక్కళ్ నీది మయ్యం

ఇదే కమల్‌హాసన్ రాజకీయ పార్టీ.. మదురై సభలో ప్రకటన

- నాది మధ్యేమార్గం.. ప్రజాపాలనకు ఇదే మొదటి అడుగు
- కుల రాజకీయాల అంతమే ఆకాంక్ష: కమల్‌హాసన్

5

అమరులకు నివాళిగా మహా దీపకళిక

- అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రమిద ఆకారంలో స్మృతికేంద్రం
- 23 అడుగుల ఎత్తుతో స్టెయిన్‌లెస్ స్టీల్ నిర్మాణం
- సుమారు రూ.90 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయం..
- మార్చి తొలివారంలో టెండర్లు.. డిసెంబరు 9 నాటికి సిద్ధం
- తుది డిజైన్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోదం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల స్మృతికి ఘనంగా నివాళులు అర్పించేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రణాళిక సిద్ధం చేశారు. తెలంగాణ రాష్ట్రసాధన మహోద్యమంలో అమరుల త్యాగాలను స్మరించే మహాస్మృతికేంద్రం నమూనాను ఖరారు చేశారు. ప్రపంచ ఉద్యమాల్లో తెలంగాణ ఉద్యమం తనదైన ప్రత్యేకతను చాటుకున్నది. ఇప్పుడు అమరవీరుల స్తూపం కూడా ప్రపంచంలో అపూర్వమైన రీతిలో ఉండేలా సీఎం జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సర్వహంగులతో ప్రత్యేకతను చాటుకునేలా స్మృతికేంద్రం నిర్మాణం జరుగాలని దిశానిర్దేశం చేశారు. అమరవీరుల స్తూపం, స్మృతివనం నిర్మాణాన్ని ఆయన అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. హుస్సేన్‌సాగర్ తీరంలో ఏర్పాటు చేయబోయే అమరవీరుల స్తూపాన్ని ప్రమిద ఆకృతిలో డిజైన్ చేశారు. ఈ అపురూప స్మారకానికి రూ.90 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా. సాధారణంగా స్మృతిస్తూపాలను రాయి లేదా సిమెంటు వంటివాటితో నిర్మిస్తుంటారు. కానీ, తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని పూర్తిస్థాయిలో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మించనున్నారు. దీని ఎత్తు 23 మీటర్ల వరకు ఉంటుంది. సాధారణంగా ఆరు లేదా ఏడు అంతస్తుల భవనంతో ఇది సమానం. తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన అమరవీరుల స్తూపం ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తుందనడంలో సందేహంలేదు. అమరవీరుల స్తూపానికి సంబంధించిన నిర్మాణం, డిజైన్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ఆమోదం తెలిపారు. మార్చి తొలివారంలో దీనికి టెండర్లు పిలువనున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ ఈ కేంద్రం నిర్మాణ వ్యవహారాలను పర్యవేక్షించనున్నది. డిసెంబరు 9వ తేదీలోపే నిర్మాణాన్ని పూర్తిచేయాలని భావిస్తున్నారు. 25 మంది ప్రఖ్యాత డిజైనర్లు, ఆర్టిస్టులు కలిసి ఈ డిజైన్ రూపొందించారు. ఇక్కడికి వచ్చినవారు కొంత సమయం గడిపేలా, తెలంగాణ ప్రాంత చరిత్ర, అమరవీరుల త్యాగాలు తెలుసుకునేలా ఒక మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. స్తూపం ప్రాంగణంలో ఒక మ్యూజికల్ ఫౌంటెయిన్‌ను, సమీపంలో మరో పిల్లర్‌పై తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. సందర్శకుల వాహనాలకోసం రెండంతస్తుల్లో పార్కింగ్‌తోపాటు, రెస్టారెంట్ కూడా ఏర్పాటు చేయనున్నారు. స్తూపం మాత్రమే కాకుండా అనేక ప్రత్యేకతలుంటాయని స్మారకకేంద్రం డిజైన్ రూపకల్పనలో పాల్గొన్న ఆర్టిస్టు రమణారెడ్డి 'నమస్తే తెలంగాణ'తో చెప్పారు. ఇదో వెలుగుతున్న దీపపు ప్రమిదను పోలి ఉంటుందన్నారు. స్తూపాన్ని చూడగానే అమరవీరుల స్థూపం అన్నది స్ఫురణకు వచ్చేలా డిజైన్ ఉంటుందని చెప్పారు. ప్రపంచంలో తొలిసారి స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మిస్తున్న స్మారక చిహ్నం ఇదేనని చెప్పారు. వర్షం, ఎండ, తేమను తట్టుకునేలా డిజైన్ చేశామని, దీనికి వాడే స్టెయిన్‌లెస్ స్టీల్ అత్యంత దృఢంగా ఉంటుందని అన్నారు. తుప్పు పట్టడం, విరిగిపోవడం వంటివి లేకుండా వందల ఏండ్లపాటు మన్నిక ఇస్తుందని చెప్పారు. ఒక మ్యూజియం, ఆడిటోరియం, చిన్నచిన్న సమావేశ మందిరాలు కూడా ఉంటాయని, పూర్తిగా పైకివెళ్లి చూస్తే బుద్ధవిగ్రహం, సంజీవయ్యపార్కులో ఉన్న అతిపెద్ద జెండా, అమరవీరుల స్థూపం ఒకేవరుసలో ఉన్నట్టు కనపడేలా రూపకల్పన చేశామని వివరించారు. ఇక ప్రమిదలోని దీపాన్ని విద్యుత్ దీపాలతో వెలిగించేందుకు గ్లోసైన్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తామని, దీనికోసం ప్రత్యేక ఫైబర్ మెటీరియల్ ఉపయోగించనున్నామని రమణారెడ్డి పేర్కొన్నారు.



మహాస్మృతివనం ఏర్పాటుపై కేటీఆర్ చేసిన ట్వీట్





సోదరి విమలాబాయి పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు ఉన్నారు.

సీఎం కేసీఆర్ సోదరి కన్నుమూత

విమలాబాయి అంత్యక్రియలకు హాజరైన ముఖ్యమంత్రి, మంత్రులు

హైదరాబాద్/మల్కాజిగిరి, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రెండో సోదరి పర్వతనేని విమలాబాయి (82) బుధవారం కన్నుమూశారు. కొంతకాలంగా అస్వస్థతతో ఉన్నఆమె యశోదా దవాఖానలో చికిత్స పొందుతూ ఉదయం మృతిచెందారు. ఆమెకు భర్త రాజేశ్వరరావు, కుమారులు భూపాల్‌రావు, శ్రీనివాస్‌రావు, విజయభాస్కర్, కూతురు చంద్ర ఉన్నారు. సోదరి మృతివార్త తెలిసిన వెంటనే సీఎం కేసీఆర్ తన సతీమణి శోభతో కలిసి హుటాహుటిన అల్వాల్‌లోని నివాసానికి చేరుకొని అక్క పార్థివదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. బాల్యం నుంచి అక్కతో తనకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. బావ, ఆయన పిల్లలను ఓదార్చారు. తిరుమలగిరిలోని స్వర్గ శ్మశానవాటికలో మధ్యాహ్నం విమలాబాయి అంత్యక్రియలు నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు తొమ్మిది మంది తోబుట్టువులు, ఒక సోదరుడు ఉన్న విషయం తెలిసిందే. విమలాబాయి అంత్యక్రియలయ్యే వరకు సీఎం అక్కడే ఉన్నారు. డిప్యూటీ మహమూద్ అలీ, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎంపీ కల్వకుంట్ల కవిత, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సాయన్న, ఎమ్మెల్సీలు మైనంపల్లి హన్మంతరావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కంటోన్మెంట్ టీఆర్‌ఎస్ ఇన్‌చార్జి గజ్జెల నాగేశ్ తదితరులు హాజరై విమలాబాయి పార్థివదేహానికి నివాళులు అర్పించారు.

దళిత సంక్షేమ పథకాలు భేష్

- స్కాలర్‌షిప్‌లు, కల్యాణలక్ష్మితో ప్రయోజనం
- తెలంగాణలోనే అట్రాసిటీ కేసులు తక్కువ
- రాష్ట్రంలో మూడేండ్లలో నేరాలు అదుపులో ఉన్నాయి
- జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రామ్‌శంకర్ కథేరియా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:



బుధవారం మీడియాతో మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రామ్‌శంకర్ కథేరియా

రాష్ట్ర ప్రభుత్వం దళితుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రామ్‌శంకర్ కథేరియా, వైస్ చైర్మన్ ఎల్ మురుగన్ పేర్కొన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కల్యాణలక్ష్మి పథకాల ద్వారా దళిత కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ప్రశంసించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఎస్సీసంక్షేమం, అభివృద్ధి పథకాల అమలు, వారి రక్షణ, ప్రభుత్వపరంగా కల్పిస్తున్న ప్రయోజనాలపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ బృందం సమావేశమైంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఆయా విభాగాల అధికారులు బృందానికి వివరించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఎస్సీ అట్రాసిటీ కేసులు తక్కువ శాతం నమోదయ్యాయని తెలిపారు. పోలీసు అధికారులతో సుదీర్ఘంగా చర్చించామని, తెలంగాణలో గత మూడేండ్లలో నేరాలు అదుపులోకి వచ్చాయని గుర్తించామని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ పేర 2017-18 బడ్జెట్‌లో కేటాయించిన రూ.14,375కోట్ల నిధుల్లో ఇప్పటివరకు 50శాతం ఖర్చు చేశారని, మిగిలిన నిధులు వెచ్చించాలని సూచించామని తెలిపారు. సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు కే రాములు, యోగేంద్ర పాశ్వాన్, స్వరాజ్ విద్వాన్, జాయింట్ సెక్రటరీ స్మిత తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి బల్దియా చర్యలు భేష్

గ్రేటర్ హైదరాబాద్‌లో పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి బల్దియా తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని జాతీయ ఎస్సీ కమిషన్ ప్రశంసించింది. కాంట్రాక్టు విధానంలో కాకుండా స్వయం సహాయక బృందాలుగా నియమించుకోవడంపై హర్షం వ్యక్తంచేసింది. బుధవారం జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో ఎస్సీ కమిషన్ పలు విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమైంది. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీలోని సఫాయి కర్మచారీలకు అందిస్తున్న సదుపాయాల గురించి అధికారులు కమిషన్‌కు వివరించారు. జీహెచ్‌ఎంసీలో ఉన్న మొత్తం పారిశుద్ధ్య కార్మికులను 2,626 స్వయం సహాయక గ్రూపులుగా ఏర్పాటుచేసి వారికే పనులు అప్పగించామని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుడికి నెలకు రూ.14 వేల వేతనం ఇస్తున్నట్టు తెలిపారు. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే సామాజిక భద్రత కింద వారి వారసులకు ఉద్యోగం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. 28 బస్తీ దవాఖానలు ఏర్పాటు చేస్తున్నామని, కార్మికులందరికీ ఈఎస్‌ఐ కార్డులను జారీచేసి, కార్మికసంక్షేమశాఖ ద్వారా రూ.ఆరు లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించామని వివరించారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి దేశమంతటా తెలంగాణ తరహా చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధుల పథకాన్ని దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలు అన్నిటిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్‌కు సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (సీడీఎస్) విజ్ఞప్తి చేసింది. కమిషన్ చైర్మన్ రాంశంకర్ కతేరియాకు సీడీఎస్ డైరెక్టర్ వైబీ సత్యనారాయణ బుధవారం ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వం భూమిలేని దళితులకు భూమిని సమకూర్చడం, కల్యాణలక్ష్మి, బలహీనవర్గాలకు డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించడం, రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీలు ఏర్పాటు చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ బాలబాలికల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడం, హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా, అంబేద్కర్ విదేశీ విద్యానిధి ఏర్పాటు వంటి చర్యల ద్వారా తెలంగాణ ప్రభుత్వం దళిత, ఆదివాసీ అనుకూల చొరవలను చేపట్టిందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

27, 28 తేదీల్లో షీలాబిడే కమిటీ సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 27, 28 తేదీలలో తొమ్మిదో షెడ్యూల్ సంస్థల విభజనపై షీలాబిడే నేతృత్వంలోని కమిటీ సమావేశం పరిశ్రమభవన్‌లో జరుగనున్నది. ఇప్పటివరకు జరిగిన ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజన తదితర అంశాలపై సమావేశంలో చర్చించి నివేదికలను రూపొందిస్తారు. ఈ షెడ్యూల్‌లోని 90 సంస్థలలో 70 సంస్థల విభజనలపై ప్రాథమికంగా అవగాహనకు వచ్చారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.42 గంటలకు



సూర్యాస్తమయం: 6.17 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం షష్ఠి తె. 3.52 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: భరణి మధ్యాహ్నం 1.35 వరకు, తదుపరి కృత్తిక, అమృతఘడియలు: ఉదయం 8.52 నుంచి 10.28 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.56 నుంచి 3.23 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.11 నుంచి సాయంత్రం 4.44 వరకు, వర్జ్యం: లేదు.

మండుతున్న ఎండలు

- 19 నుంచి 22 డిగ్రీలకు చేరిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- ములుగులో అత్యధికంగా 37.4 డిగ్రీల ఉష్ణోగ్రత


హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోత, ఎండ తీవ్రతతో జనం అప్పుడే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా చాలాప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 37 డిగ్రీలపైనే నమోదైనట్టు తెలంగాణ వాతావరణశాఖ వెల్లడించింది. ఆకాశం నిర్మలంగా ఉండడం, ఉత్తరాది నుంచి చలిగాలుల తీవ్రత తగ్గడంతో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవుతున్నట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 14 డిగ్రీల నుంచి 20 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. అత్యల్ప ఉష్ణోగ్రత 13.8 డిగ్రీలు రంగారెడ్డి జిల్లాలోని చుక్కార్‌లో, గరిష్ఠ ఉష్ణోగ్రత 37.4 డిగ్రీలు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ములుగులో నమోదైంది. హైదరాబాద్‌లో గరిష్ఠంగా 37.2 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 17.8 డిగ్రీలుగా నమోదైంది. రానున్న రెండురోజుల్లోనూ ఎండల తీవ్రత క్రమంగా పెరిగే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. సాధారణస్థాయి కంటే మూడు డిగ్రీలు అధికంగా కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

యథావిధిగా టీఆర్టీ

- వెబ్‌సైట్‌లో సరిచేసిన హాల్‌టికెట్లు అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- అనుమానాల నివృత్తికి సహాయ కేంద్రాలు
- వచ్చేనెలలో టీజీటీ పరీక్ష ఫలితాలు
- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24 నుంచి టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ) పరీక్షలను నిర్వహిస్తామని, అభ్యర్థులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. బుధవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అభ్యర్థులు సరిచేసిన హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియలో సీజీజీ వల్ల కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటిని బుధవారం పరిష్కరించామని వివరించారు. కొంత మంది వ్యక్తులు కావాలనే టీఎస్‌పీఎస్సీ పరీక్షల నిర్వహణపై అసత్య ప్రచారం చేస్తున్నారని, ఇందుకోసం ఎక్కువగా సోషల్ మీడియాను ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి అసత్య ప్రచారం వల్ల పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహించడంతోపాటు పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. టీఆర్టీకి సంబంధించిన 48 రకాల క్యాటగిరీల్లో స్కూల్ అసిస్టెంట్‌లో 2, ఎస్జీటీలో 2 చొప్పున క్యాటగిరీలను మినహాయించి.. మిగతా పరీక్షలన్నీ ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. టీజీటీ పోస్టుల భర్తీకి సంబంధించిన ఫలితాలను వచ్చేనెలలో విడుదల చేస్తామని చెప్పారు. పరీక్షల విషయంలో అభ్యర్థులకు ఉన్న అనుమానాలు, సందేహాలకు పరిష్కారం చూపించడానికి టీఎస్‌పీఎస్సీలో సహాయకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఇది అందుబాటులో ఉంటుందన్నారు. సహాయ కేంద్రం ఫోన్‌నంబర్‌ను కూడా త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. పరీక్షల నిర్వహణకు అందుబాటులో ఉన్న కేంద్రాలను గుర్తించామని.. హెచ్‌ఎండీఏ పరిధిలో అధిక సంఖ్యలో కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వదంతులకు పాల్పడుతున్నవారి జాబితాలను టీఎస్‌పీఎస్సీ సేకరిస్తున్నదని, కొంతమంది వివరాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. వదంతులు మితిమీరితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని, దీనిపై పోలీసులను సంప్రదిస్తామని వివరించారు. సమావేశంలో టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ వాణీప్రసాద్ పాల్గొన్నారు.



టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి. చిత్రంలో సెక్రటరీ వాణీప్రసాద్

లోకం పోకడ



మీరు నన్ను రోబోలాంటి మనిషిని చేశారు!

పెండ్లిండ్ల వేళ పెను విషాదం

తొమ్మిది మందిని బలిగొన్న రోడ్డు ప్రమాదం


- టైరు పగులడంతో ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్న మరోకారు
- వనపర్తి జిల్లా కనిమెట్టలో ప్రమాదం

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధానప్రతినిధి:

వారంతా కష్టజీవులు.. హైదరాబాద్‌కు వచ్చి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొందరు వివాహానికి హాజరయ్యేందుకు వెళుతుండగా, మరికొందరు మరో వివాహానికి హాజరై తిరుగుప్రయాణమయ్యారు. బుధవారం 44వ జాతీయరహదారిపై జరిగిన రోడ్డుప్రమాదం వారి బతుకులను చిదిమేసింది. ముందుభాగంలోని టైరు పగులడంతో అదుపుతప్పిన కారు డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా, దవాఖానలో చికిత్స పొందుతూ ఇద్దరు మరణించారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలోకి వెళితే.. వనపర్తి జిల్లా ఆత్మకూరు, అమరచింత, మదనాపురం మండలాలకు చెందిన బీరప్ప(26), ఆంజనేయులు(40), రాజు(38), మల్లేశ్(28), లంకాలకుర్వ నరేశ్(34), మొగులయ్య కొన్నేండ్లుగా హైదరాబాద్‌లోని మల్లాపూర్ ప్రాంతంలో ఉంటున్నారు. వీరిలో బీరప్ప క్యాబ్ నడుపుతుండగా, మిగిలినవారు పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒకే కాలనీలో ఉండేవీరంతా బుధవారం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమళ్లలో జరిగే ఓ వివాహానికి హాజరయ్యేందుకు బీరప్ప కారు(టీఎస్ 08యూఏ 3801) లో బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి బయలుదేరారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామ పరిధిలో పిరమిడ్ ఫుడ్‌కోర్టు సమీపంలోకి రాగానే ముందుభాగంలోని కుడివైపు టైరు పగిలిపోయింది. దీంతో వేగంగా ఉన్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు అవతల ఎదురుగా కర్నూలు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారు (టీఎస్ 08 ఈక్యూ 8108)ను ఢీకొట్టింది. దీంతో బీరప్ప, ఆంజనేయులు, రాజు, మల్లేశ్‌లతో పాటు, ఎదురుగా వస్తున్న కారులోఉన్న సూరిబాబు(52), ప్రసూన(70), రాజేశ్వరి(65) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రగాయాలైన నరేశ్, మొగులయ్య, సునీత(42), కల్పనలను మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ నరేశ్, సునీత మృతిచెందారు.



ప్రమాదం జరిగిన దృశ్యం



ఆంజనేయులు (ఫైల్)



నరేష్ (ఫైల్)



మృతదేహాలను మార్చురీకి తరలిస్తున్న దృశ్యం



రాజు (ఫైల్)



క్యాబ్ డ్రైవర్ బీరయ్య(ఫైల్)



కుర్వ మల్లేష్ (ఫైల్)

వివాహానికి హాజరై తిరిగి వస్తుండగా..

కర్నూలు జిల్లా కల్లూరు ప్రాంతానికి చెందిన సూరిబాబు హైదరాబాద్‌లోని బడంగ్‌పేటలో పరుపుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కర్నూలులో ఉండే తన అక్క ప్రసూన ఇంట్లో వివాహానికి రెండురోజుల క్రితం భార్య సునీత, కూతురు కల్పనతో కలిసి వెళ్లాడు. బుధవారం ఉదయం అక్కలు రాజేశ్వరి, ప్రసూనలతో కారులో హైదరాబాద్‌కు తిరుగుప్రయాణమయ్యాడు.మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు. మృతుల్లో ఆంజనేయులుది ఆత్మకూరు మండలం మూలమళ్ల, రాజు మదనాపురం మండలం అజ్జకొల్లు, బీరప్పది మదనాపురం మండలం గోపన్‌పేట, నరేశ్, మల్లేశ్‌లది అమరచింత మండలం మస్తిపురం.ప్రమాద సమాచారం తెలుసుకున్న వనపర్తి జేసీ నిరంజన్‌రావు, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఎస్పీ సురేందర్ రెడ్డి ఘటనాస్థలానికి చేరుకున్నారు. వాహనాల్లో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకుతీసేందుకు శ్రమించాల్సి వచ్చింది. వనపర్తి ప్రభుత్వ దవాఖానలో ప్రణాళికాసంఘంఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఇంగ్లిష్‌లోనూ ప్రశ్నలు ఇవ్వండి

- పీఈటీ పరీక్షపై టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాల్లో భాగంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న పరీక్షల ప్రశ్నాపత్రాన్ని తెలుగుతోపాటు ఆంగ్లంలో కూడా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ను ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. సిలబస్‌ను ఆంగ్లంలో పెట్టి తెలుగులో మాత్రమే ప్రశ్నాపత్రం రూపొందించడాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది.

రవాణశాఖలో జూనియర్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీ

- అనుమతులు ఇస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర రవాణాశాఖ కమిషనరేట్‌లో ఖాళీగా ఉన్న 9 జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి రాష్ట్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు పరిపాలనాపరమైన అనుమతులిస్తూ ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శివకుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను రవాణాశాఖ అధికారులు టీఎస్‌పీఎస్సీకి అందజేయాలని పేర్కొన్నారు. నివేదిక అందిన వెంటనే పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ చర్యలు తీసుకుంటుంది. ఇటీవల రవాణాశాఖలో కల్పించిన పదోన్నతుల నేపథ్యంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీలు ఏర్పడ్డాయి. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రవాణాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను అంచెలంచెలుగా భర్తీ చేస్తున్నది. ఇప్పటికే 44 మంది ఏఎంవీఐలు, ముగ్గురు ఆర్టీవోలు, 119 మంది కానిస్టేబుళ్లను టీఎస్‌పీఎస్సీ ద్వారా పరీక్షలు నిర్వహించి ఎంపికచేసింది.



వటపత్రశాయిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీలక్ష్మీనరసింహుడు

వటపత్రశాయిగా యాదాద్రీశుడు

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నర్సన్న బుధవారం వటపత్రశాయిగా ప్రత్యేక అలంకరణలో కనువిందు చేశారు. శ్రీవారు ఇష్టవాహనాలపై ఊరేగుతూ బుధవారం అర్ధరాత్రి విహరించారు. శ్రీదేవి, భూదేవితో కల్పవృక్ష వాహనంపై ఉత్సవమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రముఖ పారిశ్రామికవేత్త జూపల్లి జగపతిరావు, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జైస్వాల్ కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గీత, అనువంశికధర్మకర్త నర్సింహామూర్తి పాల్గొన్నారు. గురువారం స్వామివారికి గోవర్ధనగిరి అలంకారసేవ, రాత్రి సింహవాహన సేవ నిర్వహిస్తారు.

కాంగ్రెస్ నేతల డ్రామాలను ప్రజలు నమ్మరు

- ప్రజాచైతన్యయాత్ర పేరుతోపదవుల రాజకీయ యాత్ర
- జనం ముందుకు వెళ్ళి ఏం చెప్తారు?
- కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు
- ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపాటు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని అడ్డుకోవడానికి కాంగ్రెస్ నేతలు ప్రజాచైతన్యయాత్ర పేరుతో సరికొత్త డ్రామాకు తెరతీశారని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ దుయ్యబట్టారు. అభివృద్ధిని అడ్డుకోవడానికి బోగస్ యాత్ర చేస్తున్న కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. అది రాజకీయ స్వార్థంతో చేపడుతున్న యాత్ర తప్ప మరొకటికాదని ఆయన ధ్వజమెత్తారు. ఈ యాత్రతో ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. అసలు ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదని స్పష్టంచేశారు. టీఆర్‌ఎస్‌ఎల్పీలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి కాంగ్రెస్ చేపట్టనున్న ప్రజాచైతన్య యాత్ర ప్రజల కోసం కాదని, అది వారి పదవుల రాజకీయ యాత్ర అని కర్నె ప్రభాకర్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటిదాకా పచ్చి అబద్ధాలను పోగేసి గాంధీభవన్ వేదికగా కామెడీషోలు చేశారని, ఇప్పుడు ఆ షోలను ప్రజల ముందు చేసి అబద్ధాలను పదే పదే ప్రచారం చేసేందుకు బయలుదేరుతున్నారని విమర్శించారు. ఎన్నికల సెమీఫైనల్‌కు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ నేత షబ్బీర్‌అలీ పేర్కొనడాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎక్కడ గెలిచిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఒక ముసలినక్క అని ఆయన అభివర్ణించారు. ముందుగా రేవంత్‌రెడ్డి రాజీనామా డ్రామాపై షబ్బీర్ వంటి కాంగ్రెస్ నాయకులు మాట్లాడితే బాగుంటుందన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి కాంగ్రెస్ నేతలు కొత్తగా చెప్పడానికి ఏముంది? అని ఆయన నిలదీశారు. 'కాంగ్రెస్ సర్కస్‌లు, డ్రామాలు ప్రజల మధ్య నడువవు' అని కర్నె ప్రభాకర్ అన్నారు. తమ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తూ లక్షలాది ఎకరాలకు సాగునీరు ఇవ్వడం వల్ల పాలమూరు జిల్లా పచ్చగా కళకళలాడుతున్నదని అన్నారు.







అవినీతి, లంచగొండితనానికి కర్ణాటక ముఖ్యమంత్రి ప్రతీకగా మారారు. సీఎం సిద్ధరామయ్య, అవినీతి పర్యాయపదాలుగా మారిపోయాయి. కర్ణాటకలో 150 సీట్లను ఎలా గెలుచుకోవాలో మాకు తెలుసు.

అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు

అమిత్ షా, యడ్యూరప్ప ఇద్దరూ జైలు దోస్తులు. సోహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో షా జైలు ఊచలు లెక్కించాడు. భూ కుంభకోణం కేసులో యడ్యూరప్పా జైలుకెళ్లాడు. ఇలాంటి జైలు పక్షులు అవినీతి గురించి మాట్లాడుతున్నాయి!

సిద్ధరామయ్య, కర్ణాటక ముఖ్యమంత్రి



చరిత్రలో నేడు



1907

లండన్‌లో మొదటిసారి మీటర్లతో క్యాబ్ టాక్సీలు ప్రారంభం.

1935



అమెరికా అధ్యక్ష భవనం పైనుంచి విమానాలు ఎగురడం నిషేధం.



1965

భూ కక్ష్యలోకి కాస్మోస్-57ను ప్రవేశపెట్టిన సోవియట్ రష్యా.

దేశంలోని ప్రభుత్వరంగ బ్యాంకుల్లో దొంగలు పడ్డారు. ఒకదాని తర్వాత ఒక టిగా అతిపెద్ద బ్యాంకు కుంభకోణాలు వెలుగుచూశాయి. 11,500 కోట్ల పీఎన్‌బీ కుంభకోణం వెలుగులోకి వచ్చిన కొద్దిరోజులకే 3,695 కోట్ల కుంభ కోణం బయటకువచ్చింది. ఈ రెండు కుంభకోణాల్లోనూ పోలికలున్నాయి. అవి అప్పులివ్వటంలో బ్యాంకులు చూసే బాహ్య పర్యవేక్షణ, బ్యాంకుల్లో నిరంతరం ఉండాల్సిన అంతర్గత నిఘా, నిర్వహణ లోపం ఈ రెండు కుంభ కోణాల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. ఆదాయానికి మించి అప్పులు తీసుకుం టున్నా, విచక్షణారహితంగా ఓవర్ డ్రాఫ్ట్‌లు తీసుకుంటున్నా నియంత్రణే లేకుండాపోయింది. ఇప్పటికైనా బ్యాంకింగ్ రంగం కండ్లు తెరువాలి.

ది హిందూ

భారతదేశంలో మనిషి స్వేచ్ఛగా జన్మించే స్థితిలేదు. పుట్టక ముందే, ఆ తర్వాత హత్యకు గురయ్యే దురాచారం కొనసాగుతున్నది. జపాన్‌లో వెయ్యిమంది శిశు జననాల్లో ఒకరు దుర్మరణం పాలవుతుండగా, దేశంలో ప్రతి వెయ్యి మందిలో 25 మంది చనిపోతున్నారు. యూనిసెఫ్ అధ్యయనం ప్రకారం శిశుమరణాల్లో అతి పేద దేశాల్లో భారత్ 12వ స్థానంలో ఉన్నది. ఈ మరణాలకు ఆర్థిక దుస్థితే కారణమని అంటున్నా, సామాజిక కారణాలే శిశు మరణాల్లో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. శిశు మరణాలను తగ్గించ కుండా అభివృద్ధి గురించి ఎంతచెప్పినా అదంతా అమానవీయమైనదే.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

శాస్త్ర సద్వినియోగం

అంతర్జాతీయ సదస్సులకు అత్యుత్తమ వేదికగా అలరారుతున్న హైదరాబాద్ నగరంలో తాజాగా కృత్రిమ మేధపై అంతర్జాతీయ సమ్మేళనం సాగడం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ప్రముఖ ఐటీరంగ దిగ్గజాలు రావడంతోపాటు, రోబో సోఫియా ఈ సమావేశాలకు ప్రత్యేక ఆక ర్షణగా నిలిచింది. దేశంలోనే తొలిసారిగా ప్రపంచ ఐటీ సమ్మేళనాన్ని హైదరాబాద్ నగరంలో ఏర్పాటుచేయడం వెనుక తెలంగాణ ప్రభుత్వ కృషి ఉన్నది. ఈ సమావేశాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నాస్కాంతో కలిసి హైదరాబాద్ నగరంలో కృత్రిమ మేధ, డేటా విజ్ఞాన విశిష్ట కేం ద్రాన్ని ఏర్పాటుచేయ నిశ్చయించడం విశేషం. ఈ ఐటీ సమ్మేళనానికి ప్రేరకులైన రాష్ట్ర ఐటీ మం త్రి కేటీఆర్ చెప్పినట్టు – కృత్రిమ మేధ, డేటా విజ్ఞానం 2025 నాటికి 16 బిలియన్ డాలర్ల పరి శ్రమగా వృద్ధి చెందే నేపథ్యంలో ఇటువంటి విశిష్ట కేంద్రం ప్రాధాన్యం పొందుతున్నది. కొత్త ఆవిష్కరణలకు, పరిశ్రమల పురోభివృద్ధికి, ఉపాధి కల్పనకు ఈ కేంద్రం తోడ్పడుతుంది. రాబో యేరోజుల్లో డేటా విజ్ఞానం అధ్యయనాలకు, రూపకల్పనకు మహాగనిగా మారుతుంది. ప్రతి రంగమూ ఈ డేటా విజ్ఞానాన్ని ఇమిడించుకోకతప్పదు. కృత్రిమ మేధ కూడా విజ్ఞానశాస్త్రంలో, పారిశ్రామిక వ్యవస్థలో, మానవ జీవనంలో అపూర్వ మార్పులను ప్రవేశపెట్టనుంది. ఈ సమా వేశాలను ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తూ– భారత సమాజం సాంకేతి కను అతి సులభంగా ఒడిసిపట్టుకునే సంస్కృతి గలదని చెప్పడం గమనార్హం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐటీ ఒగాన్ని అతివేగంగా వృద్ధి చేయడంతోపాటు గ్రామీణ జనానికి డిజిటల్ విప్లవాన్ని చేరువ చేయడానికి కృషి చేస్తున్నది. ఈ కృషి ఫలితమే ప్రపంచ ఐటీ సమ్మేళనానికి హైదరాబాద్ నగరాన్ని వేదికగా మార్చింది. రాబోయే రోజులలో కృత్రిమ మేధ పునాదిగా ఏర్పడే పరిశ్రమలలో భారీగా ఉపాధి కల్పన జరిగే సూచనలు ఉన్నాయి.

కృత్రిమ మేధపై అవగాహన గల శాస్త్రవేత్తలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మానవులలో విలువలు పెంపొందించడానికి కృషి సాగించాలె తప్ప విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలను అడ్డుకోవడం సబబు కాదు. కలమై నా, ఖడ్గమైనా మానవులు ఉపయోగించుకునే తీరుపై ఉంటుంది. అణుశక్తిని వైద్యం కోసం వాడుకోవచ్చు, మానవ వినాశనానికి ఉపయోగించవచ్చు. విజ్ఞానశాస్త్రం కొత్త పుంతలు తొక్కినప్పుడల్లా దాని పర్యవసానంపై భయాందోళనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. కొత్త విజ్ఞాన ఆవిష్కరణలను ఆహ్వానిస్తూనే, వాటిని మానవ పురోభివృద్ధికి ఉపయోగించుకోవడానికి సిద్ధపడాలె.

కృత్రిమ మేధ విజ్ఞాన శాస్త్ర, పారిశ్రామిక రం గాలలో సంచలనం సృష్టిస్తుందనడంలో సందే హం లేదు. అయితే యంత్ర మానవుల సృష్టిపై చర్చ ఎంత ఆసక్తిదాయమైనదో, అంత ఆలో చింపదగినది. ఐటీ సమ్మేళనంలో రోబో సోఫియా సృష్టికర్త డేవిడ్ హాన్సన్ వెలిబుచ్చిన అభిప్రాయాలు ఈ చర్చను ముందుకు తీసుకు పోయేవిగా ఉన్నాయి. కృత్రిమ మేధ వల్ల నిజ మైన ప్రమాదమేమీ లేదని ఆయన అంటూనే, పరోక్ష హెచ్చరికలను చేశారు. యంత్ర మేధ మానవ మేధను మించి పై చేయి సాధిస్తుందన డానికి ఆధారాలు లేవని ఆయన అభిప్రాయప డ్డారు. దీనిని ఆయన వివరించిన తీరు కూడా గమనార్హమైనది. 'అరువై ఏండ్ల పరిశోధన తరు వాత కూడా రోబోలలో పరిస్థితులకు అనుగు ణంగా వ్యవహరించడం రాలేదు. జీవులలో ఉండే స్వేచ్ఛా దృక్పథం రోబోలకు ఏర్పడలేదు. విజ్ఞానశాస్త్ర ఆవిష్కరణలు మానవులకు సాధ్యం. కానీ యంత్రాలు వాటికవి చేయలేవు. మానవులు నిర్మించిన మేధపై ఆధారపడి వ్యవహరిస్తాయి' అని డేవిడ్ హాన్సన్ వివరించారు. కానీ రోబోల వ్యవహార సరళిపై హాన్సన్ ఇచ్చిన వివరణ మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నది. రోబోలు తమ చర్యల ఫలితం ఎట్లా ఉంటుందనే ది ఆలోచించలేవు. ఇదే భయాలకు తావిస్తు న్నది. 'విజ్ఞానానికి భయపడవలదు. కాకపోతే రాబో యే పరిణామాలపై అప్రమత్తంగా ఉం డాలె' అని ఆయన అన్నారు. ఈ యంత్రమానవులను నియంత్రించడం ఎట్లా అనేది ఇప్పుడు న్న చర్చ. ఉత్తమమైన యంత్రమానవులను సృష్టించాల నే భావన ఉన్నది. అయితే 'మానవుల లోనే స్వార్థం, మోసం, ప్రేమ, విలువల వంటి భిన్నమైన ఉద్వేగాలు ఉన్నాయి. ఇక ఉత్తమమైన విలువలుగల రోబోలను సృష్టించడం ఎట్లా సాధ్యం' అని డేవిడ్ హాన్సన్ ప్రశ్నించారు. హాన్సన్ వివరణను బట్టి యంత్ర మానవులు కాదు, మానవులే అసలు సమస్య అనేది స్పష్టమవుతు న్నది.

ఎలాన్ మస్క్‌తో సహా పలువురు కృత్రిమ మేధ పట్ల జాగ్రత్తలు అవసరమని హెచ్చరిస్తున్నా రు. కృత్రిమ మేధపై, రోబోలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొన్నది. దీని ఫలితంగా రోబోలు మానవులపై తిరుగబడే ఇతివృత్తాలతో సినిమాలు కూడా వచ్చినయి. కానీ రోబో సోఫియాను గమనిస్తే, రోబోలు మానవులపై తిరుగబడే రోజులు కనుచూపు మేరలో లేవని చెప్పవచ్చు. చాలా మంది భయపడుతున్నట్టు– , తక్షణ ప్రమాదం– రోబోలు మానవులపై తిరుగబడటం కాదు. యంత్రాలు దుష్టమానవుల చేతిలో దుర్వినియోగం కావడం. కృత్రిమ మేధపై అవగాహన గల శాస్త్రవేత్తలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మానవులలో విలువలు పెంపొందిం చడానికి కృషి సాగించాలె తప్ప విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలను అడ్డుకోవడం సబబు కాదు. కలమై నా, ఖడ్గమైనా మానవులు ఉపయోగించుకునే తీరుపై ఉంటుంది. అణుశక్తిని వైద్యం కోసం వాడుకోవచ్చు, మానవ వినాశనానికి ఉపయోగించవచ్చు. విజ్ఞాన శాస్త్రం కొత్త పుంతలు తొక్కి నప్పుడల్లా దాని పర్యవసానంపై భయాందోళనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. కొత్త విజ్ఞాన ఆవి ష్కరణలను ఆహ్వానిస్తూనే, వాటిని మానవ పురోభివృద్ధికి ఉపయోగించుకోవడానికి సిద్ధపడాలె. రోబోను అంతర్జాతీయ సమాజం దుర్వినియోగపరచకుండా నియమాలు, నియంత్రణలు రూపొందించుకోవడం అవసరం. ఈ నియమాలు కృత్రిమ మేధకే కాదు, అన్నిరంగాల విజ్ఞా

జనగళం

హర్షణీయం

ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో ఫ్లోరిన్ భూతం మనుషులను జీవచ్ఛావాలుగా మారుస్తున్నది. దీనికి జెఎన్‌టీయూహెచ్ వారు ప్రయోగాత్మకంగా విరుగుడును కని పెట్టడం హర్షణీయం. మర్రిగూడ మండ ల కేంద్రం, యరగండ్లపల్లిని ప్రయోగానికి ఎంచుకొని, ఇంకుడుగుంతల్లో బోర్లువేసి, వాటిద్వారా వాన నీటిని భూగర్భంలోకి పంపించడం ద్వారా ఫ్లోరైడ్‌ను బాగా తగ్గించడంలో విజయవంతమవడం అభి నందనీయం. రాష్ట్రవ్యాప్తంగా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో ఫ్లోరిన్‌కు చక్కని పరి ష్కారం దొరికింది. దీన్ని అంతటా అమ లు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.

- ఎస్.శ్రీనివాసరాజు, వనస్థలిపురం

కార్డన్‌సెర్చ్‌లతో భయాందోళనలు

ప్రశాంతమైన జీవితాల్లో ఇటీవల వరుసగా చేపడుతున్న 'కార్డన్‌సెర్చ్'లు భయాందోళన కలిగిస్తున్నాయి. ఉగ్రవాద నేపథ్యం, పక్కా సమాచారం ఉంటేనే ఆయా కాలనీల్లో, ఇండ్లల్లో పోలీసులు కార్డన్ సెర్చ్‌లు నిర్వహిం చాలి. దానికి భిన్నంగా పోలీసులు వ్యవహరిస్తుండటంతో నగర ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రభుత్వం ఈ విషయమై సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవాలి.

- కంది రాఘవరెడ్డి, కరీంనగర్

చర్యలు తీసుకోవాలె

నగరంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ చార్జీలు వింతగా ఉన్నాయి. ఒక స్టాప్ నుంచి మరో స్టాప్‌కు పోయే క్రమంలో ఒక ధర, వచ్చే క్రమంలో మరో ధరను తీసుకుంటూ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నా రు. ఆర్టీసీ యాజమాన్యం చొరవతీసుకొని ప్రయాణికులకు బాసటగా నిలువాలి. ఆర్టీసీ బస్ టికెట్ ధరల్లో హేతుబద్ధత ఉండేట్లు చూడాలి.

- తోట సుమన్, బేగంపేట్, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

మీడియాపై 'సభ'ల ప్రభావం ఉందా?

ఇటీవలి ప్రపంచ తెలుగు మహాసభలను పత్రికలు, ఛానళ్లు చాలా పొగిడాయి. మరి ఆ సభల ప్రభావం మీడియాపై ఎంతున్నది? తర్వాతి రెండు మాసాల కాలంలో పరిస్థితిని గమనించగా, వారు అవసరం లేకున్నా ఇంగ్లీషు పదాలను విరివిగా ఉపయోగించటం వెనుకటిస్థాయిలోనే కనిపిస్తున్నది. మార్పు రాత్రికిరాత్రి జరిగేది కాదు గాని, కనీసం ఆ దిశలో ప్రయత్నాలు అయినా ఏమైనా చేస్తున్నారా? భాషాభివృద్ధిలో తన పాత్ర కీలకమన్న విషయం తెలిసిన మీడియా, ఆ బాధ్యతను ఇంకా ఎప్పుడు గుర్తిస్తుంది?

తెలుగు భాష అభివృద్ధి గురించిన చర్చ చాలాకాలంగా జరుగుతున్నది. చర్చకు సంబంధించినంత వరకు మీడియా పెద్దపాత్రనే వహిస్తున్నది. అందుగురించిన వార్తలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, లేఖల ప్రచురణ, సంపాదకీయాల రచన బాగానే కన్పిస్తున్నది. తెలుగు భాషాదినోత్సవాల సందర్భంగా, తెలుగు అభివృద్ధికి కృషిచేసిన ప్రముఖుల జయంతి సమయాల్లో వారు మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు. కనుక భాషాభివృద్ధి అవసరం ఏమిటో, అందు లో తమ పాత్ర ఏమిటో మీడియాకు ఎవరూ చెప్పనక్కరలేదు. కాని, ఇందుకోసం పత్రికల్లో తగినంత చోటు, ఛానళ్లలో సమయం ఇవ్వటం ద్వారా అందుకు దోహదం చేస్తున్న మీడియాను అభినందిస్తూనే పని విషయంలో శ్రద్ధ ఎందువల్ల చూపటం లేదు? పత్రికలతో పోల్చితే ఛాన ళ్ల పరిస్థితి మరీ ఇంత విచారకరంగా ఎందుకున్నది?

ఈ ప్రశ్నలేవీ కొత్తవి కావు. నిరుడు డిసెంబర్ 15 నుంచి అయిదు రోజుల పాటు జరిగిన హైదరాబాద్ సభలకన్న ముందు కాలంలోనూ ఉన్నవే. ఇంకా చెప్పాలంటే ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన సభలకు ముందు వెనుకలుగానూ ఉన్నవే. కాని మీడియా వైపు నుంచి తనను తాను మార్చుకునేందుకు జరిగిన ప్రయత్నం స్వల్పం. మీడియాకు చెం దినవారు ఈ ప్రశ్నపై ఎపుడైనా సమావేశం కావటం, అందరూ సూచన లు చేయటం వరకు కొన్నిసార్లు జరిగింది. కాని అవన్నీ ఆ సమావేశాల తో ముగిసిపోవటం తప్ప ముందుకు కదలలేదు. మరింత నికరమైన చర్చలు, ఆచరణ ప్రణాళికలు, కార్యరూపాలు కన్పించలేదు. అటువం టిది ఆ రోజుల్లో మొదలై ఉంటే, చిన్నిచిన్న అడుగులతో ఈ సరికి తగి నంత ముందుకువెళ్లేది. అది ఒక కార్యాచరణ ధోరణిగా మారేది. ఆ తర హాలో ముందుకుపోవటం అసాధ్యం కాదు, పెద్ద కష్టమూ కాదు. కావ లసింది సంకల్పం, సమన్వయం, మధ్యలో ఆపకుండా కొనసాగించే శ్రద్ధ. కాని ఇవి లేకుండా పోయినందునే సమస్య ఎప్పటివలెనే కొనసా గుతున్నది.

ఇందులో భిన్నాభిప్రాయాలు, సమస్యలు లేవని కాదు, కాని అవి ఏవీ అధిగమించలేనివి కావు. కనీసం సమస్యాత్మకం అయినవాటిని పక్కన ఉంచి ఇతర అంశాలలో ముందుకుపోయే పద్ధతి ఒకటి ఉంటుం ది. ఆ ప్రకారం, మీడియాలో తెలుగు ఉపయోగాన్ని పెంచటం, ఇంగ్లీ షును వీలైనంతగా పరిహరించటంపై ఏకాభిప్రాయానికి వస్తూ ఆ పని చేయటం తప్పకుండా తేలికే. ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న తెలుగు పదాలను పోనివ్వకపోవటం, ఇటీవలి గతంలో వాడుకలో ఉండి కను మరుగవుతున్న వాటిని నిలబెట్టుకోవటం, మీడియాలో ఆధునిక కాలం లోనూ సర్వత్రా ఉపయోగిస్తుండిన మాటలు కొత్తతరాల జర్నలిస్టుల అర్ధ విద్య, అర్ధ శిక్షణలు, ఆసక్తిలేమి, పెద్ద పర్యవేక్షణా లోపం వల్ల మాసి పోతుండటాన్ని ఆపటం వంటివి కష్టమైన పనులు కాదు. కావలసింది మీడియా వారు కలిసి మాట్లాడుకొని అందుకు పూనుకోవటం. ఈ విధంగా ఇప్పటికే ఉన్న పద సంపదను ఉపయోగించి కాపాడుకోవటం ప్రాథమిక కార్యం కాగా, అసలు సవాలు మరొకటి ఉంది. అది అందరి కీ తెలిసిందే. చర్చలలోకి వస్తున్నదే. ఆధునికత విస్తరిస్తున్నా కొద్దీ వాడు కలోకి వస్తున్న వివిధ రంగాల పద సముదాయానికి సరిపోయే తెలుగు పదాలను తయారుచేసుకోవటం, దానిని ఉపయోగంలోకి తేవటమన్నది ఆ సవాలు. కొత్త పద సముదాయాల తయారీపై ప్రభుత్వ శాఖల నుంచి, ఇతర సంస్థలు వేదికలు, ఒక మేరకు మీడియా నుంచి ప్రయ త్నాలు జరుగుతూనే వస్తున్నాయి కాని ఆ పదాలు సరైనవా కావా, వాడటం తేలికా కష్టమా, వాడినప్పుడు పాఠకులకు లేదా జన సామా న్యానికి ఆమోదయోగ్యం అవుతాయా లేదా అనే ప్రశ్నలు ఎక్కువ భాగం ఎటూ తేలకుండా ఉన్నాయి. అట్లా తేల్చి ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నాలు ఇంచుమించు జరుగటం లేదు. తయారీలు–ప్రశ్నలు–వా దనలు–వదిలివేతలు అన్నట్లుగా ఉంది పరిస్థితి. ఈ పరిస్థితి మారాలంటే అందరూ కలిసి చొరవ తీసుకోవాలి. సమన్వయపరుచవలసింది ప్రభుత్వం, అకాడమీలు, మీడియా సంస్థలు.

> తెలుగు భాషాభివృద్ధిలో మీడియా పాత్ర మరొకమారు చర్చనీయం అవుతున్నది. పరిస్థితులు గత మహాసభల నాటి వంటివి అయితే మీడియా పాత్ర గురించి అంతగా మాట్లాడుకోవలసింది ఉండేది కాదు. మాట్లాడకున్నా అది మొక్కుబడికోసం అయేది. ఈసారి అట్లా జరుగరాదని మనకు మనం చెప్పుకోవాలి. మీడియా కూడా అట్లా చెప్పుకోగలదని ఆశించాలి.


గత కొన్ని దశాబ్దాల కాలంలో సృష్టి అయిన కొత్త పద సంపదను తెలుగులోకి తేవటం పరిస్థితి ఇట్లుండగా, శరవేగంతో మరింత కొత్త పద జాలం వచ్చిపడుతున్నది. ఆ విధంగా, వెనుకటి సమస్యలే పరిష్కారం కాకుండా మిగిలి ఉండగా కొత్త సమస్యలు వచ్చి ముంచెత్తుతున్నాయి. ఈ పరిస్థితిని ఆర్థిక పరిభాషను ఉపయోగిస్తూ వర్ణించాలంటే భాషా పర మైన అండర్ డెవలప్‌మెంట్ అన్నమాట. ఒకవైపు భాష విస్తరిస్తుంటే మనం కనీసం ఉన్నచోటనైనా మిగలక మరింత వెనుకకు పోవడమన్న మాట. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే రాగల 10–20 ఏండ్లలో విష యం ఇంకా విషమిస్తుంది. అది తెలుగు భాష సజీవంగా ఉంటూనే నిర్జీ వంగా మారదన్నమాట. అందుకు తగినట్లు మన వాడకంలో తెలుగు తగ్గి ఇంగ్లీషు పెరుగుతుండటం కొంతకాలం క్రితమే మొదలైంది. క్రమం గా ఇంకా పెరుగుతున్నది.

ఇందుకు అడ్డుకట్ట వేసేందుకు మనకు గల సాధారణ స్పృహ పనిచే యటం లేదు. భాషా దినోత్సవాలు, గిడుగు వర్ధంతులు, తెలుగు సభల వంటివి ప్రేరణ కావటం లేదు. మరి తరుణోపాయం ఏమిటి? గతంలో నిర్వహించుకున్న తెలుగు సభల పరిస్థితి ఇది కాగా, సుదీర్ఘ వ్యవధి తర్వాత రెండు మాసాల క్రితం హైదరాబాద్‌లో ఎంతో ఘనంగా జరిగి న సభలు ఎందువల్లనో గాని కొన్ని కొత్త ఆశలను కల్పించాయి. ముఖ్య మంత్రి కేసీఆర్ పట్టుదలగా మాట్లాడటం, కొన్ని నిర్దిష్టమైన చర్యలను ప్రకటించటం ఇందుకు కారణాలివి. ఆ మేరకు ఇప్పుడు కొన్ని సన్నా హాలు కూడా ప్రభుత్వం వైపు నుంచి కన్పిస్తున్నాయి. తెలుగులో బోధ నను ఒక పాఠ్యాంశంగా ప్రాథమిక తరగతుల నుంచి ఇంటర్ వరకు తప్పనిసరిచేస్తూ ఆర్డినెన్స్ తయారవుతుండటం, పరిపాలనారంగంలో తెలుగు వినియోగానికి ప్రణాళికల తయారీ, తెలుగు భాషా విశిష్ట కేం ద్రం ఏర్పాటు, అన్ని బోర్డులపై తెలుగును తప్పనిసరి చేయనుండటం వంటి చర్యలు సాకారం కానున్న సూచనలున్నాయి. 'మన తెలంగాణ– మన సంస్కృతి' పేరుతో ఒక పుస్తకం తయారుచేసి వచ్చే నెల ఉగాది సమయంలో కోటి కుటుంబాలకు ఇంటివద్ద అందజేసే ప్రయత్నం జరు గుతున్నది. సభల స్ఫూర్తిని, నిర్ణయ ప్రకటనలను అంతటితో వదిలివే యకుండా ఆచరణపూర్వకంగా ముందుకు తీసుకుపోయే ఈ చర్యలను గమనించినప్పుడు, గతంలో లేని కొత్త ఆశలు ఏర్పడటం సహజం.

ఇటువంటి పరిస్థితుల కారణంగానే, తెలుగు భాషాభివృద్ధిలో మీడి యా పాత్ర మరొకమారు చర్చనీయం అవుతున్నది. పరిస్థితులు గత మహాసభల నాటి వంటివి అయితే మీడియా పాత్ర గురించి అంతగా మాట్లాడుకోవలసింది ఉండేది కాదు. మాట్లాడకున్నా అది మొక్కుబడి కోసం అయేది. ఈ సారి అట్లా జరుగరాదని మనకు మనం చెప్పుకోవా లి. మీడియా కూడా అట్లా చెప్పుకోగలదని ఆశించాలి. మీడియా వాడే భాష ప్రభావం ప్రజల వాడకంపై గణనీయంగా ఉండటాన్ని ప్రత్యేకంగా గుర్తించాలి. ఈ కార్యాన్ని చేపట్టడంలో యథాతథంగా మీడియాకు కొన్ని సమస్యలు, పరిమితులు ఉన్నమాట నిజం. ఉదాహరణకు సరైన భాష తెలిసినవారి కొరత కొన్ని సంస్థలకు సమస్య కాగా, సిబ్బందికి శిక్షణలు ఇచ్చి పర్యవేక్షణలు చేయగలవారి కొరత మరికొందరి సమస్య. ఈ సమ స్యలు ఏవీలేనిది కొద్దిమందికే. ఛానళ్లకు సంబంధించి, వీక్షకులలో ఎక్కు వమంది పట్టణవాసులు, యువతరం అయినందున ఇంగ్లీష్ వాడితేనే వారిని మెప్పించి రేటింగ్‌లు సంపాదించగలమనే పెద్ద అపోహ ఉంది. దానితో ఇంగ్లీష్ వాడకం శృతిమించుతున్నది. అందరికీ సంకల్పం ఉం డి, సమన్వయపూరితంగా, ఒక పద్ధతి ప్రకారం ముందుకువెళ్తే, క్రమం గా ఈ సమస్యలను అధిగమించటం అసాధ్యం కాదు. ఇతర భాషలలో కానపుడు తెలుగులో ఎందుకు కావాలి?

సామాజిక ప్రజాస్వామ్య ప్రణాళిక

విశ్లేషణ



ప్రొఫెసర్ గట్టు సత్యనారాయణ

ఈ మధ్య కాలంలో కేసీఆర్ పాలనా విధానం గురించి దేశంలో ఏ రాష్ట్రంలోనైనా మునుపెన్నడూ లేనంతగా చర్చనీయాంశం, ఆదర్శం అవుతున్నది. స్వపక్షంలోనేకాక ప్రతిపక్షంలో, దేశం లోనే కాక దేశాంతరాల్లో మేధావులు, రాజకీయ నాయకులు, సాధారణ ప్రజలు కూడా వేనోళ్లుగా ప్రసంసించడం తెలంగాణ ప్రజలు గర్వించదగి న విషయం. ఈ క్రమంలో విమర్శల కంటే ప్రశంసలే అపారంగా కొన సాగుతున్నాయి. విమర్శలకు, ప్రశంసలకు ప్రమాణాలు ఏమిటి? ప్రమా ణాలు లేని ప్రశంసలు, విమర్శలు ప్రజాస్వామ్యంలో అనివార్యమా? ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ ముదిగొండ వీరభద్రయ్య కేసీఆర్ పాలనను గూర్చి మాట్లాడుతూ శత్రువు కూడా కేసీఆర్‌ను బయటికి ఎంత విమర్శించినా తన అంతరంగంలో ప్రణాళికాబద్ధమైన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రగతికి ప్రసంశించక మానడని విశదీకరించడం సందర్భోచితమైన వ్యాఖ్యానమే. అదేవిధంగా ప్రతిపక్ష నాయకుడు జానారెడ్డి కూడా హైద రాబాద్‌లో పేదలకు ప్రవేశపెట్టిన 5 రూపాయలకే భోజనం నాణ్యతను ప్రశంసించి సొంతపార్టీ కోపానికి గురికావడం తెలిసిన విషయమే. చాలా మంది మేధావులు, ప్రతిపక్ష నాయకులు తమ కనీస కర్తవ్యంగా పొగడ్త ల కంటే విమర్శలకే ప్రాధాన్యం ఇస్తారు. ఈ దృక్పథం వాస్తవాన్ని మరు గునపరుచకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆరోగ్యకరమే. ఈ నేపథ్యంలో నే అగుపడని రాజకీయం,ఆదర్శాన్ని ఒంట బట్టించుకున్న కోదండరామ్ 'నాలుగేండ్ల కేసీఆర్ పాలనలో ఒరగబెట్టిందేమీ లేదని అంటూ, ఉద్యమ ఆకాంక్షలు నెరవేరినప్పుడే అభివృద్ధి అని అంటున్నారు. తెలంగాణ ఉద్య మం తనకుతానుగా అభివృద్ధి నిర్మించుకుందని, అభివృద్ధి ప్రజలకు మేలు చేసే లా ఉండాలని, నాయకులకు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా ఉండ రాదనడం' ప్రజలను ఏమాత్రం ఆకర్షించలేదు. కారణం, దేశమందరిది ఒకదారైతే దేశదిమ్మరిది మరోదారన్నట్టు. దేశ దేశాంతరాల్లో మేధావులు, అధికారులు ప్రశంసిస్తుంటే నిరాధారమైన విశ్లేషణ లేని ప్రకటనలు చేయ టం విచక్షణలేని తనాన్ని తెలియపరుస్తుంది. ఈ ప్రశంసలకు విమర్శ లకు గల ప్రాధాన్యం వాటిస్థాయిని ప్రామాణికంగా విశ్లేషించవలసిన బాధ్యత, సామాజిక శాస్త్రవేత్తలు, మేధావులపైన ఉన్నది.

ఈ నేపథ్యంలోనే కేసీఆర్ వ్యక్తిత్వాన్ని, పాలనను విమర్శించడమా? ప్రశంసించడమా? దేనినైన ఒక నిర్దిష్ట ప్రాతిపదికతో విశ్లేషించవలసి ఉన్న ది. ఏ పొరపాటు జరిగినా చారిత్రక తప్పిదమవుతుంది. అందుకే విమ ర్శలు, ప్రతివిమర్శలు వాస్తవ ప్రతిబింబాలుగా ఉండాలి. అందులో అక డమిక్ నేపథ్యం ఉన్నవారు సత్యాన్ని మరుగుపర్చకూడదు. కబోధిగా మారకూడదు. దానికిబదులు ప్రజాస్వామ్యవ్యవస్థలో ప్రజాహితం కోసం ఆధారపూరితంగా విమర్శిస్తే వ్యక్తిత్వం పెరుగడంతో పాటు ప్రజల నమ్మ కాన్ని, గౌరవాన్ని పొందవచ్చు.

స్వరాష్ట్రంలో కేసీఆర్ పాలన స్వభావాన్ని పరిశీలిస్తే, అనేకమైన ప్రత్యే కతలు గోచరిస్తవి. ముఖ్యంగా ఆయన సామాజిక అభివృద్ధి సంక్షేమ ప్రణాళికలతో కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా ప్రసంశలు అందుకుం టున్నవి. ప్రభుత్వ పథకాలు శాశ్వత, తాత్కాలిక ప్రయోజనకారిగా, వ్యవ సాయ పారిశ్రామికరంగం, గ్రామీణ పట్టణ రంగాలతో పాటు కులాల అభివృద్ధి, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలుగా గుర్తించవచ్చు. కేసీఆర్ పాలనావిధానం, అభివృద్ధి నమూనా Karl Mannheim రాసిన 'Free – dom, Power & Democratic Planning' ప్రతిపాదనలను గోచరిస్తున్న వి. ప్రజాస్వామ్య ప్రణాళిక, అభివృద్ధి ఏ విధంగా ఉండాలనే ప్రతిపాదన లను యాదృచ్ఛికంగానే ఆచరిస్తున్నారు. Mannheim ప్రకారం ప్రజా స్వామ్య సిద్ధాంతం లక్ష్యం అధికారాన్ని సంఘానికి పంచుతూ, నియం త్రి స్తూ, సంఘ రక్షణకు, సామర్థ్య పెంపుదలకు, స్వేచ్ఛకు దోహదకరంగా ఉండాలంటారు. ప్రజాస్వామ్యం అధికార దుర్వినియోగాన్ని ఖండిస్తుం ది. కార్యనిర్వహణకు కావలసిన స్వేచ్ఛనిస్తుంది. కానీ ఇష్టం వచ్చినట్లు చేయటానికి కాదు. సమాజ ప్రణాళిక ప్రాధాన్యం, సమాజంలోని వ్యక్తు లపై నిర్మాణాత్మక ప్రభావాన్ని చూపేవిధంగా ఉండాలంటారు. అనగా ప్రణాళిక స్వేచ్ఛకోసం, ప్రజాస్వామ్యబద్ధంగా నియంత్రించేవిధంగా ఉం డాలంటారు. ప్రణాళికవర్గరహిత సమాజానికి గాక వర్గాల మధ్య అధిక సంపద, పేదరికం వ్యత్యాసాలను తొలిగించే విధంగా ఉండాలంటారు. ప్రణాళిక కొత్త సంప్రదాయంగా ఉంటూ, సంప్రదాయంలో ఉన్న విలువై న అంశాలను తొలిగించకుండా ఉండాలంటారు. క్రమంగా సమాజ మార్పు జరుగుతూ వ్యక్తి మార్పునకు దోహదపడాలి. ప్రణాళిక పరస్పర సహకారంగా ఉండాలి కానీ నిర్బంధించేదిగా ఉండకూడదు. ప్రణాళిక ఎక్కువ అవకాశాలను కల్పించేదిగా ఉండాలంటారు. Mannh –eim సమాజంలో సమూహాలు, వ్యక్తులు సహజంగా పరస్పరం సహకరించు కోకుంటే సామాజిక ప్రణాళిక అత్యావశ్యకం అంటారు.

> కేసీఆర్ ఏ కార్యక్రమం చేపట్టినా కాలపరిమితితో కూడిన లక్ష్యంతో పని పూర్తిచేస్తారు. ఈ మూడున్నరేండ్లలో ప్రభుత్వాధికారులకు, ప్రభుత్వానికి సామ్యత లేదు అనే అపవాదు రాకుండా అధికారులకు ప్రభుత్వ యంత్రాగాన్ని అన్నివిధాలుగా ప్రోత్సహించడం కేసీఆర్ పాలనా విధానం.

కేసీఆర్ పాలనా విధానంలో పైన పేర్కొన్న అంశాలతో కూడిన వినూ త్న, విప్లవాత్మక ధోరణి కనిపిస్తుంది. ప్రజలకు ప్రభుత్వానికి అత్యంత సన్నిహిత సంబంధాన్ని చూపిస్తుంది. ప్రజల ఎలాంటి జటిల సమస్యల నైనా ప్రభుత్వం అందుబాటులో ఉంటూ సమయోచితంగా స్పందిస్తుం ది. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ముందే దాని పని క్యాలెండర్‌ను ప్రకటించటం, వీలైనంతవరకు ముందే ముగించడం, మునుపెన్నడూ ఎరుగని ప్రజలకు మేధావులకు ఆనందాన్ని కల్గిస్తుంది. ఏ కార్యక్రమాల ను చేపట్టినా వాటికి కావలసిన ఆర్థిక, శాస్త్ర సాంకేతిక వనరులను సమ కూర్చటం, సొంత ఇంటిపనికి కూడా చేయనంతగా ప్రణాళికబద్ధంగా మనస్సు పెట్టి కాలయాపన లేకుండా ప్రభుత్వ యంత్రాం గాన్ని ఉత్తేజపరిచి ముగించ టం ప్రత్యేకత. మిషన్ భగీర థతో గ్రామీణ స్త్రీలు బిందెలు, కుండలతో మైళ్ళకొలదీ వెళ్లి నీళ్ల కోసం తిరుగకుండా మంచినీళ్లు ప్రతి ఇంటికీ నల్లా ద్వారా సరఫరా చేస్తానని, అలాచేయని పక్షంలో వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగనని ముందే ప్రకటించి ఆ కార్యక్రమాన్ని సమయానికి ముందే పూర్తిచేయ సంకల్పిం చడం సర్వత్రా ప్రశంసలందుకున్నది. ఇది కేసీఆర్ ప్రజాస్వామ్య సామా జిక ప్రణాళిక అభివృద్ధి నమూనాను సూచిస్తున్నది. కేసీఆర్ ఏ కార్యక్ర మం చేపట్టినా కాలపరిమితితో కూడిన లక్ష్యంతో పని పూర్తిచేస్తారు. ఈ మూడున్నరేండ్లలో ప్రభుత్వాధికారులకు, ప్రభుత్వానికి సామ్యత లేదు అనే అపవాదు రాకుండా అధికారులకు ప్రభుత్వ యంత్రాగాన్ని అన్నివి ధాలుగా ప్రోత్సహించడం కేసీఆర్ పాలనా విధానం.

గ్రామీణ భారతంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన విద్య, వైద్యం, ఉపా ధి, వ్యవసాయం, రెవెన్యూ రంగాలతోపాటు రక్షణ రంగమైన పోలీసు వ్యవస్థలలో ప్రజా ఉపయోగకరమైన సంస్కరణలను తీసుకొచ్చి ఫ్రెండ్లీ పోలీస్‌గా మార్చటం ముఖ్యమైనవి. వ్యవసాయరంగంలో రైతుల రుణ మాఫీ, రుణపరపతి కల్పించటం, విత్తనాలు, ఎరువులు సకాలంలో క్యూ లో నిలబడకుండా కావలసినన్ని సీజన్‌కు ముందే తెప్పించి సరఫరా చేయటం, బ్లాక్ మార్కెటింగ్ నిరోధించడం, కల్తీ విత్తనాలు, మందుల కల్తీపై కఠినచర్యలు, నాణ్యమైన కరెంటు నిరంతరాయంగా ఉచితంగా సరఫరా చేయటం, రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, మార్కెట్ మాయ జాలాన్ని కంట్రోల్ చేయటం గుణాత్మకమైనవి. రానున్న వానాకాలం సీజ న్ నుంచి ఎకరానికి రెండు పసళ్లకు రూ.8000 ఉచిత పెట్టుబడిగా ప్రభు త్వం రైతుల ఖాతాలో జమచేయడం లాంటివి దేశానికే ఆదర్శం.

దేశ చరిత్రలో కేసీఆర్ పాలనా ఔన్నత్యం నిలిచిపోయేవిధంగా ఉన్నది. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కేసీఆర్ దేశానికే ఆదర్శం గా చరిత్రలో నిలుస్తాడనడంలో సందేహం లేదు.

(వ్యాసకర్త: ఎమిరిటస్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ, ఉస్మానియా యూనివర్సిటీ)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

స్పేస్‌సూట్‌లోనే టాయ్‌లెట్

ఆరు రోజులపాటు వ్యర్థాల సేకరణ.. రూపొందిస్తున్న నాసా

వాషింగ్టన్: వ్యోమగాములు స్పేస్‌సూట్ ధరించినప్పుడు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను పరిష్కరించే దిశగా అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ముందడుగు వేసింది. స్పేస్‌సూట్‌లోనే విసర్జితాలను సేకరించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నది. దీంతో అత్యవసర సమయాల్లో వ్యోమగాములు దాదాపు ఆరు రోజులపాటు స్పేస్‌సూట్‌లోనే ఉండే అవకాశం ఉన్నది. దీనిని ఓరియన్ క్రూ సర్వైవల్ సిస్టమ్స్ సూట్స్ అని పిలుస్తున్నారు. వీటిని త్వరలో నాసా ప్రయోగించనున్న ఓరియన్ మిషన్‌లో వినియోగించనున్నారు. మిషన్‌లో భాగంగా వ్యోమగాములను ప్రత్యేక వ్యోమనౌకలో భూస్థిర కక్ష్య దాటి బయటికి పంపనున్నారు. అప్పుడు ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వ్యోమనౌక అవతల ఆరురోజులపాటు జీవించేందుకు ఈ సూట్ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం వ్యోమగాములు మలమూత్ర విసర్జనకు మామూలు సమయాల్లో టాయ్‌లెట్లను వాడుతుండగా, స్పేస్‌సూట్ ధరించినప్పుడు శానిటరీ న్యాప్కిన్స్ తరహాలో ఉండే ప్యాడ్స్‌ను వినియోగిస్తున్నారు. ఇవి కేవలం పదిగంటలు మాత్రమే పని చేస్తాయి. చంద్రుడిపైకి వెళ్లే క్యాప్సూల్స్‌లో ప్రత్యేకంగా టాయిలెట్లు నిర్మించరు. ప్రత్యేక ట్యూబ్‌ను ఏర్పాటు చేసి ఒక బ్యాగ్‌కు అనుసంధానిస్తారు. ఈ సమస్యలన్నిటికీ ఇప్పుడు కొత్త స్పేస్‌సూట్‌లతో పరిష్కారం దొరుకనుంది.



ప్రియా వారియర్‌పై క్రిమినల్ చర్యలు వద్దు

మలయాళ నటికి సుప్రీంకోర్టులో ఊరట

న్యూఢిల్లీ: మలయాళ నటి ప్రియా వారియర్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆమె నటించిన ఓ చిత్రంలోని పాట ముస్లింల మనోభావాలన్న దెబ్బతీసిందన్న ఆరోపణలపై ప్రియకు వ్యతిరేకంగా ఎటువంటి క్రిమినల్ చర్యలు చేపట్టరాదని ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం ఆదేశించింది. సదరు మలయాళ చిత్రం 'ఒరు అదార్ లవ్' దర్శకుడు ఒమర్ లులూకు కూడా కోర్టు ఉపశమనం కల్పించింది. ఇప్పటికే వారిపై దాఖలైన ఎఫ్ఐఆర్‌లపై స్టే విధించిన న్యాయస్థానం, సదరు వీడియోకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లోనూ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయరాదని ఆదేశించింది. ప్రియా వారియర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి, ఇతరులకు నోటీసులు జారీ చేసింది. సినిమాలోని పాట 'మాణిక్య మలరాయ పూవి' ముస్లింల మనోభావాలకు విఘాతం కలిగించిందని ఆరోపిస్తూ కొందరు హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అలాగే ముంబైకి చెందిన రజా అకాడమీ కూడా పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో ప్రియ తనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని, ఇతర రాష్ట్రాలలో కూడా తనపై ఎటువంటి నేరపూరిత చర్యలు తీసుకోకుండా నిలువరించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



పీఎన్‌బీ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి లోన్

రూ.5వేలతో కారు కొనుగోలు చేసిన అప్పటి ప్రధాని

పింఛను డబ్బుతో రుణాన్ని చెల్లించిన కుటుంబ సభ్యులు


న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం, 11వేలకోట్ల రుణం తీసుకుని పరారైన నీరవ్ మోదీ ఉదంతం నేపథ్యంలో 50 ఏండ్ల నాటి ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. దివంగత మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి తాను పదవిలో ఉండగా ఇదే బ్యాంకు నుంచి రూ.5వేలు రుణాన్ని తీసుకోగా, ఆయన మరణానంతరం వచ్చిన పింఛను డబ్బుతో కుటుంబం ఆ లోన్‌ను తీర్చేసింది. 1965లో శాస్త్రి భారత ప్రధానిగా ఉన్నారు. అధికారిక వాహనాన్ని సొంత అవసరాలకు ఆయన వాడుకునేవారు కారు. దీంతో కుటుంబ అవసరాల కోసం కారు కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఫియట్ కారు కొనుగోలుకు 12వేలు అవసరం. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో ఉన్న ప్రధాని కుటుంబ ఖాతాలో కేవలం రూ.7వేలు మాత్రమే ఉన్నాయి. దీంతో రూ.5వేలు లోన్ తీసుకుని కారు కొన్నారు. అది జరిగిన కొద్దిరోజులకే.. శాస్త్రి 1966 జనవరిలో తుదిశ్వాస విడిచారు. ఆయన కన్నుమూసిన తర్వాత వచ్చిన పింఛను డబ్బుతో శాస్త్రి సతీమణి లలిత వాయిదాలపై పీఎన్‌బీ రుణాన్ని నయాపైసలతో సహా తీర్చేశారు. అప్పటి ఘటనను శాస్త్రి మనుమడు ఆదర్శ్ శాస్త్రి ధ్రువీకరించారు.



వెండితెర నుంచి రాజకీయ వేదికపైకి

చెన్నై, ఫిబ్రవరి 21:

బాల నటుడి నుంచి అభిమానుల గుండెచప్పుడుగా ఎదిగి.. విలక్షణ నటునిగా కథలు, పాత్రలతో అనేక ప్రయోగాలు చేసి.. ఆ తరువాత దర్శక, నిర్మాతగా మారిన కమల్‌హాసన్ బుధవారం మరో కొత్త పాత్రలోకి ప్రవేశించారు. ఐదు దశాబ్దాల సినీ జీవితం అనంతరం 63ఏండ్ల కమల్‌హాసన్ బుధవారం తమిళనాడు రాజకీయ తెరపై అరంగేట్రం చేశారు. తమిళనాట రాజకీయ శూన్యత ఏర్పడిన దశలో కమల్‌హాసన్ రాజకీయ రంగప్రవేశం ప్రాధాన్యం సంతరించుకుంది. తన రాజకీయ ప్రయాణంలో తొలి అడుగు వేసేందుకు ఆయన దక్షిణ తమిళనాడులోని మదురైని ఎంచుకున్నారు.



1960లో తెరంగేట్రం

- కమల్‌హాసన్ 1960లో 'కళాతూర్ కన్నమ్మ' అనే తమిళ చిత్రంలో అనాథ బాలుని పాత్ర ద్వారా సినీరంగంలోకి ప్రవేశించారు.
- కొంతకాలం సహాయ నృత్య దర్శకునిగా పనిచేసిన కమల్‌కు 1970 దశకంలో హీరోగా తొలి అవకాశం కే బాలచందర్ కల్పించారు.
- తన సినీ జీవితంలో అనేక జాతీయ, ఇతర అవార్డులను సొంతం చేసుకున్నారు.
- బాలచందర్ దర్శకత్వంలోనే కమల్ 1981లో 'ఏక్ దుజే కే లియే' చిత్రం ద్వారా బాలీవుడ్‌లో ప్రవేశించారు.
- యువ హీరోగా అనేక రొమాంటిక్, యాక్షన్ పాత్రల్లో కనిపించిన కమల్ క్రమంగా ఇతర పాత్రల వైపు మళ్లారు. తరచుగా కథలు, పాత్రలతో పలు ప్రయోగాలు చేశారు.
- మాఫియా డాన్‌గా కమల్ నటించిన 'నాయకన్' సినిమాను ఆయన అభిమానులు మార్లన్ బ్రాండో నటించిన 'ది గాడ్‌ఫాదర్'తో పోల్చారు. ఇక డైలాగులు లేని 'పుష్పక్' ఒక ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచింది.
- తన కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొన్నది 2012-13లో. ఆయన రూపొందించిన 'విశ్వరూపం' విడుదలకు అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. ఆ సమయంలో ఆయన దేశం విడిచి వెళ్తానని హెచ్చరించారు.
- హేతువాదినని ప్రకటించుకున్న కమల్‌లో వామపక్ష భావాలు ఎక్కువ. ఆయన ఏడాది క్రితం వరకూ రాజకీయాలకు, వివాదాలకు దూరంగానే ఉన్నారు.
- జయలలిత మరణానంతరం ట్విట్టర్ ద్వారా అధికార అన్నాడీఎంకే అవినీతితో పాటు అనేక అంశాలను లేవనెత్తడం ప్రారంభించారు.
- దీంతో పలువురు అధికార పక్ష నేతలు కమల్‌ను రాజకీయాల్లోకి వచ్చి తమపై రాళ్లు రువ్వాలని ఎద్దేవా చేయటం మొదలు పెట్టారు.
- ఆ నేపథ్యంలోనే ఆయన రాజకీయ పార్టీ పెట్టనున్నట్టు ప్రకటించారు.
- గత ఏడాది కమల్ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌లను కలుసుకున్నారు.



దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం సోదరుడు మొహమ్మద్ మీరన్ లెబ్బాయి మారైకయార్ నుంచి ఆశీస్సులు అందుకుంటున్న కమల్‌హాసన్

మక్కళ్ నీది మయ్యం



పార్టీ ఆవిర్భావ సభా వేదికపై కమల్ అభివాదం

కమల్‌హాసన్ రాజకీయ పార్టీ

- తమది మధ్యేమార్గం అని వెల్లడి
- ప్రజల పాలనకు తొలి అడుగు అని ప్రకటన
- కుల రాజకీయాలు అంతరించాలని ఆకాంక్ష
- కలాం ఇంటి నుంచి ప్రారంభమైన కమల్‌రాజకీయ ప్రస్థానం
- రామేశ్వరం నుంచి మొదలైన రోడ్‌షో

మదురై, ఫిబ్రవరి 21:

విలక్షణ నటుడు కమల్‌హాసన్ తన రాజకీయ పార్టీని ప్రకటించారు. పార్టీకి 'మక్కళ్ నీది మయ్యం (ప్రజా న్యాయ కేంద్రం)' అని పేరు పెట్టారు. ఐక్యతలోని బలాన్ని సూచించే చిహ్నమున్న పార్టీ జెండాను ఆవిష్కరించారు. 'నేను మీ నాయకుడిని కాదు, మీ చేతిలో పరికరాన్ని.. ఇక్కడ చేరినవారందరూ నాయకులు' అని కమల్ తన అభిమానులనుద్దేశించి వ్యాఖ్యానించారు. 'ఈ పార్టీ మీ కొరకు.. ప్రజల కొరకు ఏర్పాటైంది...' అని సభికుల హర్షధ్వానాల మధ్య పేర్కొన్నారు. ఇది 'ఈ ఒక్క రోజు ఉత్సవం' కాదు అని ఆయన తన మద్దతుదారులకు గుర్తు చేశారు. త్వరలో అనేక బహిరంగ సభలు నిర్వహించనున్నామని తెలిపారు. 'నేడు తమిళనాడు ఆత్మ దహించుకుపోతున్నది. అవినీతిలో మునిగిన వేళ్లు కాలిపోతాయి. మనం ప్రజల పార్టీని స్థాపించబోతున్నాం. ఇది మనకొక జీవన విధానం కాబోతున్నది. ఈ విషయాన్ని మనం దరం గుర్తుంచుకోవాలి. మీ అందరిపై పెద్ద బాధ్యత ఉన్నది.. మీ అందరూ మార్గదర్శకులు కావాలి. నేను సలహాలివ్వను. నేను నాయకుడిని కాదు. మీ సలహాలు వినే కార్యకర్తను మాత్రమే' అని కమల్ పేర్కొన్నారు. తన పార్టీ ఆవిర్భావం 'మక్కల్ అచ్చి (ప్రజల పాలన)' దిశగా మొదటి అడుగు అని అభివర్ణించారు. సమాజంలోని అన్నివర్గాల వారికి నాణ్యమైన విద్య అందాలని, కుల రాజకీయాలకు అంతరించాలని ఆకాంక్షించారు.

తమ పార్టీని వామపక్ష లేదా మితవాద పార్టీగా ముద్ర వేయరాదని, అన్ని సిద్ధాంతాల నుంచి ఉత్తమమైన దానిని తీసుకుంటామని 'తమది మధ్యేమార్గం' చెప్పారు. అందువల్లనే తమ పార్టీ పేరులో కూడా 'మయ్యం' (సెంటర్) అన్న పదాన్ని చేర్చామని వివరించారు. ఆద్యంతం అవినీతి గురించి మాట్లాడిన కమల్ ద్రవిడ రాజకీయాలలో తాను కూడా విజయం సాధించగలనని విశ్వాసం వ్యక్తం చేశారు. ఒక ఓటుకు రూ.6 వేలు ఇస్తున్నట్టు ప్రజలు తనకు చెప్పారని, తాను ఓటు కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వబోనని, తన దగ్గర ధనం లేదని కమల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఆ పార్టీ నాయకుడు సోమ్‌నాథ్ భారతి, రైతు నాయకుడు పీఆర్ పాండియన్ తదితరులు హాజరయ్యారు. రామేశ్వరంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఇంటిని సందర్శించిన అనంతరం కమల్ మదురైకి చేరుకున్నారు. ఈదురు గాలుల కారణంగా బహిరంగ సభ వేదికపై ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఎగిరి కిందపడింది.

కమల్ నిజ జీవిత హీరో: కేజ్రీవాల్

కమల్‌హాసన్ నిజ జీవిత హీరో అని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అభివర్ణించారు. ఓ రాజకీయ ప్రత్యామ్నాయాన్ని స్థాపించిన కమల్ నిజాయితీపరుడు, దూరదృష్టిగల నాయకుడని పేర్కొన్నారు. డీఎంకే, అన్నాడీఎంకేలు అవినీతి పార్టీలని ధ్వజమెత్తారు. తమిళ ప్రజలు నిజాయితీగల పార్టీ కోసం కమల్‌హాసన్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కమల్‌హాసన్‌కు కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ శుభాకాంక్షలు తెలిపారు. పినరాయి వీడియో సందేశాన్ని సభలో ప్రదర్శించారు. కమల్ హాసన్ పార్టీ సమాజంలో లౌకిక, ప్రజాస్వామ్య విలువలను, బహుళత్వాన్ని కాపాడగలదని ఆయన ఆకాంక్షించారు.



సభావేదికపై కేజ్రీవాల్, కమల్ హాసన్ తదితరులు

అబ్దుల్ కలాం ఇంటినుంచి రాజకీయ యాత్రకు శ్రీకారం

రామేశ్వరం: రామేశ్వరంలోని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఇంటినుంచి కమల్‌హాసన్ తన రాజకీయ యాత్రకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఉదయం కలాం కుటుంబసభ్యుల్ని కలుసుకున్నారు. కలాం సోదరుడు మొహమ్మద్ మీరన్ లెబ్బాయి మారైకయార్ నుంచి ఆశీస్సులు తీసుకున్నారు. కలాం తనకు 'రోల్ మోడల్' అని పేర్కొన్న కమల్ ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. కలాం చదువుకున్న పాఠశాలను కూడా సందర్శించేందుకు ఆయన ప్రయత్నించినప్పటికీ, జిల్లా యంత్రాంగం అనుమతి నిరాకరించింది. అనంతరం రోడ్‌షో ద్వారా రామేశ్వరం నుంచి మదురై చేరుకున్నారు.

ద్రవిడ సంస్కృతిని ప్రతిబింబించిన పార్టీ పతాకం

కమల్‌హాసన్ పార్టీ పతాకం ద్రవిడ సంస్కృతిని ప్రతిబింబించింది. తెల్ల జెండాపై ఆరు చేతులు ఒకదానినొకటి పట్టుకొని ఉన్నాయి. వాటిలో మూడు చేతులు ఎరుపు రంగులో, మూడు తెలుపు రంగులో ఉన్నాయి. ఆ చేతుల మధ్య ఒక నక్షత్రం, ఆ చేతుల వెనుక నలుపు రంగంలో మరో నక్షత్రం వంటి గుర్తు ఉన్నది. తెలుపు, నలుపు రంగులు తమిళ రాజకీయాలలో ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీ జెండాలలో కూడా కనిపించే ఈ రంగులు ద్రవిడ సంస్కృతిని సూచిస్తాయి.

నిజజీవితంలో నాయకుడిగా గెలువాలి

ట్విట్టర్ ద్వారా కమల్‌కు ఆల్‌ది బెస్ట్ చెప్పిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నటుడు కమల్ హాసన్ నిజజీవితంలో కూడా నాయకుడుగా గెలవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ.రామారావు ఆకాంక్షించారు. పార్టీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కమల్ కేటీఆర్‌ను ఆహ్వానించారు. పలు కార్యక్రమాల వల్ల హాజరుకాలేకపోతున్నానని పేర్కొంటూ కేటీఆర్ ట్విట్టర్‌లో స్పందించారు. 'మీ కొత్త ప్రయాణానికి గుడ్‌లక్.. నిజ జీవిత నాయకుడుగా కూడా హిట్ అవ్వాలని ఆశిస్తున్నాను' అని కేటీఆర్ ట్వీట్ చేశారు. దీనికి కమల్.. 'థ్యాంక్యూ కేటీఆర్‌జీ.. ఈ రోజు మిమ్మల్ని మిస్ అయినా భవిష్యత్‌లో మా పార్టీ ఫంక్షన్స్‌కి హాజరు అవుతారని ఆశిస్తున్నాను' అని ట్వీట్ చేశారు.

ఇష్రత్ జహాన్ ఎన్‌కౌంటర్ కేసు నుంచి.. గుజరాత్ మాజీ ఇంచార్జి డీజీపీకి విముక్తి

అహ్మదాబాద్: 2004లో ఇష్రత్ జహాన్, ఆమె స్నేహితుడు, మరో ఇద్దరి బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న గుజరాత్ మాజీ ఇంచార్జి డీజీపీ పీపీ పాండేకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం బుధవారం విముక్తి కలిగించింది. ఇష్రత్‌ను, మరో ముగ్గురిని అపహరించి, హత్య చేశారనే ఆరోపణలకు సంబంధించి ఎలాంటి రుజువులులేవని సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి జేకే పాండ్య నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొన్నది. 2013లో మొదటిసారి పాండే సహా ఏడుగురు పోలీసు అధికారుల పేర్లను సీబీఐ చార్జిషీట్‌లో చేర్చింది.

పెరూలో బస్సు లోయలో పడి 36 మంది మృతి

లిమా: పెరూలో ఓ డబుల్ డెక్కర్ బస్సు లోయలో పడిన దుర్ఘటనలో 36 మంది మరణించారు. దక్షిణ పెరూలోని కామనా రాష్ట్రంలో ఈ దుర్ఘటన బుధవారం చోటుచేసుకున్నది. పర్వతప్రాంతంలో రహదారిపై ప్రయాణిస్తున్న డబుల్ డెక్కర్ బస్సు దాదాపు 650 అడుగుల లోతైన లోయలో పడిపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదన్నారు. మృతుల సంఖ్య మరింత పెరుగవచ్చని, ఈ దుర్ఘటనలో 34 మందికి గాయాలయ్యాయని చెప్పారు.

తీరప్రాంత నౌక 'వజ్ర'కు విశ్రాంతి

పారదీప్ (ఒడిశా): మూడు దశాబ్దాలుగా భారత నావికాదళానికి సేవలందించిన తీరప్రాంత రక్షకదళ నౌక 'వజ్ర' విశ్రాంతి తీసుకుంది. ఒడిశాలోని పారదీప్‌లో మంగళవారం జరిగిన ఓ వేడుకలో 'వజ్ర'కు నౌకాదళం ఘనంగా వీడ్కోలు పలికింది. నౌకపై ఉండే ధ్వజాన్ని అవనతం చేశారు. 1988 డిసెంబర్ 22న తీరప్రాంత నౌకాదళంలో చేరిన వజ్ర 52,966 గంటలపాటు సముద్రంలో గడిపింది. 5,24,299 నాటికల్ మైళ్లు ప్రయాణించింది.

డార్జిలింగ్‌లో బలగాల ఉపసంహరణకు సుప్రీం గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: డార్జిలింగ్ నుంచి సాయుధ బలగాల విరమణకు కేంద్రానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నాలుగువారాల పాటు బలగాలను కొనసాగించాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కోరినప్పటికీ, మార్చి8 తర్వాత బలగాలను విరమించుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. గుర్ఖా ఆందోళనల నేపథ్యంలో డార్జిలింగ్, కలింపాంగ్ ప్రాంతాల్లో అప్పట్లో 15 కంపెనీల సాయుధ బలగాలను కేంద్రం మోహరించింది. ఇప్పటికే 11కంపెనీల ఉపసంహరణకు అనుమతించిన సుప్రీంకోర్టు మిగిలిన బలగాల తొలిగింపునకూ తాజాగా ఆదేశాలిచ్చింది.

పిల్స్ దాఖలు ఫ్యాషనై పోయింది!

- పీఎన్‌బీ స్కాం పిల్స్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
- పిటిషనర్లపై ఆగ్రహం.. కేసు అత్యవసర విచారణకు నిరాకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పంజాబ్ నేషనల్ బ్యాంకు రుణాల కుంభకోణంపై ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్స్) దాఖలు చేసిన పిటిషనర్లపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికలు, మీడియాలో పతాక శీర్షికలతో వార్తలు రాగానే పిల్స్ దాఖలు చేయడం కొందరికి ఫ్యాషన్ అయిపోయిందని వ్యాఖ్యానించింది. వినీత్ ఢండా, ఎంఎల్ శర్మ అనే న్యాయవాదులు మంగళవారం వేర్వేరుగా ఈ పిల్స్ దాఖలు చేశారు. రూ.11,400 కోట్ల కుంభకోణంపై ప్రజాప్రయోజనాల దృష్ట్యా వెంటనే విచారణ జరుపాలని పిటిషనర్ వినీత్ ఢండా అభ్యర్థించడంతో ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం పిల్ పరిశీలనకు ఉపక్రమించింది. కాగా, పీఎన్‌బీ స్కాంపై పిల్స్ దాఖలును కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. 'పతాక శీర్షికలతో వార్తలు రాగానే పిల్స్ దాఖలు చేయడం కొందరికి ఫ్యాషన్‌గా మారింది. పిటిషనర్ ప్రచారం కోసం ఆరాటపడుతున్నారనేది స్పష్టమవుతున్నది. కేవలం ప్రజలను ఆకట్టుకోవడానికి ఇటువంటి పిల్స్ దాఖలు చేయడం న్యాయప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుంది' అని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను మార్చి 16కు వాయిదా వేసింది.



13 కాదు.. పది అంకెలే..

ఎం2ఎం నంబర్లలో మాత్రమే మార్పులు

వ్యక్తిగత మొబైల్ నంబర్లు యథాతథం

న్యూఢిల్లీ: త్వరలో మీ మొబైల్ నంబర్ పది నుంచి 13 అంకెలకు మారనుందన్న విషయం తెలిసి ఆందోళన చెందుతున్నారా! అయితే కొంచెం రిలాక్స్ అవండి. ఎందుకంటే మీ మొబైల్ నంబర్ ఇకపై కూడా పది అంకెల్లోనే ఉండబోతున్నది. వినియోగదారులకు మరింత భద్రత కల్పించేందుకు మొబైల్ నంబర్లను 13కు మార్చనున్నట్లు టెలికాం శాఖ (డీఓటీ) వెల్లడించినట్లు కథనాలు వినిపిస్తున్నాయి. కానీ ఇది వ్యక్తిగత మొబైల్ నంబర్లకు కాదని తెలుస్తున్నది. స్వైపింగ్ మెషీన్లు, కార్లు, విమానాలు, ఎలక్ట్రిసిటీ మీటర్లు, ట్రాఫిక్ నియంత్రణా వ్యవస్థ మొదలైన వాటిల్లో సమాచార మార్పిడికి వినియోగించే ఎం2ఎం సిమ్‌లకు మాత్రమే 13 అంకెల నంబర్లను కేటాయించనున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని సర్వీస్ ప్రొవైడర్లు భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో సంస్థల అధికారులు ధ్రువీకరించారు. కాగా, ఎం2ఎం కమ్యూనికేషన్‌లో 13 అంకెల నంబర్ల విధానాన్ని అమలు చేయాలని నెట్‌వర్క్ ఆపరేటర్లకు టెలికాం శాఖ ఇటీవల సూచించింది. 2018 అక్టోబర్ 1 నుంచి అన్ని ఎం2ఎం నంబర్లను 13 అంకెలకు మార్చాలని పేర్కొన్నది. ఈ ప్రక్రియ 2018 డిసెంబర్ 31 నాటికి పూర్తిచేయాలని ఆదేశించింది.

15 భారతీయ భాషల్లో ఈమెయిల్ ఐడీ

అందుబాటులోకి తేనున్న మైక్రోసాఫ్ట్

న్యూఢిల్లీ: ఈ-మెయిల్ యాప్స్‌లో యూజర్లు తమ మాతృభాషలోనే మెయిల్ ఐడీలను క్రియేట్ చేసుకునే సౌకర్యాన్ని సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ అందుబాటులోకి తేనున్నది. ఈ ఫీచర్ వల్ల తెలుగు, ఉర్దూ, హిందీ, తమిళం, పంజాబీ, మణిపురి, గుజరాతీ, బెంగాలీ, సింధీ, నేపాళీ, మరాఠీ, మైథిలి, కొంకణి, డోగ్రి, బోడో భాషల్లో యూజర్లు ఈ-మెయిల్ ఐడీలను క్రియేట్ చేసుకోవచ్చు. మైక్రోసాఫ్ట్‌కు చెందిన ఆఫీస్ 365, ఎక్స్చేంజ్ ఆన్‌లైన్, ఎక్స్చేంజ్ ఆన్‌లైన్ ప్రొటెక్షన్, ఔట్‌లుక్ తదితర యాప్‌లలో ఈ-మెయిల్ ఖాతాలను తెరువవచ్చు.

మానస సరోవర్ యాత్ర రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఈ ఏడాది నాథూలామార్గంలో కూడా వెళ్లే అవకాశం

న్యూఢిల్లీ: ఈ ఏడాది మానస సరోవర్ యాత్రకు రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. డోక్లాంపై ప్రతిష్టంభన నేపథ్యంలో అప్పట్లో చైనా నాథూలా మార్గాన్ని మూసివేసింది. ఇప్పుడా మార్గంలోనూ యాత్రికులు వెళ్లవచ్చునని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ కనుమ మార్గంలో కూడా మానస సరోవర్ యాత్రకు వెళ్లవచ్చు. జూన్ 8నుంచి నాలుగు నెలలపాటు జరిగే యాత్ర కోసం మార్చి 23 తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కేంద్రం తెలిపింది.

తగ్గిన ఈపీఎఫ్ వడ్డీ రేటు


ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 8.55 శాతంగా నిర్ణయం

న్యూఢిల్లీ: ఆరు కోట్ల మంది ఉద్యోగులకు 'ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ' (ఈపీఎఫ్ఓ) షాకిచ్చింది. గత ఏడాది 8.65గా చెల్లించిన వడ్డీ రేటును ఈ ఏడాదికి 8.55 శాతానికి తగ్గిస్తూ బుధవారం జరిగిన కేంద్ర బోర్డు సమావేశంలో ఈపీఎఫ్ఓ నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ఓ వడ్డీ రేటు తగ్గించడం వరుసగా ఇది మూడోసారి. ఆర్థిక శాఖ ఆమోదముద్ర లభించగానే ఖాతాదారుల ఖాతాల్లో వడ్డీ మొత్తం జమ అవుతుంది. అదేవిధంగా కనీసం 10 మంది ఉద్యోగులు ఉన్న సంస్థలను కూడా ఇకపై ఈపీఎఫ్ఓ పరిధిలోకి తేవాలని నిర్ణయించింది. దీంతో ఈపీఎఫ్ఓ ఖాతాదారుల సంఖ్య 9 కోట్లకు చేరనుంది.

బుందేల్‌ఖండ్‌కు రూ.20వేల కోట్లతో రక్షణ కారిడార్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

లక్నో, ఫిబ్రవరి 21: ఉత్తరప్రదేశ్‌లోని అత్యంత వెనుకబడిన బుందేల్‌ఖండ్ ప్రాంతాన్ని అభివృద్ధిపర్చేందుకు రూ.20 వేలకోట్లతో రక్షణ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం ప్రకటించారు. 'బడ్జెట్‌లో రెండు రక్షణ పారిశ్రామిక కారిడార్ల గురించి ప్రస్తావించాం. అందులో ఒకదాన్ని రూ.20వేల కోట్లతో బుందేల్‌ఖండ్ ప్రాంతంలో ఏర్పాటుచేయాలని ప్రతిపాదించాం. ఈ కారిడార్‌తో 2.5 లక్షల మందికి ఉపాధి దొరుకుతుంది' అని లక్నోలో జరిగిన 'పెట్టుబడిదారుల సదస్సు-2018'లో పాల్గొన్న మోదీ చెప్పారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి గొప్ప సామర్థ్యం ఉన్నదని, సీఎం యోగి ఆదిత్యనాథ్, యూపీ ప్రజలు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. యోగి గతంలో ఉన్న వైఫల్యాలను దాటుకుంటూ.. ప్రజల్లో సానుకూల మార్పులు తీసుకొస్తూ నమ్మకాన్ని నింపారని చెప్పారు. 'యూపీ విలువలు, సద్గుణాలను కలిగి ఉన్నది. కానీ అదనంగా మరిన్ని విలువలు కావాలి' అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి' పథకాన్ని ఆయన ప్రారంభించారు. జేవర్, ఖుషీనగర్‌లలో విమానాశ్రయాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు.



పెట్టుబడిదారుల సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధాని


మోదీ అవినీతిపరుడు!

ప్రజాస్వామ్యాన్నీ మాయం చేసే మాయగాడు

అవినీతికి ఆయనో సాధనం.. అందుకే నీరవ్‌మోదీ కేసులో పెదవి విప్పట్లేదు

మొదటిసారిగా ప్రధానిపై రాహుల్‌గాంధీ వ్యక్తిగత విమర్శలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మొదటిసారిగా ప్రధాని నరేంద్రమోదీపై వ్యక్తిగత విమర్శలకు దిగారు. ప్రధాని అవినీతిపరుడని, అందుకే నీరవ్ మోదీ కేసులో పెదవి విప్పడం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్నీ మాయం చేసే మాయగాడని పేర్కొన్నారు. మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ బుధవారం ఒక ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ.. 'మోదీ తొలుత నోట్లు రద్దు చేశారు. ప్రజలను బ్యాంకుల ఎదుట బారులు తీరేలా చేశారు. బ్యాంకుల వెనుక దర్వాజల నుంచి వచ్చిన అవినీతిపరులు తమ నల్లధనాన్ని తెల్లగా మార్చుకొని పోయారు' అని వ్యాఖ్యానించారు. బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్ములో రూ.22వేల కోట్లు నీరవ్ మోదీ ఎత్తుకుపోవడమే అందుకు ఉదాహరణగా రాహుల్ చెప్పారు. 'నరేంద్రమోదీ అవినీతికి వ్యతిరేకం కాదు, స్వయంగా ఆయనే అవినీతిపరుడు. అవినీతికి ఆయన ఒక సాధనం' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ట్విట్టర్ ద్వారా కూడా రాహుల్ ప్రధానిని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన మోసం, రాఫెల్ ఒప్పందంపై ప్రధాని మౌనంగా ఎందుకున్నారని నిలదీశారు. నీరవ్ మోదీ 22 వేల కోట్ల లూటీ, రూ.58వేల కోట్ల రాఫెల్ కుంభకోణం.. ఈ రెండు అంశాలపై ఈసారి 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని స్పందన కోసం ఎదురుచూస్తున్నానని ట్వీట్ చేశారు.



షిల్లాంగ్ రోడ్‌షోలో రాహుల్‌గాంధీ

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే దుర్మరణం

ఇద్దరు గన్‌మెన్లు, మరోవ్యక్తి మృతి.. యూపీలో దుర్ఘటన

సీతాపూర్ (యూపీ): ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీజేపీ ఎమ్మెల్యే లోకేంద్రసింగ్ (45) దుర్మరణం పాలయ్యారు. బుధవారం లక్నోలో జరుగుతున్న పెట్టుబడిదారుల సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్తుండగా ఆయన ప్రయాణిస్తున్న కారు, లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యేతోపాటు ఇద్దరు గన్‌మెన్లు మృత్యువాత పడ్డారు. ఎమ్మెల్యే కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోయి డివైడర్ దాటి అవతలి వైపునకు వెళ్లి లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో లారీ క్లీనర్ కూడా చనిపోయారు.

పాతికేండ్ల రికార్డ్ బ్రేక్‌చేసిన కేటీఆర్

- ముంబై వెలుపల తొలిసారిగా నాస్కాం ఇండియా లీడర్‌షిప్ ఫోరం
- వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌తో కలిసి సంయుక్తంగా సాగిన సదస్సు
- మంత్రి కేటీఆర్‌పై ప్రశంసలు కురిపించిన దిగ్గజాలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ అసోసియేషన్ (నాస్కాం)కు చెందిన 25 ఏండ్ల రికార్డును రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బ్రేక్‌చేశారు. నాస్కాం తన ఇండియా లీడర్‌షిప్ ఫోరంను మొట్టమొదటిసారిగా హైదరాబాద్‌లో నిర్వహించడం ద్వారా మంత్రి కేటీఆర్ ఖాతాలో మరో రికార్డు చేరింది. ఈ విషయాన్ని నాస్కాం ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్ స్వయంగా వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం సందర్భంగా ఆర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పాతికేండ్ల చరిత్రలో మొదటిసారిగా ముంబైని వదిలి మరోనగరాన్ని వేదికగా నిర్ణయించామని.. మంత్రి కేటీఆర్ ప్రయత్నం, పనితీరు వల్లే హైదరాబాద్‌లో నిర్వహించామని చెప్పారు. ఫోరం ఏర్పాటుకు సిద్ధమైన క్షణంనుంచి విజయవంతంగా పూర్తయ్యే వరకు మంత్రి కేటీఆర్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఐటీ పరిశ్రమను ముందుకు తీసుకుపోతున్న తీరును గుర్తించి తాము సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. రాబోయేకాలంలో ఉద్యోగాల కల్పన, భవిష్యత్తు మార్చే ఎనిమిది సాంకేతిక విప్లవాలను గుర్తించామని వాటిలో కీలకమైన డాటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన ముఖ్యమైన కేంద్రం హైదరాబాద్‌లో కొలువుదీరనుందని తెలిపారు.

ప్రముఖుల ప్రశంసలు..

వరల్డ్ ఐటీ కాంగ్రెస్, ఎన్ఐఎల్ఎఫ్ సదస్సుల సందర్భంగా పలువురు ప్రముఖులు మంత్రి కేటీఆర్‌ను ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి కీలక సమన్వయకర్తగా వ్యవహరించిన ఎన్ఐఎల్ఎఫ్ చైర్మన్ సీపీ గుర్నానీ తన ప్రారంభోపన్యాసంలో 'తెలంగాణ ప్రభుత్వం ముఖ్యంగా మంత్రి కేటీఆర్ సహాయం లేకపోతే.. ఇంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని నాస్కాం విజయవంతంగా నిర్వహించలేకపోయేది. మొట్టమొదటి సారిగా ముంబైలో కాకుండా వేరే నగరంలో అది కూడా హైదరాబాద్‌లో నిర్వహించడానికి మంత్రి కేటీఆర్ కారణం' అని అన్నారు. ప్రఖ్యాత సేల్స్‌ఫోర్స్ సంస్థ సీఈవో అయితే ప్రత్యేకంగా ట్వీట్ ద్వారా కొనియాడారు. 'మంత్రి కేటీఆర్‌ను కలవడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది' అని ట్వీట్ చేశారు. కాగా, మంత్రి కేటీఆర్ ప్రసంగం అనంతరం పలు కంపెనీల ప్రతినిధులు ఆయనపై ప్రశంసలు గుప్పించారు. నాస్కాం బీపీఎం కౌన్సిల్ కో చైర్మన్ శ్రీకాంత్ వెల్లంకి మాట్లాడుతూ తెలంగాణలో ఈ నూతన కేంద్రం ఏర్పాటు చేయడం తనకు ఆశ్చర్యాన్ని కలిగించలేదని అన్నారు. మంత్రి కేటీఆర్ పనితీరును, తెలంగాణ ఐటీ రంగం వృద్ధిని, ప్రత్యేకతను గుర్తిస్తూ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



విప్రో సీఎస్‌వో రిషద్ ప్రేమ్‌జీతో చర్చాగోష్ఠిలో పాల్గొన్న దీపికా పదుకోణ్

మీ ఆత్మీయుల మనసు మాట వినండి

- మానసిక కుంగుబాటు సమస్యకు పరిష్కారం చూపండి
- ప్రముఖ సినీ నటి దీపికా పదుకోణ్
- వరల్డ్ ఐటీ కాంగ్రెస్, నాస్కాం ఇండియా లీడర్‌షిప్‌లో ప్రసంగించిన తార

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమాజంలో ఇటీవలి కాలంలో మానసిక కుంగుబాటు పెద్దసమస్యగా మారిందని ప్రముఖ సినీనటి దీపికా పదుకోణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు ప్రతిఒక్కరు తమ కుటుంబసభ్యులు, ఆత్మీయుల మనసులోని మాటను వినాలని ఆమె విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరుగుతున్న వరల్డ్ ఐటీ కాంగ్రెస్, నాస్కాం ఇండియా లీడర్‌షిప్ సదస్సులో బుధవారం ఆమె మానసిక దృఢత్వం అనే అంశంపై విప్రో ముఖ్యప్రణాళిక అధికారి రిషద్ ప్రేమ్‌జీతో చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. అనంతరం పలువురి ప్రశ్నలకు దీపిక సమాధానాలు ఇచ్చారు. రకరకాల కారణాల వల్ల మానసిక కుంగుబాటు ఇటీవల సర్వసాధారణం అయిపోందని పేర్కొంటూ.. దీనికి సామాజికపరమైన ధైర్యమే పరిష్కారం అని చెప్పారు. 2014లో తను డిప్రెషన్‌లోకి వెళ్లిపోయినపుడు తనతల్లి ఎంతో ధైర్యం చెప్పిందని అంటూ ఆమె తన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. అందుకే నిరాశకు గురైనవారికి మార్గదర్శనం ముఖ్యమని భావించి తాను ప్రత్యేకంగా ఓ స్వచ్ఛంద సంస్థను స్థాపించినట్టు దీపిక తెలిపారు.

టెక్ వినియోగంలో మేమే టాప్

- స్టార్టప్ స్టేట్‌గా తెలంగాణ
- టెలి మెడిసిన్, ఐవోటీలతో నాణ్యమైన సేవలు
- ఏడాది చివరికి టీ ఫైబర్
- ఇంటర్నెట్‌తో కోటి ఇండ్ల అనుసంధానం
- సామాన్యుడికి ఉపయోగపడితేనే సాంకేతికతకు సార్థకత
- వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



నాస్కాం సోషల్ ఇన్నోవేషన్ ఫోరం-2018 అవార్డును అందజేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, నాస్కాం మాజీ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి తదితరులు

సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాలను అధిగమించి దూసుకుపోతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. విభిన్న రంగాల్లో ప్రపంచంలో అందుబాటులో ఉన్న అత్యంత అధునాతన టెక్నాలజీని ఉపయోగించుకొంటూ ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. సామాన్యుడిపై ప్రభావం చూపించని సాంకేతికత వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకొంటున్నామని వెల్లడించారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ స్టార్టప్ స్టేట్‌గా వేగంగా ఎదుగుతున్నదని సంతోషం వ్యక్తంచేశారు. హెచ్ఐసీసీలో మూడోరోజు బుధవారం కొనసాగిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో భాగంగా నాస్కాం ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భారత్ ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశం అని పిలిపించుకోవడం ఇష్టంలేదని, టెక్నాలజీ మన దేశంలోని అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుందని తెలిపారు. సాంకేతికత అన్నది పేదలకు ఉపయోగపడితే సమాజంలో ఎన్నో మార్పులు వస్తాయన్న లక్ష్యంతో అనేక కార్యక్రమాలను అమలుచేస్తున్నామని వెల్లడించారు. కొత్తగా వచ్చే ఏ టెక్నాలజీ అయినా సమాజానికి, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకొని అద్భుతాలు చేయవచ్చని అన్నారు. భారత్‌లో తొలి టెలిమెడిసిన్‌ను ఇక్కడే ప్రారంభించామని గుర్తుచేశారు. టెలీమెడిసిన్, ఐవోటీ ద్వారా మిగతా రాష్ట్రాల కంటే నాణ్యమైన సేవలు అందించడంలో ముందున్నామని చెప్పారు. రాష్ట్రంలో పెద్దమొత్తంలో పాఠశాలల డిజిటలైజేషన్ చేశామని వివరించారు. 3000 స్కూళ్లలో టీక్లాస్ పేరుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులు సైతం దీనివల్ల లబ్ధి పొందుతున్నారని చెప్పారు. మైక్రోసాఫ్ట్, ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖాన సహకారంతో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు కంటిపరీక్షలు చేయిస్తున్నామన్నారు.. సాంకేతికతతోనే అభివృద్ధి చెందిన దేశాల్లో వేగవంతమైన వృద్ధి సాధ్యమయిందని, నాణ్యమైన సేవలు ప్రజలకు అందుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడు చెప్తుంటారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. అదే లక్ష్యంతో ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకుపోతున్నదని అన్నారు. 'వైద్యరంగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో ప్రతి హాస్పిటల్‌లో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో 50 కిలోమీటర్లు ప్రయాణం చేసినా వైద్యులు అందుబాటులో ఉండరు. ఆ సమయంలో టెక్నాలజీ సహాయం చేస్తుంది.' అని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నాణ్యమైన సేవలు దరిచేర్చే విషయంలో సాంకేతిక అనేది ప్రభుత్వానికి లబ్ధిదారులకు మధ్య వారధిగా నిలుస్తుందని వివరించారు. మానవ మేధస్సుకు కృత్రిమ మేధస్సు తోడైతే ప్రజలు ఎదుర్కొనే అనేక సవాళ్లకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతులకు ఉపయోగపడేలా టెక్నాలజీని తీర్చిదిద్దాలన్నారు. నూతన ఆవిష్కరణలు రావాల్సినఅవసరం ఉన్నదని పేర్కొన్నారు. నిపుణులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు క్షేత్రాలకు వెళ్లకుండానే రైతులకు సలహాలు, సూచనలు అందించడం టెక్నాలజీతో సాధ్యమవుతుందని చెప్పారు.

ఏడాది చివరికి టీ ఫైబర్..

తెలంగాణలో ఈ ఏడాది చివరికల్లా టీ ఫైబర్ అందుబాటులోకి వస్తుందని మంత్రి కేటీఆర్ వెల్లడించారు.15 ఎంబీపీఎస్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్‌తో తెలంగాణలోని కోటి ఇండ్లు ఇంటర్‌నెట్‌తో అనుసంధానం అవుతున్నాయని చెప్పారు. పంచాయతీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు.. అన్నీ టీ ఫైబర్‌తో లింక్ కానున్నాయని వివరించారు. రాష్ట్రంలో ఇది పెను మార్పులకు నాంది పలుకనుందని తెలిపారు.

ప్రైవేటు సంస్థలు కలిసిరావాలి

ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో ఆహార సమస్య ప్రధానమైందని, సాంకేతికతతో ఈ సమస్య నుంచి బయటపడవచ్చన్నారు. మానవాళి ఎదుర్కొంటున్న అన్ని సమస్యల నుంచి సాంకేతికత వినియోగంతో లబ్ధి పొందవచ్చన్నారు. సామాజిక, గ్రామీణ అవసరాలు తీర్చే విధంగా నూతన ఆవిష్కరణలు రావాలని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్పంచుకునేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసే సంస్థలకు స్వాగతం పలుకుతామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమంతోపాటు ప్రైవేటు కంపెనీల అవసరం గురించి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లుగానే.. కంపెనీలు సైతం ప్రభుత్వంతో కలిసి రావాలన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీకి మాత్రమే పరిమితం కాకుండా సమాజంలో మార్పు తెచ్చేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నూతన సాంకేతిక ఆవిష్కరణలతో సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతున్న పలు సంస్థలకు నాస్కాం ఫౌండేషన్ పురస్కారాలను మంత్రి కేటీఆర్ అందజేశారు.

రాష్ట్రంలో విప్రో సబ్బుల పరిశ్రమ

మొదటిపేజీ తరువాయి...

సౌందర్య ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని మహేశ్వరం మండలంలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకు కోసం విప్రో సంస్థ దాదాపు రూ. 220 కోట్లను పెట్టుబడి పెట్టనున్నది. 40 ఎకరాల్లో నిర్మించనున్న ఈ తయారీ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా 200 మందికి ఉపాధి కల్పించనున్నారు. ఇప్పటికే ఇతర విభాగాల్లో తెలంగాణలో పెద్ద ఎత్తున కార్యకలాపాలు నిర్వహిస్తున్న విప్రో సంస్థ నూతనంగా ఈ తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినందుకు మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. టీఎస్ఐపాస్ ద్వారా ఇప్పటికే అనేక మెగా ప్రాజెక్టులకు అనుమతులిచ్చామని, ఇప్పుడు మరో మెగాప్రాజెక్టు రావడం రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణానికి అద్దం పడుతున్నదని తెలిపారు. దీంతోపాటు తెలంగాణలో ఉన్న పలు ఇతర పెట్టుబడి అవకాశాలను మంత్రి కేటీఆర్.. ఈ సందర్భంగా రిషద్ ప్రేమ్‌జీకి వివరించారు. ద్వితీయ శ్రేణి నగరాల్లోకి ఐటీ పరిశ్రమను తీసుకుపోయేందుకు ప్రయత్నం చేస్తున్నామని, ఇందుకోసం ఇప్పటికే పలు జిల్లాల్లో ఐటీ టవర్లు నిర్మిస్తున్నామని, టాస్క్ ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని రిషద్‌కు తెలిపారు. వరంగల్ పట్టణంలో సైయెంట్ తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నదని, తాజాగా టెక్ మహీంద్రా క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిందని తెలిపిన మంత్రి కేటీఆర్.. విప్రో కంపెనీని వరంగల్‌కు ఆహ్వానించారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగంలో దేశంలోనే తెలంగాణ ముందువరుసలో ఉన్నదని రిషద్‌కు తెలిపారు. టీహబ్, టీ వర్క్స్ వంటి కార్యక్రమాలపై ఈ సమావేశంలో రిషద్ ప్రేమ్‌జీకి వివరించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న మహిళా ఇంక్యుబేటర్ 'వి హబ్' తో విప్రో భాగస్వామ్యానికి మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

తయువాన్‌తో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందం

తైవాన్ దేశానికి చెందిన తయువాన్ రాష్ట్రంతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది. వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సందర్భంగా మూడో రోజైన బుధవారం ఈ రెండు రాష్ట్రాల మధ్య సిస్టర్ స్టేట్ ఒప్పందం కుదిరింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తయువాన్ సిటీ బోర్డ్ డైరెక్టర్ రాబర్ట్ హ్యువాంగ్ ఒప్పంద పత్రాలను పరస్పరం అందించుకొన్నారు. ఇంటర్నెట్ ఓవర్‌థింగ్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అంశాల్లో తయువాన్ వేగంగా వృద్ధి చెందుతున్నది. ఈ ఒప్పందం ద్వారా రెండు రాష్ట్రాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మేలు జరుగుతుంది. రెండు రాష్ట్రాల్లో ఎక్కడ తమ వ్యాపారాలను ప్రారంభించాలన్నా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు విధానపరమైన మద్దతును అందిస్తాయి. ప్రత్యేక సౌలభ్యాలను కల్పిస్తాయి. స్టార్టప్‌లు లేదా ఉత్పత్తిదారులతో ఇప్పటికే తయారైన వాటిని తెలంగాణలో పరీక్షించేందుకు అవకాశం దక్కుతుంది. టీహబ్, టీ ఫైబర్, టీ వర్క్స్, టీ బ్రిడ్జిల ద్వారా తయువాన్ రాష్ట్రానికి తగిన సహకారాన్ని తెలంగాణ ఐటీ శాఖ అందిస్తుంది. పరిశోధనల్లో.. తెలంగాణలోని విద్యాసంస్థలతో తయువాన్ కలిసి ముందుకు సాగుతుంది.

ఘనంగా ముగిసిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్

ప్రతిష్ఠాత్మక వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (డబ్ల్యూసీఐటీ)–2018తో పాటు నాస్కాం ఇండియా లీడర్‌షిప్ ప్రోగ్రాం హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిసింది. వచ్చే ఏడాది అర్మేనియాలో ఈ సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. మూడురోజుల పాటు సాగిన ఈ ఐటీ ఒలింపిక్స్‌కు 30 దేశాల నుంచి 2500 మందికి పైగా అతిథులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమంలో నాస్కాం చైర్మన్ రమన్‌రాయ్, నాస్కాం అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్, వరల్డ్ ఐటీ కాంగ్రెస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ జిమ్ పోషియంట్, చైర్మన్ యువాన్ చూ, తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమన్ రాయ్ మాట్లాడుతూ తెలంగాణలో రెండు ప్రతిష్ఠాత్మక సదస్సులను ఏకకాలంలో విజయవంతంగా నిర్వహించిందని ప్రశంసించారు. హైదరాబాద్ టీ రంగం విశేషవృద్ధిని కనబర్చడంతోపాటుగా ప్రతిష్ఠాత్మక సదస్సుల నిర్వహణలో సైతం అదేరీతిలో తన ముద్రను వేసుకుంటున్నదని పేర్కొన్నారు. రెండు సదస్సులను విజయవంతంగా నిర్వహించడం పట్ల నాస్కాం తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ నుంచి ఎంతో నేర్చుకున్నాం: అలెగ్జాండర్ యషుయాన్

హైదరాబాద్‌లో ప్రస్తుత వరల్డ్ ఐటీ కాంగ్రెస్ నిర్వహణ ద్వారా తాము ఎంతో నేర్చుకున్నట్లు వచ్చే ఏడాది నిర్వహించనున్న ఆర్మేనియా దేశానికి చెందిన ప్రతినిధి అలెగ్జాండర్ యషువాన్ తెలిపారు. సదస్సు అనంతరం ఆయనతో నమస్తే తెలంగాణ ప్రత్యేకంగా ముచ్చటించగా 'హైదరాబాద్ వాసులు అద్భుతమైన ప్రేమ, గౌరవానికి చిరునామా. తాజాగా జరిగిన సదస్సు నిర్వహణతో మేం ఎంతో నేర్చుకున్నాం. తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. మా దేశంలో వచ్చే ఏడాది నిర్వహించేందుకు తగిన అవగాహనను కలిగించారు. మంత్రి కేటీఆర్ కృషి ప్రశంసనీయం' అని అన్నారు.

మనస్ఫూర్తిగా చెప్తున్నా.. హైదరాబాద్ ఆతిథ్యం అదుర్స్

వరల్డ్ ఐటీ కాంగ్రెస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ జిమ్ పోషియంట్ ఈ సందర్భంగా ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఇప్పటివరకు తాను పది వరల్డ్ ఐటీ కాంగ్రెస్ నిర్వహణల్లో పాలుపంచుకొన్నానని అత్యుత్తమంగా, అద్భుతంగా నిర్వహించిన కేంద్రంగా హైదరాబాద్ నిలుస్తుందని తన హృదయాంతరాల్లోంచి చెప్తున్నానని అన్నారు. సదస్సు ప్రారంభ చర్చ నుంచి మొదలుకొని ముగింపు వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందని వివరించారు. అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, మెరుగైన మానవ వనరులకు హైదరాబాద్ వేదిక అని పేర్కొంటూ రాబోయే కాలంలో ఐటీ రంగం విశేష వృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

ప్రతిష్ఠాత్మక సదస్సుల వేదిక హైదరాబాద్: కేటీఆర్

మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ అద్భుతమైన సదస్సుకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం కల్పించిన నాస్కాం, విట్సాకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సు ద్వారా ప్రపంచ ఐటీ ముఖచిత్రంపై హైదరాబాద్ మరోమారు తన గుర్తింపును చాటుకున్నదని సంతోషం వ్యక్తంచేశారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ ప్రతిష్ఠాత్మక సదస్సుల వేదికగా నిలుస్తున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. సదస్సు ముగిసిన అనంతరం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఒక్క ఫిబ్రవరి నెలలోనే నాలుగు ప్రతిష్ఠాత్మక సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సదస్సులో పలు ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించారు. నాస్కాంతో కలిసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయనున్నామని, విప్రో తన ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించనున్నదని, అడోబీ కూడా తన సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నదని వెల్లడించారు. గత మూడేండ్లలో దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ఐదు శాతం ఎక్కువ వృద్ధితో తెలంగాణ ఐటీ రంగం అభివృద్ధి చెందుతున్నదని వివరించారు. కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ విస్తరణ ప్రారంభమైందని వివరించారు. తద్వారా ఆయా ప్రాంతాల యువకులకు అవకాశాలు దక్కుతాయని వెల్లడించారు. టీహబ్2 సిద్ధమవుతున్నదని, టీ వర్క్స్ ప్రొటోటైప్ ల్యాబ్ తీర్చిదిద్దనున్నామని వివరించారు. ఈ చర్యలు ఐటీని కొత్తపుంతలు తొక్కిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ముద్రను వేస్తాయని వెల్లడించారు. అన్ని దేశాల్లోని ఐటీ దిగ్గజాల దృష్టిలో హైదరాబాద్‌ను ఉంచాలన్న తమ ఆశయాలు నెరవేరబోతున్నాయని అన్నారు. త్వరలోనే వాటి ఫలాలు ప్రజల ముంగిట్లో ఆవిష్కృతం అవుతాయని ధీమా వ్యక్తంచేశారు.

బ్లాక్‌చైన్‌తో నాస్కాం ఒప్పందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పెద్దమొత్తంలో నిక్షిప్తమవుతున్న డాటా భద్రతకు బ్లాక్‌చైన్ భరోసా ఇస్తుందని టాప్‌స్కాట్ గ్రూప్ సీఈవో, బ్లాక్‌చైన్ నిపుణుడు డాన్ టాప్‌స్కాట్ అన్నారు. వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సందర్భంగా బ్లాక్ చైన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కెనడాతో నాస్కామ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. డాటా అపహరణకు గురికాకుండా కాపాడుతుందని డాన్ టాప్‌స్కాట్ చెప్పారు. బిట్ కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీ బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఆధారంగా ప్రారంభమైందన్నారు. కానీ ఇది లీగల్ టెండర్‌గా చెలామణి కావడం లేదని గుర్తుచేశారు. బుధవారం ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌లో భాగంగా 'ఎవల్యూషన్ ఆఫ్ డిజిటల్ ఎకానమీ అండ్ బ్లాక్ చైన్' టాప్‌స్కాట్ ప్రసంగించారు. బ్లాక్ చైన్ సాంకేతికత గురించి వివరించారు. ఇతరుల్లో నమ్మకం కలిగించడానికి, లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించడానికి, మోసాలను నివారించడానికి బ్లాక్ చైన్ ఒక సాధనంగా పనిచేస్తుందని చెప్పారు. ఈ టెక్నాలజీతో భూ రిజిస్ట్రేషన్లు, బ్యాంకు లావాదేవీలు, ఓటర్ల జాబితాలను అనుసంధానం చేయడం వల్ల దేశంలో ఎక్కడి నుంచైనా సమాచారం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. టోల్‌గేట్, ఆర్టీసీ, రైల్వే వంటి సేవలను పొందడానికి ఒక ప్రాంతంలో కార్డు తీసుకొని మిగతా ప్రాంతాల్లో సేవలు పొందవచ్చని వివరించారు.



బ్లాక్‌చైన్ గ్రూప్ సీఈవో డాన్ టాప్‌స్కాట్

టీ ఫైబర్ అదిరింది..!

- విదేశీ ప్రతినిధుల ప్రశంసలు
- పైలట్ ప్రాజెక్టు విజయవంతం
- 4 గ్రామాల్లో కేబుల్ ఆధారిత ఇంటర్‌నెట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంటింటికీ ఇంటర్‌నెట్ లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న టీ ఫైబర్‌పై ప్రశంసలు వెల్లువెత్తాయి.. టెక్నాలజీ సాయం తో నాణ్యమైన సేవలను మారుమూల ప్రాంతాలకు చేరవేయాలనే ఆలోచనకు మన్ననలు దక్కాయి.. హెచ్ఐసీసీలో ప్రపంచ ఐటీ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన టీ ఫైబర్ ప్రదర్శనకు పలు రాష్ట్రాలు, దేశాల ప్రతినిధులనుంచి మంచి స్పందన వచ్చింది. టీ ఫైబర్‌తో ఇంటింటికీ ఇంటర్‌నెట్ అందుబాటులోకి వస్తే కలిగే ప్రయోజనాలను చూసి ఇతర రాష్ట్రాల ప్రతినిధులు ఆశ్చర్యపోయారు. రాష్ట్రంలోని 31 జిల్లాలు, 584 మండలాలు, 8778 గ్రామ పంచాయతీలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించే ఫైబర్ గ్రిడ్ గురించి తెలుసుకునేందుకు ఆసక్తి ప్రదర్శించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా టీ ఫైబర్‌తో అనుసంధానం చేసిన తుమ్మలూరు, మహేశ్వరం, మన్‌సాన్‌పల్లి, సిరిగిరిపురంలో ఈ సేవలు ప్రారంభమయ్యాయి.

ఇక్కడ డాక్టర్.. అక్కడ పేషెంట్..

మన్సాన్‌పల్లిలో టెలీ మెడిసిన్ సేవలు అందుతున్నాయి. అక్కడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక డివైజ్‌తో హైదరాబాద్‌లో ఉన్న వైద్యులు సేవలు అందిస్తున్నారు. మహేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు నిపుణులతో కౌన్సిలింగ్, ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. స్టెర్‌లైట్ టెక్ ప్రత్యేక డివైజ్ స్టెర్‌లైట్ గర్వ్‌ని తుమ్మలూరులో ఏర్పాటుతో ఆ గ్రామం స్మార్ట్ విలేజ్‌గా మారిపోయింది. రైతుల సమస్యలకు చెక్ పెట్టేందుకు 'కిసాన్ రాజా' టెక్నాలజీని మహేశ్వరం మండలంలో ఏర్పాటుచేశారు. దీని పరిధిలో ఉన్న వ్యవసాయ క్షేత్రాలపై పూర్తిస్థాయిలో నిఘా సాధ్యమవుతున్నది.



టీ ఫైబర్‌తో అనుసంధానం చేసిన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ పంచాయతీ. పక్కన మహేశ్వరం ఎంపీడీవో కార్యాలయం

టీ ఫైబర్‌కు ప్రశంసలు వచ్చాయి



ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు టీ ఫైబర్ గురించి తెలుసుకునేందుకు ఆసక్తి కనబరిచారు. పలువురు తెలంగాణ సర్కారు కృషిని ప్రశంసించారు. టీఫైబర్ అద్భుతమైన ప్రాజెక్టు అని కితాబిచ్చారు. టీ ఫైబర్‌తో ఇంటర్‌నెట్ అందుబాటులోకి వస్తే నాణ్యమైన సేవలు, సకాలంలో అందుతాయి.

- జీ సంజయ్, టీ ఫైబర్ ప్రాజెక్టు మేనేజర్

తపన ఉంటేనే విజయం సాధ్యం

- వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో యువ వ్యాపారవేత్తలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లక్ష్యం సాధనపై యువతకు తపన ఉండాలని, అలాంటప్పుడే విజయం సాధ్యమవుతుందని వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో యువ పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడ్డారు. కసి, పట్టుదల, దీర్ఘకాలిక లక్ష్యాలు అనేవి కంపెనీ ఏర్పాటులో, పురోగతిలో కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. ఒక కంపెనీలో ఉద్యోగం చేయడం వల్ల పరిమిత స్వేచ్ఛ ఉంటుందని, కానీ, ఒక కంపెనీని స్థాపిస్తే అపరిమిత స్వేచ్ఛ సొంతమవుతుందని చెప్పారు. తన భవిష్యత్‌తోపాటు ఎందరో ఉద్యోగుల జీవితాలు తమ నిర్ణయాలపై ఆధారపడి ఉంటాయన్న విషయాన్ని మరిచిపోవద్దని హెచ్చరించారు. చివరిరోజు బుధవారం వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో భాగంగా 'ఫౌండర్స్ మెంటాలిటీ టు బిల్డింగ్ గ్రేట్ ప్రోడక్ట్స్, టీమ్స్, కల్చర్' అనే అంశంపై క్విక్ పాడ్ ఫౌండర్ రవి గురురాజ్ ఆధ్వర్యంలో చర్చ నిర్వహించారు. యువ వ్యాపారవేత్తలైన యాప్ డైనమిక్ కంపెనీ మాజీ సీఈవో జ్యోతి బన్సాల్, ఇన్ మోబీ ఫౌండర్ నవీన్ తివారీరి పాల్గొని ఔత్సాహికులకు మార్గనిర్దేశం చేశారు. ఉద్యోగులుగా పనిచేసి తర్వాత కంపెనీలు స్థాపించే స్థాయికి ఎదుగడం వెనుక ఎంతో కృషి దాగి ఉన్నదని అభిప్రాయపడ్డారు. తొలుత కష్టాలు ఎదుర్కొన్నామని, పెట్టుబడుల కోసం ఎందరినో ఒప్పించాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం అంతగా శ్రమించాల్సిన అవసరం లేకుండా యువ పారిశ్రామికవేత్తలకు అవకాశాలు దొరుకుతున్నాయని చెప్పారు.

నేటినుంచి బయో-ఏషియా సదస్సు

ప్రారంభించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ■ హెచ్ఐసీసీ వేదికగా మూడురోజుల కార్యక్రమం

50కి పైగా దేశాల నుంచి 1200 మందికిపైగా ప్రతినిధుల రాక

వందమంది ప్రసంగం ■ జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం చేయనున్న సీఎం

రేపటి సెషన్‌లో పాల్గొననున్న కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు, రాష్ట్ర మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మరో ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవానికి హైదరాబాద్ సిద్ధమైంది. జీవ సాంకేతిక, జీవశాస్త్ర (బయో టెక్నాలజీ, లైఫ్‌సైన్సెస్) రంగంలో వస్తున్న మార్పులపై ఆసియాలోనే అతిపెద్ద 'బయో–ఏషియా సదస్సు' గురువారం నుంచి హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ) వేదికగా ప్రారంభంకానున్నది. మూడురోజులపాటు జరిగే 'బయో– ఏషియా ఎవాల్వింగ్ రెగ్యులేషన్' సదస్సును గురువారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రారంభిస్తారు. సదస్సులో బిజినెస్–టు–బిజినెస్ (బీ టు బీ) సమావేశాల్లో 50కి పైగా దేశాల నుంచి 1200 మందికి పైగా పాల్గొంటారని, సుమారు వందమంది ప్రముఖులు ప్రసంగిస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం అందించే ప్రతిష్ఠాత్మక జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డుకు ఈ ఏడాది స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మిచెల్–ఎన్–హాల్ ఎంపికయ్యారు. సదస్సు ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్ ఆయనకు అవార్డును ప్రదానం చేయనున్నారు. 'ఇన్నోవేషన్ ఎక్స్‌పొనెన్షియల్ మెడిసిన్, బయో మార్కర్స్ క్యాన్సర్ డయాగ్నోస్టిక్స్, డిజిటల్ హెల్త్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అంశాలపై ప్రధానంగా ప్రసంగించనున్నారు.

ఘనంగా ఏర్పాట్లు.. ఫార్మా అనుబంధ రంగాలపై ప్రదర్శన

సదస్సును ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లుచేసింది. రాష్ట్రంలో లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. దేశ, విదేశీ ప్రతినిధులు రాష్ట్రంలో పెట్టుబడులు, బయోసైన్స్‌లో వస్తున్న మార్పులు, కొత్త టెక్నాలజీపై సదస్సులో చర్చించనున్నారు. ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లోని ఆసియా దేశాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, రెగ్యులేటరీ సంస్థల ప్రతినిధులు సదస్సుకు హాజరుకానున్నారు. 23, 24 తేదీల్లో జీవ సాంకేతికపరమైన అంశాలపై టెక్నికల్ సెషన్లు జరుగనున్నాయి. 23న సాయంత్రం జరిగే సెషన్‌లో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు పాల్గొననున్నారు. ప్రపంచ మార్కెట్లో వస్తున్న మార్పులు, అందుకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. హెచ్ఐసీసీలో ఫార్మా అనుబంధరంగాలపై ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. 50కి పైగా దేశాలకు చెందిన కార్పొరేట్ కంపెనీలు తమ ఉత్పత్తులు, యంత్ర పరికరాలను ప్రదర్శించనున్నాయి.

నేడు జీనోమ్ వ్యాలీ సందర్శన

లైఫ్‌సైన్సెస్ రంగంలో పరిశోధనలకు వేదికగా ఉన్న శామీర్‌పేటలోని జీనోమ్ వ్యాలీని.. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు గురువారం ఉదయం సందర్శించనున్నారు. ప్రపంచస్థాయి సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరించేందుకు ఈ సందర్శన ఉపయోగపడనుంది. 23న ఉదయం 10 గంటలకు నోవార్టిస్ ఫార్మా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరాం అర్థే, స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మిచెల్ ఎన్ హాల్ కీలకోపన్యాసం చేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు సీఈవో కాంక్లేవ్‌లో భాగంగా జరిగే చర్చలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, నోవార్టిస్ ఇండియా అధ్యక్షుడు జావెద్ జియా, డెలాయిట్ వైస్ చైర్మన్ గ్రేగోరి రే తదితరులు పాల్గొంటారు.



విద్య కోసం విరాళం!


ముప్పై రెండేళ్ల పాటు చదువు చెప్పి వేల మంది విద్యార్థులకు బంగారు భవిష్యత్తును ప్రసాదించిందామె. ఇప్పుడు విరాళ మిచ్చి లక్షల మంది భవిష్యత్తును బంగారుమయం చేస్తున్నది.

తమిళనాడుకు చెందిన 50 ఏండ్ల పొన్మన్‌దేవి ముప్పై రెండేళ్ల పాటు ఉపాధ్యాయురాలిగా పనిచేసి హెడ్ మాస్టర్ పదవిలో రిటైర్డ్ అయింది. ఎరోడేలోని ప్రభుత్వ పాఠశాల భవనం కోసం తన నాలుగు కోట్ల విలువైన భూమిని విరాళంగా ఇచ్చింది. 1964లో టీచర్‌గా వృత్తిలోకి చేరిన ఈమె 32 ఏండ్లలో ఎంతో మందిని తీర్చిదిద్దింది. 1996 మోదచూర్ ప్రభుత్వ పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా సేవలందించింది. 2006లో వెనుక బడిన తరగతుల శాఖకు సంబంధించి హాస్టల్ భవనం కోసం 25 గజాల స్థలాన్ని ఇచ్చింది. 2015లో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం కోసం రూ. 2 లక్షలు విరాళంగా ఇచ్చింది. ఉన్న దాంట్లో ఎంతో కొంత పంచడం తెలిసిన వాళ్లు ఇలాంటి పనులకు శ్రీకారం చుడుతారని పొన్మన్‌దేవి మరోసారి నిరూపించింది. నేటి తరానికి ఆమెలాంటి మనసున్న మహిళలు అవసరం.


ముందే చనిపోతున్నారు!

ఆ మహిళలు వేరేవాళ్లతో పోలిస్తే పద్నాలుగేళ్ల ముందే చనిపోతున్నారు. పేదరికం, నిరక్షరాస్యత, ఆరోగ్యంపై అవగాహన లేమి.. వెరసి త్వరగా చనిపోతున్నారట. ఎవరా మహిళలు? ఎందుకు?

ఐక్యరాజ్య సమితి తాజాగా జరిపిన ఓ అధ్యయనంలో అణగారిన వర్గాల మహిళల జీవన ప్రమాణాలపై విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. దేశంలోని మహిళల జీవిత కాలంపై అంచనా వేస్తూ ఈ అధ్యయనాన్ని ప్రకటించింది ఐరాస. అణగారిన వర్గాల మహిళలు ఉన్నత కులాల మహిళల కన్నా పద్నాలుగేళ్ల ముందు చనిపోతున్నారట! పేదరికం, అపరిశుభ్రత, పౌష్టికాహారలోపం, వ్యాధినిరోధక శక్తి లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. 2030 ఐక్యరాజ్య సమితి ఎజెండాలో లింగ సమానత్వం అనే అంశం కీలకంగా ఉంటుంది. అందుకోసం ఈ అధ్యయనం ద్వారా మహిళల్లో ఉన్న సమానత్వపు శాతాన్ని బట్టి భవిష్యత్తు ప్రణాళిక చేయనున్నారు. లింగ సమానత్వం లేకపోతే వచ్చే నష్టాల నివారణ కోసం ఇప్పటి నుంచే చర్యలు మొదలుపెట్టనున్నారు. దానికోసం నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాల మీద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.



జిందగీ పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



బీట్‌రూట్.. టేస్టే సపరేట్!

ఎదిగే పిల్లలకు.. గర్భిణులకు మాత్రమే కాదు.. అందరికీ ఆరోగ్యప్రదాయిని బీట్‌రూట్.. దీన్ని మామూలుగా తినలేం.. అలా అని కూర చేసినా బోరే.. స్పెషల్‌గా సలాడ్.. పసందుగా సాంబార్‌లాంటి వెరైటీలు చేయండి.. అంతేనా.. సూప్‌గా తాగొచ్చు. రోటీలకు పచ్చడిగా నంజుకోవచ్చు. సపరేట్ టేస్ట్‌గా భావించే బీట్‌రూట్ వంటకాలు ఇవి.

బీట్‌రూట్ సాంబార్



కావాల్సినవి :

బీట్‌రూట్స్ : 2, **ఎండుమిర్చి :** 2, **ఎర్రమిరపకాయలు :** 8, **మినపప్పు :** ఒక టేబుల్‌స్పూన్, **శనగపప్పు :** ఒక టేబుల్‌స్పూన్, **మిరియాలు :** అర టేబుల్‌స్పూన్, **ధనియాలు :** అర టేబుల్ స్పూన్, **జీలకర్ర :** పావు టేబుల్‌స్పూన్, **కొబ్బరి తురుము :** అర కప్పు, **టమాటా ముక్కలు :** ఒక కప్పు, **ఆవాలు :** ఒక టీస్పూన్, **ఇంగువ :** చిటికెడు, **కరివేపాకు :** ఒక రెమ్మ, **పచ్చిమిరపకాయలు :** 3 **పసుపు :** అర టీస్పూన్, **కందిపప్పు :** ఒక కప్పు, **చింతపండు రసం :** అర కప్పు, **బెల్లం :** అర టేబుల్‌స్పూన్, **కొత్తిమీర :** చిన్న కట్ట **నూనె :** 3 టేబుల్‌స్పూన్ **ఉప్పు :** తగినంత

తయారీ :

స్టెప్ 1 : ఒక గిన్నెలో ఒక టేబుల్‌స్పూన్ నూనె పోసి ఎర్ర మిరపకాయలు, మినపపప్పు, శనగపప్పు, మిరియాలు, ధనియాలు, కొబ్బరి తురుము వేసి వేయించాలి.

స్టెప్ 2 : దీంట్లో టమాటాలు, ఉప్పు వేసి మూడు నిమిషాల పాటు కలిపి పక్కన పెట్టాలి. ఇవి కాస్త చల్లగా అయ్యాక మిక్సీ పట్టి మెత్తని పేస్ట్ చేసి పెట్టుకోవాలి. కందిపప్పును ఉడికించుకోవాలి.

స్టెప్ 3 : అదే కడాయిలో కొద్దిగా నూనె పోసి జీలకర్ర, ఆవాలు, ఇంగువ, ఎండుమిర్చి, కరివేపాకు, పచ్చిమిర్చి, పసుపు వేసి పోపు పెట్టుకోవాలి.

స్టెప్ 4 : ఇందులో నీళ్లు పోసి బీట్‌రూట్ ముక్కలు, ఉప్పు వేసి ఐదు నిమిషాలు ఉడికించాలి.

స్టెప్ 5 : దీంట్లో గ్రైండ్ చేసుకున్న పేస్ట్ వేసి కలిపి మూత పెట్టేయాలి. ఐదు నిమిషాల తర్వాత మెత్తగా ఉడికించిన కందిపప్పు, చింతపండు రసం, బెల్లం వేసి మరిగించుకోవాలి.

స్టెప్ 6 : చివరగా కొత్తిమీర, కొద్దిగా కొబ్బరి తురుము వేసి దించేయాలి. వేడి వేడి అన్నంలో ఈ సాంబార్ యమ టేస్టీగా ఉంటుంది.

బీట్‌రూట్ రోటీ



కావాల్సినవి :

బీట్‌రూట్స్ : 2, **నెయ్యి :** ఒక టీస్పూన్ **కారం :** ఒక టీస్పూన్, **జీలకర్ర :** అర టీస్పూన్ **గోధుమపిండి :** ఒక కప్పు , **బటర్ :** ఒక టేబుల్‌స్పూన్ **ఉప్పు :** తగినంత

తయారీ :

స్టెప్ 1 : బీట్‌రూట్‌ల చెక్కు తీసి తురుముగా చేసుకోవాలి.

స్టెప్ 2 : ఇందులో ఉప్పు, ధనియాల పొడి, కారం, నెయ్యి వేసి బాగా కలుపుకోవాలి.

స్టెప్ 3 : దీంట్లోనే గోధుమపిండి నీళ్లు పోసి చపాతీ పిండిలా చేసుకోవాలి. మామూలు రొట్టెల్లా చేసుకోవాలి.

స్టెప్ 4 : పెనం పెట్టి బటర్‌తో రెండు వైపులా మెత్తగా కాల్చుకోవాలి. వీటిని అలాగే ఆరగించినా టేస్టీగా ఉంటాయి.

బీట్‌రూట్ సలాడ్

కావాల్సినవి :

బీట్‌రూట్ : ఒక కప్పు (తురుము), **ఉల్లిగడ్డ :** 1, **పచ్చిమిరపకాయలు :** 2, **పల్లీలు :** ఒక టేబుల్‌స్పూన్, **కరివేపాకు :** ఒక రెమ్మ, **కొబ్బరి తురుము :** ఒక టేబుల్‌స్పూన్, **నువ్వులు :** ఒక టీస్పూన్, **చాట్ మసాలా :** పావు టీస్పూన్, **నిమ్మరసం :** ఒక టీస్పూన్, **కొత్తిమీర :** చిన్న కట్ట, **నూనె :** ఒక టీస్పూన్, **ఉప్పు :** తగినంత

తయారీ :

స్టెప్ 1 : ఉల్లిగడ్డలు, పచ్చిమిరపకాయలను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి.

స్టెప్ 2 : కడాయిలో నూనె పోసి పల్లీలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిరపకాయలు వేసి వేయించాలి. దీంట్లోనే బీట్‌రూట్ వేసి కలుపాలి.

స్టెప్ 3 : కాస్త వేగిన తర్వాత కరివేపాకు, ఉప్పు వేసి సన్నని మంట మీద మరో ఐదు నిమిషాలు వేయించాలి.

స్టెప్ 4 : ఇప్పుడు కొబ్బరి తురుము, కొత్తిమీర, చాటామసాలా వేసి కలుపాలి. చివరగా నిమ్మరసం వేసి దించేయాలి. పై నుంచి నువ్వులతో అందంగా గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.



బీట్‌రూట్ చట్నీ



కావాల్సినవి :

బీట్‌రూట్ : 1, **ఎండు మిరపకాయలు :** 5, **శనగపప్పు :** 2 టేబుల్‌స్పూన్స్, **మినపప్పు :** 2 టేబుల్‌స్పూన్స్, **నూనె :** 2 టేబుల్‌స్పూన్స్, **కొబ్బరి తురుము :** 3 టేబుల్‌స్పూన్స్, **చింతపండు :** కొద్దిగా, **ఇంగువ :** ఒక టీస్పూన్, **ఆవాలు :** అర టీస్పూన్, **జీలకర్ర :** అర టీస్పూన్, **కరివేపాకు :** ఒక రెమ్మ, **ఉప్పు :** తగినంత

తయారీ :

స్టెప్ 1 : కడాయిలో ఎండుమిర్చి, శనగపప్పు, జీలకర్ర, ఆవాలు, మినపపప్పు వేసి వేయించాలి. వీటిని మెత్తటి పొడిగా చేసి పక్కన పెట్టాలి.

స్టెప్ 2 : ఇప్పుడు బీట్‌రూట్‌ని తురిమి పెట్టుకోవాలి. మరో కడాయిలో నూనె పోసి ఆవాలు, చింతపండు, ఇంగువ, కరివేపాకు, తురిమిన బీట్‌రూట్, కొబ్బరి తురుము వేసి సన్నని మంట మీద ఐదు నిమిషాలు వేయించాలి.

స్టెప్ 3 : ఈ మిశ్రమం కాస్త చల్లారాక మెత్తని పేస్ట్ చేసుకోవాలి. దీన్ని ఒక గిన్నెలోకి తీసుకొని దాంట్లో ముందు కలిపిన పొడిని కలుపుకోవాలి.

స్టెప్ 4 : కావాలనుకుంటే పోపు వేసుకోవచ్చు. ఈ పచ్చడిని చపాతీల్లోకి అందుకుంటే ఆ టేస్టే వేరు.



సంజయ్ తుమ్మ
సెలబ్రిటీ చెఫ్

బీట్‌రూట్ సూప్



కావాల్సినవి :

బీట్‌రూట్ : 1
టమాటా : 1
బటర్ : ఒక టేబుల్‌స్పూన్
వెల్లుల్లిపాయలు : ఒక టీ స్పూన్
మైదా : ఒక టేబుల్‌సస్పూన్
మిరియాల పొడి : అర టీస్పూన్
క్రీమ్ : అర టేబుల్‌స్పూన్
కొత్తిమీర : చిన్నకట్ట
ఉప్పు : తగినంత

తయారీ :

స్టెప్ 1 : బీట్‌రూట్ పైన చెక్కు తీయాలి. బీట్‌రూట్, టమాటాల్లో కొన్ని నీళ్లు పోసి దాదాపు 80శాతం ఉడికించేయాలి. దీన్ని మెత్తగా గ్రైండ్ చేసి పక్కన పెట్టాలి.

స్టెప్ 2 : కడాయిలో బటర్ వేసి వెల్లుల్లి పాయలు, మైదా వేసి కలుపుతుండాలి. కాసేపటి తర్వాత పేస్ట్ చేసుకున్న బీట్‌రూట్ మిశ్రమాన్ని అందులో పోయాలి.

స్టెప్ 3 : కాసేపటి తర్వాత ఇందులో నీళ్లు పోసి మిరియాల పొడి, ఉప్పు వేసి మరిగించాలి.

స్టెప్ 4 : సన్నని మంట మీద ఐదు నిమిషాలు ఉంచి దించేయాలి. ఆ తర్వాత క్రీమ్, కొత్తిమీరతో గార్నిష్ చేసి వేడిగా సర్వ్ చేయాలి. రుచికరమైన బీట్‌రూట్ సూప్ రెడీ అయినట్లే!

బిట్స్ కార్నర్

అక్కడి తొలి మహిళా న్యాయవాది!



బుర్ఖా లేకుండా ఇంటి గడప దాటలేదు. భర్త అనుమతి లేకుండా ఇంటి పరదా బయటికి చూడలేదు. కొన్ని ముస్లిం దేశాల్లో ఇలాంటి పరిస్థితే. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో నుంచి తొలి మహిళా న్యాయవాది అయింది జైనబ్ ఫయేజ్.

అఫ్ఘనిస్తాన్ సంస్కృతి సంప్రదాయాల పరదాల చాటున మహిళల హక్కుల్ని కాలరాస్తున్నది. ఎంత నష్టం జరుగుతున్నా.. ఏ ఒక్క మహిళా ముందుకు రాలేకపోతున్నది. తనలాంటి మహిళలకు తోడు నిలువాలంటే తనే ముందడుగు వేయాలనుకున్నది జైనబ్ ఫయేజ్. తొలి మహిళా న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టి మహిళల హక్కుల కోసం పోరాడుతున్నది. అఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్‌కు చెందిన జైనబ్ అక్కడి మొదటి మహిళా న్యాయవాదిగా దేశ చరిత్రలో రికార్డు సృష్టించారు. అంతేకాదు కేవలం మహిళల తరపున 50కి పైగా కేసులు వాదించింది. ఈ రంగంలో మహిళలు రాణించేలా అవగాహన కల్పిస్తున్నది. మహిళల హక్కులు, వారికున్న చట్టాల మీద ప్రత్యేక శ్రద్ధ చూపుతూ మహిళా లోకానికి అండగా నిలబడుతున్నది. శరీయా ఫ్యాకల్టీ ఆఫ్ కాబుల్ యూనివర్సిటీలో న్యాయవాద డిగ్రీ పట్టా పొందిన జైనబ్ ముఖ్యంగా బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, వరకట్నం వేధింపులు, మహిళల హక్కులు, మహిళల విద్య అనే అంశాల మీద కీలకంగా పనిచేస్తున్నది. జైనబ్ చేస్తున్న సేవలకుగానూ అంతర్జాతీయ మహిళా సాహస అవార్డు 2017 లభించింది. ప్రతీరోజు ఇరవై కిలోమీటర్లు ప్రయాణించి ఆఫీస్‌కు చేరుకుంటుంది. సంప్రదాయ ముస్లిం కుటుంబంలో పుట్టి కట్టుబాట్ల సంకెళ్లను తెంపి స్వతంత్రంగా బతుకుతూ కుటుంబ భారాన్ని మోస్తున్నది. అనుకున్న రంగంలో రాణించి విజయం సాధించడమే కాదు.. ఎంతోమంది మహిళల్ని న్యాయవ్యవస్థకు సేవలందించేలా చైతన్యం తీసుకొస్తున్నది.

కాంతివంతమైన చర్మం కోసం..

యవ్వనంలో ఉన్నా కొంత మంది ఏజింగ్ లక్షణాలతో బాధ పడుతుంటారు. జాగ్రత్తలు తీసుకున్నా ప్రయోజనం ఉండదు. అలాంటి వారు ఈ చిట్కాలు ఓసారి ప్రయత్నించండి.



- రోజు కనీసం రెండు లీటర్ల నీటిని తీసుకోవాలి. వాటర్ ద్వారా టాక్సిన్స్ శరీరం నుంచి తొలగిపోతాయి. తర్వాత మొటిమల సమస్య వేధించదు.
- పసుపు, పాలు, రోజ్‌వాటర్ కలిపి ఒక పేస్టులా తయారు చేసుకోవాలి. దాన్ని ముఖానికి పట్టిస్తే కాంతివంతంగా మారుతుంది.
- పడుకునే ముందు ముఖానికి స్లీపింగ్ మాస్క్‌ను ప్రయత్నించండి. ఈ కొత్త పద్ధతితో ముఖం ఉదయాన్నే మెరిసిపోతుంది.

ఈ నొప్పికి ఇంజక్షన్ కారణమా?



అడుగండి చెబుతా

నా వయసు 23 సంవత్సరాలు. ఐదు నెలల క్రితం నాకు పాప పుట్టింది. పాపకు పాలు పడున్నాను. పాప పుట్టినప్పటి నుంచి నడుము నొప్పి విపరీతంగా వస్తున్నది. అంతకు ముందు చాలా చురుకుగా ఉండేదాన్ని. నాకు సిజేరియన్ డెలివరీ ద్వారా ప్రసవం జరిగింది. ఆ సమయంలో మత్తు కోసం నడుము దగ్గర ఇచ్చిన ఇంజక్షన్ వల్ల అని కొంత మంది మిత్రులు అంటున్నారు. నిజంగా నా నొప్పికి అదే కారణమా? నొప్పి తగ్గడానికి తగిన సలహా ఇవ్వండి. రెండో బిడ్డ కోసం మరో రెండేళ్లు సమయం తీసుకోవాలని నిర్ణయించుకున్నాం. దీనికి తగిన పద్ధతులు తెలుపండి?

విశాల, జమ్మికుంట

మీరు మీ పాపకు తల్లిపాలు ఇస్తున్నందుకు అభినందనలు. ప్రసవానంతరం నడుము నొప్పి అనేది సాధరణం. సిజేరియన్ ద్వారానే కాకుండా నార్మల్ డెలివరీఅయిన వారిలో కూడా నడుము నొప్పి వస్తుంది. గర్భం ధరించినపుడు శరీరంలో జరిగే మార్పులు, వెన్నెముక పైన కలిగిన ఒత్తిడి, కాల్షియం లోపం వంటివి దీనికి కారణం. చాలామంది అనుకున్నట్టు నడుము దగ్గర ఇచ్చే ఇంజక్షన్ వల్ల ఈ నొప్పి రాదు. ఇది తగ్గడం కోసం.. కూర్చునే పద్ధతిని సరిచేసుకోవాలి. వీపునకు ఆధారం తీసుకుని కూర్చోవడం మంచిది. పాపకు పాలు పడుతున్నపుడు సరియైన పద్ధతిలో ఎక్కువగా వెన్నెముకను వంచకుండా నిటారుగా కూర్చోవాలి. వీలును బట్టి ప్రతిరోజు 20 నుంచి 30 నిమిషాలు వాకింగ్ చెయ్యడం కూడా చాలా మంచిది. రెండో గర్భానికి 2 సంవత్సరాల ఎడం తీసుకోవడం కూడా చాలా మంచి విషయం. నెలసరి ఇంకా మొదలవక పోతే గర్భం రాదు అనేది అపోహ మాత్రమే. కాబట్టి ముందు నుంచి జాగ్రత్త తీసుకోవడం ఎంతో అవసరం. క్యాలెండర్ పద్ధతి పాటించవచ్చు. సరియైన పద్ధతిలో నిరోధ్ వంటి సాధనాలు ఉపయోగించవచ్చు. కాపర్ టీ వేయించుకుంటే మూడు నుంచి ఐదు సంవత్సరాల వరకు అలాగే ఉండనివ్వవచ్చు. అవసరమనుకుంటే మధ్యలో తీయించేయవచ్చు. పాలు పట్టే సమయంలో వాడుకోవడానికి ప్రత్యేకమైన కాంట్రాసెప్టివ్ పిల్స్ దొరుకుతాయి . మూడు నెలలకొకసారి తీసుకునే ఇంజక్షన్ కూడా దొరుకుతుంది. వీటి గురించి మీ డాక్టర్‌తో చర్చించి మీరు మీకు అనుకూలమైన పద్ధతిని ఎంచుకోండి.



డాక్టర్ జి. వింధ్య
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

నమస్తే తెలంగాణ
విందు
[హైదరాబాద్]
గురువారం 22 ఫిబ్రవరి 2018
హైదరాబాద్
బుధవారం 6 డిసెంబర్ 2017

పోపుల పెట్టె

పల్లీలతో ఆరోగ్యం మెండు!



పల్లీలు తింటే కొవ్వు పెరుగుతుందని అనుకుంటారు. కానీ వాటితో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని తెలుసా? పల్లీలను తినండి.. ఆరోగ్యాన్ని మంచిగా ఉంచుకోండంటున్నారు నిపుణులు.

- గుప్పెడు పల్లీలు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయట. ఎన్నో అనారోగ్య సమస్యలను కూడా దూరం చేస్తాయి.
- బ్లడ్ షుగర్‌ని రెగ్యులేట్ చేస్తాయి పల్లీలు. అలాగే కొలెస్ట్రాల్ కంట్రోల్ అవుతుంది.
- ఒత్తిడిని తగ్గించి, ఆలోచనాశక్తి పెంచేలా చేస్తాయి పల్లీలు.
- జీర్ణశక్తి మెరుగుపడుతుంది. పల్లీలు తినడం వల్ల నాడీ సంబంధ లోపాలను దాదాపు 70 శాతం వరకు తగ్గించవచ్చు.
- పల్లీల్లో ఫోలేట్ శాతం అధికం. కాబట్టి గర్భధారణకు ముందు, ఆ తర్వాత వీటిని తీసుకోవడం వల్ల పుట్టబోయే పాపాయి ఆరోగ్యంగా ఉంటారు.
- పల్లీలు చెడు కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ని పెంచుతాయి. తద్వారా గుండె సమస్యలు కూడా అదుపులో ఉంటాయి.
- వారంలో రెండుసార్లు పల్లీలు తినేవారు బరువు పెరిగే అవకాశం తక్కువట.
- ఇందులో ఉండే ఫైటో స్టెరోల్స్ క్యాన్సర్‌తో పోరాడే లక్షణాలు అధికంగా ఉంటాయి. ఇవి ట్యూమర్ గ్రోత్ నివారిస్తాయి.
- పల్లీల్లో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల దగ్గు, జలుబు కూడా తగ్గుతాయి.

29 రాష్ట్రాలు 29 రుచులు

భారతదేశం భిన్న సంస్కృతుల సంగమం. కేవలం సంస్కృతి, సంప్రదాయాల్లోనే కాక ఆహారపు అలవాట్లలోనూ భిన్నత్వం కనిపిస్తుంది. ఒకే వరుసలో ఉండే మూడు ఇళ్లలో మూడు వేర్వేరు వంటకాలు కనిపిస్తాయి. ప్రతి కిచెన్ దేనికదే ప్రత్యేకతను కలిగి ఉంటుంది. దేశంలోని 29 రాష్ట్రాలు, ఏడు కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రత్యేక వంట శైలులున్నాయి. వాటిలో ప్రాంతీయ వంటకాలు కూడా ఉన్నాయి. అయితే పురాతనమైన సంప్రదాయ వంటకాలు మాత్రం ఒక్కో రాష్ట్రానికి ప్రత్యేకం. భారతదేశపు పురాతన ఆహార వైవిధ్యతతో పాటు 29 రాష్ట్రాల నోరూరించే రుచులతో విందు చేసుకుందాం రండి.





జమ్మూ అండ్ కశ్మీర్
రోగాన్ జోష్, యాకిని హరిష్టా వంటి మాంసపు వంటకాలతో పాటు రుచికరమైన కశ్మీరి భోజనం, వివిధ సువాసనలతో కూడిన పానీయాలతో కలిసిన భోజనం కశ్మీరుకు ప్రత్యేకం.

హిమాచల్ ప్రదేశ్
ఈ భోజనంలో వేడి, స్పైసీ పప్పులు, కూరగాయలు, సిడు (ఇది ఒక రకమైన రొట్టె), మీటా బాట్ (పల్లీలు కలిపిన తీపి అన్నం) ఉంటుంది.

పంజాబ్


విస్తృతమైన శాకాహార, మాంసాహార వంటకాలతో పాటు రిచ్, బట్టీ రుచులు, సర్సన్ కా సాగ్, మక్కి కి రోటీ, తందూరి రోటీ, పీలీ పప్పు, అన్నం, వివిధ మాంసం వంటకాలుంటాయి.



హర్యానా
హర్యానా భోజనంలో ఇంట్లో తయారైన తెల్ల వెన్న, కచ్రి కీ సాబ్జీ, ఖిచిడీ, బజ్రా / బసన్ చపట్టి, ఇంట్లో తయారు చేసిన మజ్జిగ, స్పైసీ పెరుగులు, కడి పాకోర మొదలైనవి ఉంటాయి.

రాజస్థాన్
వీరి విస్తృతమైన భోజనంలో దల్‌బాతి చూర్మా, మిస్సి రోటి, గట్టే కి సాబ్జీ, పంచెమేలా పప్పు, లాల్ మాస్, బజ్రా రోటీ, మజ్జిగ, హల్వా వంటి మధురమైన వంటకాలు ఉంటాయి.

గుజరాత్
ఈ రాష్ట్రంలోని భోజనంలో తీపి, ఉప్పుగా ఉండే వంటకాలు, మేతి, తెప్లా, భక్రీ, కట్టి మీఠీ దాల్ (తీపి, పుల్లని పప్పు), అలూ రసిల, ఆవిరి అన్నం, బాదూషా మొదలైనవి ఉంటాయి.



మధ్యప్రదేశ్
ఇక్కడి భోజనం రుచికరమైన పోహాతో తయారవుతుంది. (సుగంధ ద్రవ్యాలతో వండిన బియ్యం రేకులు), రోగన్ జోష్, సబూదానా ఖిచిడీ, కుర్మా, చిక్ కబాబ్, అచారి గోష్ట్ మొదలైనవి ఉంటాయి. వీరి భోజనం ప్రసిద్ధ భోపాల్ పాన్ తో ముగుస్తుంది.

మహారాష్ట్ర
ఈ రాష్ట్ర భోజనం రుచికరమైన సాధారణ భోజనం. ఆమ్రాస్, కోసింబీర్, భక్రి రోటీ (మిల్లెట్ ఫ్లాట్ బ్రెడ్), పిట్లా (మందపాటి చిక్పా పిండి కూర), అమ్టి (స్పైసీ ఉప్పుగా ఉండే కందిపప్పు), మటన్ కోలాపురి, సబుదాన వడ, ఖీర్, బాసుండి వంటి వంటలుంటాయి.





గోవా
అన్నం, సీఫుడ్, మాంసపు ఆహారం, స్పైసీ గోవా వంటకాలు, సోల్ కడి, అరటి హల్వా, వేయించిన కార్మోలాస్ వంటివి గోవా ఆహార పదార్థాలలో ఉన్నాయి.

కర్నాటక
భోజనం రుచికరమైనదే కాకుండా ఆరోగ్యకరమైనది కూడా. ఇందులో వరి అన్నం, అక్కీ రోటీ, పప్పు, కూరగాయలు, రసం, సాంబార్, వడ, కోసంబరి (సలాడ్), రవ్వ కేసరి (డెజర్ట్), కొబ్బరి వంటలు అమోఘం.





కేరళ
కేరళవారు వంటలను ఎక్కువగా కొబ్బరినూనెతో వండుతారు. అలాగే వడ్డించడం కూడా తీపి పాయసంతో ప్రారంభిస్తారు. ఈ భోజనం సంపూర్ణ సమతుల్య భోజనం. ఇక్కడి ప్రతి వంట కేరళ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉంటుంది.

ఉత్తరప్రదేశ్
ఉత్తర ప్రదేశ్ వంటల్లో శాకాహార, మాంసాహార వంటకాలకు ప్రవేశం ఉంది. వీరి భోజనంలో అనేక వెరైటీలు కనిపిస్తాయి. భర్వాన్ చికెన్ పసండా, మటన్ కోఫ్తా, ఆలూ రసిదార్, కీమ దమ్ నాన్స్, ఇమార్తి, పెడస్, బాదూషా వంటి వంటలు ఎన్నో కనిపిస్తాయి.



అసోం
ఈ రాష్ట్ర భోజనం రుచికరంగా ఉంటుంది. భోజనంలో మాంసాహారం, చేపలు, తాజా కూరగాయలు, ఆలూ పిట్కా, పప్పు, సాగ్ ఉంటుంది.

బీహార్


బీహార్ రాష్ట్ర భోజనంలో కబాబ్, బోటీ, చికెన్ మసాలా, సత్తు పారంత, చోఖ (మెత్తని బంగాళాదుంపలతో చేసి స్పైసీ ఆహారం), చేపల కూర, పోస్టా-డానా కా హాల్వా ఉంటాయి.

అరుణాచల్ ప్రదేశ్


టమోట-ఎర్రమిరపకాయలతో చేసిన పచ్చడి, అన్నం, మాంసం, ఉడికించిన సేంద్రీయ కూరగాయలు, వెన్న, సోయ బీన్స్ వంటి పులియబెట్టిన ఉత్పత్తుల వంటి నోరూరుంచే వంటలు వీరి భోజనంలో కనిపిస్తాయి.

మణిపూర్
మసాలా మిరపకాయతో కూడిన వంట మణిపూర్ ప్రత్యేకత. వీరి భోజనంలో అన్నం, చేపలు, ఆకు కూరలు, టాంగాంగ్ (రొట్టె), బ్లాక్ బియ్యంతో తయారు చేయబడిన ప్రత్యేకమైన చహో ఖీర్ ఉంటుంది.

పశ్చిమ బెంగాల్
చేపలు, కూరగాయలు, బంగాళాదుంపలు, టొర్కరి, డోయి మాచ్, కబాబ్స్, అన్నం, పప్పులు, చోర్ చోరి, సందేశ్ మొదలైనవి బెంగాలీ వంటల్లో కనిపించే ప్రాథమిక పదార్థాలు.



జార్ఖండ్
రాష్ట్ర భోజనంలో నోరూరించే అనేక వెరైటీలు కనిపిస్తాయి. చిల్కా, దుస్కా, కుర్థి దాల్, ఎర్ర బియ్యం, లాల్ సాగ్, దెహటి చికెన్, దుద్ పీతా, సత్తు కా పరాంత, ఘుగ్ని, లిట్టి చోఖ, బాదూషా మొదలైనవి.



ఒడిశా
ఇక్కడి భోజనం సరళమైన, తక్కువ మసాలా, కారం, నూనె కలిగి ఉండి సున్నితమైన రుచి కలిగి ఉంటుంది. ఒడియా వంటకంలో బియ్యం, చేపలు, మత్స్య ఉత్పత్తులతో కూడి ఉంటుంది.

నాగాలాండ్
నాగా భోజనం.. కూరగాయలతో కూడిన ట్రిమ్స్, మిరపకాయలు, వివిధ రకాల మాంసం, చేపలు, వాసనతో కూడిన, ఎండిన లేదా పులియబెట్టిన ఆహారపదార్థాలు.

ఛత్తీస్‌గఢ్
ఈ రాష్ట్ర భోజనంలో రాకియా బాడీ, పెథాలు, రైస్ పకోడీలు, బాఫోరీ, ఉడికించిన అన్నం, ఫారా (వండి మిగిలిపోయిన అన్నంతో తయారు చేసిన బంతులు) ముఖ్యమైనవి.



సిక్కిం
సిక్కిం రాష్ట్ర భోజనం ఆవిరి, వేయించిన ఆరోగ్యకరమైన వంటకాల మిశ్రమం. దాల్ భట్ (ఉడికించిన బియ్యం, పప్పు పులుసు), తుక్పా (నూడిల్ ఆధారిత సూప్), మమోస్, ఫాగ్‌స్పాపా మొదలైనవి.

మేఘాలయ
మేఘాలయ వేర్వేరు తెగలతో కూడిన ప్రాంతం. అందువల్ల ఇక్కడి భోజనంలో కూడా చాలా రకాలు కనిపిస్తాయి. అయితే సాధారణంగా అందరూ తీసుకునే భోజనంలో అన్నం, స్పైసీ మాంసం, చేపలతో కూడిన పదార్థాలు, ఆవిరితో వండిన మమోస్, కూరగాయలు, పిక్లిడ్ వెదురు రెమ్మలు మొదలైనవి.

తెలంగాణ
తెలంగాణ ప్రత్యేక రుచుల సమ్మేళనం. ఇక్కడి భోజనంలో బచ్చలికూర (చింతపండు వేసి వండుతారు), పచ్చిపులుసు(చింతపండు రసం) నాన్‌వెజ్ వంటకాల్లో చికెన్, మటన్ కూరలు, నాటు కోడి పులుసు, వేపుళ్లు వంటివి సర్వసాధారణంగా ఉంటాయి.



ఆంధ్రప్రదేశ్
ఆంధ్ర భోజనం రుచితో పాటు సువాసనను కలిగి ఉంటుంది. వీరి ఆహారంలో ఎర్ర మిరపకాయల కారం వినియోగం అధికం. ఇక సాధారణంగా ఉండే భోజనంలో అన్నం, రసం, పచ్చడి, వడ, పెరుగు, పప్పు, వివిధ రకాల కూరలు తప్పకుండా ఉంటాయి.

మిజోరం
మిజోరం భోజనంలో ఆవిరి బియ్యంతో వండిన అన్నం, మాసంతో కూడిన ఉడికించిన కూరగాయలు, బచ్చలికూర, వెదురు షూట్, మూలికలు, కోట్ పీత (బియ్యం పిండి, అరటి తో వేయించిన ఫ్రిట్టర్లు), తీపి డిష్ మిసా, మాష్‌పూర ప్రత్యేకం.

తమిళ నాడు
స్పైసీ నుంచి తీపి వరకు పలు రకాల రుచులతో కూడిన ఆహారం తమిళనాడు ప్రత్యేకం. వీరి వంటలో ప్రత్యేకమైనది సాంబారు, అలాగే రసం, సాదా అన్నం, పెరుగు, బాదం పాయసం, పోరియల్ (కర్రీ), కూటు మొదలైనవి కలిగి ఉన్న రుచుల సమ్మేళనం.



త్రిపుర
వేయించిన వంకాయ, బెర్మా, కొద్దిగా నూనెలో వేయించిన ఎండు చేపలు, టమోటా చట్నీ, కాయధాన్యాలు, బియ్యం, ముయ (వెదురుతో తయారైన), స్థానిక చేపలు, కూరగాయలు, మూలికలు ప్రధానమైనవి.

ఉత్తరాఖండ్
ఉత్తరాఖండ్ భోజనంలో ఆలూ దాల్ పకోరా, టిల్ కి చట్నీ (కొత్తిమీర, నువ్వుల విత్తనాలతో చేసినది), గహత్ కా షోర్బా, కప్పా, ఫాను, జోలీ (పెరుగు,చిక్‌పీ పిండి కూర), మీఠా బాత్, చోల్ రోటీ, లెసు, డెజర్ట్, రాట్‌లతో కూడిన రుచికరమైన భోజనం.



వృద్ధాప్యంలో సమతుల్య ఆహారం

50 ఏండ్ల నుంచి వృద్ధాప్యంలోకి అడుగుపెడుతున్న వారు క్రమం తప్పకుండ సమతుల్య ఆహారం తీసుకోవాలి. లేకపోతే ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. వయసుకు తగ్గట్లుగా ఎత్తు, బరువు ఉండాలి. బరువు పెరిగితే మలివయసులో గుండెజబ్బులు, టైప్-2 మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువ. వృద్ధాప్యంలో రోగాలు రాకుండా ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెసుకుందాం.



డాక్టర్
మయూరి ఆవుల
న్యూట్రిషియనిస్ట్
mayuri.trudiet
@gmail.com

- పెద్దలు వయసు తగినట్టుగా ఎత్తు, బరువును మెయింటెన్ చేయాలి.
- వారంతో రెండు రోజులు కండరాలను కదిలించే ఏదైనా పని చేస్తుండాలి.
- శరీరం ఆధారంగా కేలరీల స్థాయి పెరుగుతూ, తగ్గుతూ ఉంటుంది. అందుకే కచ్చితంగా బరువు తగ్గించుకునే మార్గాలు అన్వేషించాలి.
- ఆరోగ్యకరమైన శరీర బరువును మెయింటెన్ చేయడానికి మహిళలకు 1,600 నుంచి 2,400 కేలరీలు అవసరమవుతాయి.
- పురుషులకు రోజుకు 2,000 నుంచి 3,000 కేలరీలు అవసరం.
- మనిషి శరీరంలో ప్రతీచర్యకు ప్రోటీన్ అవసరం. కండరాల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, ఆరోగ్యవంతమైన జుట్టు, చర్మం, గోర్ల కోసం ప్రోటీన్ ఉన్న ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలి.
- ప్రోటీన్ అధికంగా ఉండే గుడ్లు, చికెన్, మాంసం, సోయా ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు, శనగలు, తృణధాన్యాలు, చిక్కుళ్లను రోజువారీ ఆహారంలో తీసుకోవాలి.
- పిండి పదార్థాలు ఉండే ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు.
- శరీరంలో కార్బోహైడ్రేడ్ల శక్తిని పెంచేందుకు పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఫైబర్ అధికంగా ఉండే పదార్థాలు, పెరుగు, పాలు, కొవ్వు ఉత్పత్తులు తీసుకోవాలి.
- వేరుశనగనూనె, చేపలనూనె, అవకాడోలు గుండెకు మేలు చేసే మంచి కొవ్వును వృద్ధి చేస్తాయి.
- ఇలా క్రమం తప్పకుండా సమతుల్య ఆహారం అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటూ ఎక్కువ కాలం బతికే అవకాశం ఉంటుంది.

సుడోకు

డైలీ సుడోకు 134 సమాధానం

7	9	2	1	8	4	3	6	5
8	4	1	6	3	5	7	9	2
3	5	6	7	2	9	8	1	4
5	1	3	2	4	6	9	7	8
4	6	9	8	1	7	5	2	3
2	7	8	5	9	3	1	4	6
6	8	5	9	7	2	4	3	1
9	2	4	3	5	1	6	8	7
1	3	7	4	6	8	2	5	9

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -135

			2		9		5	
	6			1				
		2	6			9		3
		3						9
		5	1		7	8		
7						2		
4		9			6	1		
				3			9	
	1		7		8			

ట్వీట్



హాయ్ ఫ్రెండ్స్.. నా ట్విట్టర్ ఖాతా హ్యాక్ చేయబడినది. నా అకౌంట్ నుంచి వచ్చిన ఏ లింక్‌ను తెరువకండి. ట్విట్టర్ ఇండియా సహకారంతో నా అకౌంట్ వెరిఫికేషన్ అయింది. ఎవరైనా ఇబ్బందిపడితే క్షమించండి.

మనోజ్ తివారి
@tiwarymanoj

మనోజ్ తివారిని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
2,316,027

కామన్‌మ్యాన్ వాయిస్

పాదయాత్ర చేసినోళ్లంతా ముఖ్యమంత్రి అవుతారన్నది సమైఖ్య రాష్ట్రంలో.. ఇప్పుడు నడుస్తున్నది కేసీఆర్ యుగం. పార్లు దండాలు పెట్టినా పాకులాడాల్సింది డిపాజిట్ల కోసమే.
–Satya Prasad Peddapelli

ప్రత్యేక హోదా మినహా ఇతర డిమాండ్లన్నిటినీ మార్చి 5వ తేదీలోగా కేంద్రం ఆమోదించబోతున్నట్టు కలవచ్చింది. ఇది పగటి కల అని తేలిగ్గా తోసిపుచ్చవద్దు.
–Naveen Rjy

ఎంత వేగంగా వెళ్తున్నామన్నది కాదు. ఏ దిశలో వెళ్తున్నామన్నది ముఖ్యం.
–Azzu Azharuddin

వైరల్ వీడియో



చికెన్, మటన్‌లతో పాటు కుక్క, పిల్లి బిర్యానీల వార్తలు విని ఉంటారు. మరి కాకి బిర్యానీ గురించి విన్నారా? అవును. కాకి బిర్యానీ ప్లేట్ ఐదు రూపాయలు మాత్రమే. కాకి బిర్యానీ గురించి తెలియాలంటే ఈ వీడియో చూడండి.

Kauwa Biryani || Run Movie Spoof || Full Entertainment Video
Total views : 5,683,794+
Published on Feb 18, 2018

నమస్తే తెలంగాణ
రైతుబడి
హైదరాబాద్
గురువారం 22 ఫిబ్రవరి 2018

కాండంకుళ్లు తెగులు-నివారణ



గత రెండుమూడేండ్ల నుంచి యాసంగి వరిలో కాండం కుళ్ళు ఉధృతి చాలాచోట్ల పెరుగుతున్నది. ముఖ్యంగా నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, భూపాలపల్లి, నిజామాబాద్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, సూర్యాపేట ఈ తెగులు వల్ల యాసంగి వరిలో దిగుబడులు తగ్గుతున్నాయి. దీనికి ప్రధాన కారణం యాసంగిలో కాలంలో పొడి వాతావరణం ఉండటం, కొన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి పరిస్థితులు, మురుగు నీరు పోనటువంటి పొలాల్లో కాండం కుళ్ళు తెగులు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. ఈ తెగులు స్క్లీరోషియమ్ ఒరైజే అనే శిలీంధ్రం వల్ల కలుగుతుంది. ఈ తెగులు పిలకలు వేసే దశలో ప్రారంభమై పూత దశ వర కు నష్టం కలుగజేస్తుంది.

తెగులు లక్షణాలు: తొలి దశలో నీటి మట్టం దగ్గరున్న మొక్కల కాండం పై సన్నని చారలతో కూడిన మచ్చలు ఏర్పడి క్రమేణ, లోపలి కణజాలంలోకి విస్తరించడం, ఆకులు వడలిపోయి పసుపు రంగులోకి మారి పిలుకలు చనిపోతాయి. అంకురం ఏర్పడే దశ నుంచి గింజలు పాలు పోసుకునే దశలో ఆశించినట్లైతే పిలుకల కాండం కుళ్ళిపోయి బలహీనపడి విరిగిపోతాయి. ఈ దశలో కాండం లోపలి కణజాలం చీల్చి చూస్తే శిలీంధ్రపు పెరుగుదలతో బాటు నల్లని రంగులో ఉన్న స్క్లీరోషియాలు కణజాలంతో మిళితమై ఉంటాయి. ఈ దశలో తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే తాలు గింజలు ఎక్కువగా ఏర్పడుతాయి.

తెగులు వ్యాప్తి: తెగులుకు సంబంధించిన సిద్దబీజాలు స్క్లీరోషియా రూపంలో నేలల పైపొరల్లో, వరి మోడుల్లో, గడ్డిలో జీవిస్తూ నేల ద్వారా, నీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది.

అనుకూల పరిస్థితులు: 1. సుప్తావస్థ దశలోనున్న సిద్దబీజాలు నేలలో, పంట అవశేషాల్లో ఉండి చాలాకాలం వరకు జీవించడం ప్రధాన కారణం. 2. వరిలో కాండం తొలిచే పురుగు, ఇతర కీటకాల వల్ల ఏర్పడిన గాయలు ఈ తెగులువ్యాప్తికి చాలా అనుకూలం. 3. అధిక మోతాదులో నత్రజని వాడటం, పొటాష్ ఎరువులు వినియోగించక పోవటం. 4.యాసంగిలో నీటిఎద్దడి ఏర్పడటం.

నివారణ:

- ప్రధాన పొలాన్ని లోతుగా దున్ని పంట అవశేషాల్లో, నేలలోనున్న సిద్ధబీజాలను నశింపజేయాలి. వీలైన చోట్ల పంట మోడులను, అవశేషాలను తగులబెట్టాలి.
- పైపాటుగా నత్రజని ఎరువులతో పాటు ఎకరానికి 15-20 కిలోలు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున దమ్ములో, అంకురం తొడిగే దశలో వేసినట్లైతే మొక్కలలో రోగ నిరోధకశక్తిని పెంపొందించవచ్చు.
- పిలక దశల్లో, అంకురం దశలో తెగులు లక్షణాలు గుర్తించిన వెంటనే థయోఫానేట్ మిథైల్ 1.0గ్రా/లీ. లేదా కార్బండిజమ్ 1.0 గ్రా/లీ. లేదా వాలిడామైసిన్ 2. మి.లీ/లీ. నీటిలో కలుపుకొని 10 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారీ చేయాలి. దీని ఉధృతి మరీ ఎక్కువగా ఉన్నప్పుడు ముఖ్యంగా అంకురం నుంచి గింజ ఏర్పడే దశలో టెబుకొనజోల్ 1.0 మి.లీ/లీ. లేదా అజోక్సిస్ట్రోబిన్ 1.0 మి.లీ/లీ. నీటిలో కలుపుకొని ఒకసారి పిచికారీ చేయాలి.
- శిలీంధ్ర నాశకాలు పిచికారీ చేసేటప్పుడు పొలంలో నీరు నిల్వకుండా జాగ్రత్త వహిస్తూ మొక్కల మొదళ్ళను పూర్తిగా తడుపాలి.



డాక్టర్ ఆర్. జగదీశ్వర్
ప్రధాన శాస్త్రవేత్త (వరి) వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్
8179540261

పురుగుల నివారణకు
ప్రకృతి మందులే మేలు

రైతులు సాగు చేస్తున్న పంటల్లో అధిక దిగుబడులను పొందేందుకు అవసరానికి మించిన క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువులను విపరీతంగా వాడుతున్నారు. వీటితో వాతావరణ కాలుష్యం ఏర్పడి జీవవైవిధ్యం దెబ్బతింటున్నది. అలాగే పంటలకు హాని చేసే పురుగులకు తోడు రైతులకు మేలు చేసే పురుగులు సైతం చనిపోతున్నాయి. వీటితోపాటు ఆహార ధాన్యాల, పండ్లతోటల, కూరగాయల సాగులో పురుగు మందుల వాడకం వల్ల వాటి అవశేషాలు దిగుబడుల్లో మిగిలిపోయి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. అందుకే రసాయనిక ఎరువులకు బదులుగా పంటలపై వృక్షసంబంధిత పదార్థాలను ఒక దానితో మరొకటి కలిపి పిచికారీ చేస్తే నాణ్యమైన దిగుబడులను పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. పంటమొక్కలను ఆశించే పలు రకాల చీడ, పీడలను నివారించడానికి ప్రాకృతిక ఉత్పత్తులు వాటితో పంటల రక్షణకు పిచికారీ చేసే పదార్థాల తయారీ గురించి వారు వివరించారు.

వేపకషాయం: అన్నిరకాల పంటలకు నష్టం కలిగించే పురుగులను వేప కషాయం పిచికారీ చేయడం వల్ల వాటిలో ఉన్న చురుకుదనం సన్నగిల్లి పురుగులు చనిపోతాయి.

తయారీ విధానం: ఎండాకాలంలో రాలిన వేపపండ్లను సేకరించి నీడలో ఆరబెట్టాలి. తర్వాత అరగంట సేపు నీటిలో నానబెట్టి పిసికి గుజ్జు, గింజలను వేరు చేయాలి. గింజలను నీడలోనే ఆరబెట్టాలి. పది కిలోల ఆరిన వేపగింజలను రోలులో వేసి దంచాలి. దంచడం ఫలితంగా వచ్చిన పొడిని పలుచని గుడ్డలో మూటకట్టి వంద లీటర్ల నీరు పోసిన తొట్టిలో గానీ, బకెట్‌లో గానీ ఐదు లేదా ఆరుగంటలు నానబెట్టాలి. ఆ తర్వాత మూటను బాగా పిసికి ద్రావణం తీయాలి. ఈ ద్రావణాన్ని పలుచని శుభ్రమైన గుడ్డతో వడబోయాలి. దానికి వంద గ్రాముల సర్ఫ్ పౌడర్‌ను కలుపాలి. ఈ విధంగా తయారుచేసిన ద్రావణాన్ని చేతి పంపులో పోసి సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి. దీంతో ఇది సమర్థవంతంగా పనిచేసి పంటలను వివిధ రకాల పురుగులను నివారిస్తుంది.





మిరప- వెల్లుల్లి ద్రావణం: రసం పీల్చే పురుగులను నివారించేందుకు మిరప, వెల్లుల్లి ద్రావణం సమర్థవంతంగా పనిచేస్తుంది.

తయారీ విధానం: మూడు కిలోల పచ్చిమిరప కాయలను తీసుకుని తొడిమెలు తీసి బాగా రుబ్బాలి. రుబ్బిన మిరపకాయల ముద్దను పది లీటర్ల నీటిలో రాత్రంతా నానబెట్టాలి. అలాగే అర కిలో వెల్లుల్లి తీసుకుని బాగా రుబ్బి అర లీటర్ కిరోసిన్‌లో నానబెట్టాలి. మరుసటిరోజు రెండు ద్రావణాలను గుడ్డ ద్వారా వడగట్టాలి. తర్వాత వంద గ్రాముల సర్ఫ్‌పొడిని ద్రావణాలలో కలుపాలి. ఈ విధంగా కల్పిన ద్రావణాన్ని మూడుగంటల పాటు ఉంచాలి. అనంతరం మిశ్రమాన్ని వడకట్టి వంద లీటర్ల ద్రావణం అయ్యేటట్టుగా తగు నీరు కలిపి సాయంత్రం వేళల్లో పంటలపై పిచికారీ చేసి రసం పీల్చే పురుగులు (పేనుబంక, తెల్లదోమ, పచ్చదోమ, పచ్చదోమ, తామర పురుగులు) నివారించకోవచ్చు.



పశువుల మూత్రం: పేడ సారం (జీవామృతం)- పశువుల మూత్రం, పేడసారంలను మొక్కలపై పిచికారీ చేయాలి. దీనివల్ల శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు, తేనే మంచు పురుగులు మొక్కలను ఆశించకుండా నివారించవచ్చు.

తయారీ విధానం: పది కిలోల పశువుల పేడ, పది లీటర్ల పశువుల మూత్రాలను సేకరించాలి. మట్టికుండలో వంద లీటర్ల నీటిని తీసుకుని సేకరించిన పశువుల పేడ, మూత్రములను నీటిలో కలిపి మూతపెట్టాలి. ఈ మిశ్రమాన్ని నాలుగురోజుల పాటు అలాగే ఉంచి పులియబెట్టాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని వడబోసి వంద గ్రాముల సున్నం కలిపిన తర్వాత వంద లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. దీని ప్రభావం వల్ల శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగులు పంటలపై దాడి చేయలేవు.

నట్టె కోటేశ్వర్‌రావు, గరిడేపల్లి, 9989944945

ఈ ఉత్పత్తులకు మంచి డిమాండ్



ఎక్కువ దిగుబడులను పొందాలన్న ఆశతో రైతులు సాగుచేసుకు న్న పంటలపై ఇష్టం వచ్చిన రీతి లో రసాయన ఎరువులను పిచికారీ చేస్తున్నారు. దీనివల్ల వాటి అవశేషాలు పంటల దిగుబడు ల్లో మిగిలిపోయి ఆరోగ్యం పై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. కాబట్టి రైతులు పంటలలో రసాయనిక ఎరువులకు బదులుగా అన్నిరకాల చీడ, పీడలను నివారించడానికి వృక్ష సంబంధిత పదార్థాలను పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల వచ్చే దిగుబడుల్లో ఏ విధమైన హానికరమైన అవశేషాలు ఉండవు. వాటి ఉపయోగం చాలా ఆరోగ్యకరం. ఇలాంటి ఉత్పత్తులకు మార్కెట్‌లో కూడా మంచి రేటు పలుకుతున్నాయి. దీనివల్ల రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు.

టి.యాదగిరిరెడ్డి, కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి, 9440481279



సిరులు కురిపిస్తున్న
పందిరి సాగు



సాధారణ పంటలు సాగు చేసి నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తున్నది. ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు కూలీలకు పనులకు కల్పిస్తున్నది. దీంతోపాటు అధికారులు కొత్తరకం పంటలు రైతులు సాగు చేయడానికి ఆసక్తి చూపేలా చేస్తున్నారు. ఇవి రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. దీంతోపాటు ఉపాధిహామీతో కూలీలకు పందిరి కూరగాయల సాగు వల్ల చేతి నిండా పని కల్పిస్తున్నారు. ఆ వివరాలు..

కూరగాయాల సాగును ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతం రాయితీ కల్పిస్తున్నది. ఉపాధి హామీ పథకంలో పందిరి కూరగాయల సాగును చేపట్టవచ్చు. చిన్న, సన్నకారు రైతుల్లో ముందుకు వచ్చిన వారికి గుంతలు తవ్వడంతో మొదలు, స్తంభాలు పాతడం,తీగలతో పందిరి అల్లడం వంటి పనులన్నీ ఉపాధి హామీ కూలీలతో చేయిస్తున్నారు. దీంతో మండలంలోని పలు గ్రామాల రైతులు పందిరి కూరగాయాల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పందిళ్లపై తీగజాతీ కూరగాయాల సాగు తో పాటు అంతర పంటలుగా వివిధ రకాల కూరగాయా లు పండించుకునే అవకాశం ఉన్నది. దీంతో రైతులు పందిరి కూరగాయల సాగుకు ముందుకు వస్తున్నారు. మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన దాది లక్ష్మి అనే మహిళా రైతుకు ఉపాధిహామీలో యూనిట్ మంజూరు అయ్యింది. పందిరి కూరగాయాలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. దీంతో మండలంలోని గర్శకుర్తిలో ఇద్దరు, గట్టుభూత్కూర్‌లో నలుగురు, సర్వారెడ్డిపల్లి గ్రామాల్లో ఇద్దరు రైతులు పందిరి కూరగాయాల సాగు చేయడానికి ముందుకు వచ్చినట్లు ఈజీఎస్ అధికారులు తెలిపారు.

ఈ సాగుకు అర్హతలు

ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులై ఉండి, స్వశక్తి సంఘం సభ్యులుగా ఉండి, ఉపాధి హామీలో జాబ్‌కార్డు కలిగి ఉండటంతో పాటు,ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు కూలీ పనిచేసి ఉండాలి. మహిళా సంఘంలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లు ఐకేపీ నుంచి నోడ్యూ ధృవీకరణ పత్రం సమర్పించాలి.సాటునీటి సదుపాయం కలిగి ఉండాలి. పట్టాదారు పాసుపుస్తకంతో పాటు, ఆధార్‌కార్డు, సన్నకారు రైతుగా స్థానిక వీఆర్వో ద్వారా ధృవీకరణ పత్రంతో పాటు సాగుకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్న వారు ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడిని కానీ,



ఉపాధిహామీ కార్యాలయలంలో గానీ సంప్రదించాలి. పందిరి కూరగాయల సాగుకు మొత్తం యూనిట్ విలువ లక్షా 12 వేలు. కాగా అర్హులైన రైతులకు యూనిట్ మంజూరు కాగానే ఉపాధి హామీలు భాగంగా కూలీలతో రైతు చెందిన 20 గుంటల భూమిలో 100 గుంతలు తవ్విస్తారు. ఇందుకుగాను ఉపాధి హామీ నిధులు వెచ్చిస్తారు. పందిరి ఏర్పాటు చేయడానికి అవసరమైన 100 స్తంభాల్లో 13 ఈజీఎస్ నుంచి, 62 ఐకేపీ సెర్ప్ నుంచి అందజేస్తున్నారు. మరో 25 రైతు కొనుగోలు చేసుకోవాలి. స్తంభం ఒకటికి విలువ రూ. 370. ఈజీఎస్ నుంచి 4810, ఐకేపీ సెర్ప్ నుంచి 22940 మంజూరు చేస్తుండగా 9250 రూపాయలు రైతు భరించుకోవాలి. పందిరి వేయడానికి అవసరమైన తీగ కొనుగోలు చేయడానికి ఉపాధిహామీ నిధులు 5400, రవాణాఖర్చు వెయ్యి రూపాయలు మంజూరు చేస్తారు.

కష్ట పడితే ఫలితం

ఈజీఎస్ పథకంలో పందిరి కూరగాయాల సాగు గురించి తెలుసుకున్నా. మా ఊరిలోని క్షేత్ర సహాయకుడి ద్వారా పందిరి కూరగాయాల సాగు కోసం దరఖాస్తు చేసుకున్నా. అధికారులు వచ్చి మా భూమిని చూసి మంజూరు ఇచ్చిండ్రు. నా భర్త మోహన్ సహకారంతో 30 గుంటల్లో పందిర్లు వేసి కాకర,బీర,పొట్లకాయలను పండిస్తున్నాను. అంతర పంటలుగా టమాటా, గోరు చిక్కుడు, వంకాయ, ఆకుకూరలను వేసినం. ప్రతిరోజూ కూరగాయాలు తెంపి మా ఊళ్లనే అమ్ముతున్న. రోజుకు 500- 600 రూపాయల వరకు గిట్టుబాటు అవుతున్నది. గర్శకుర్తి పెద్ద ఊరు. తాజా కూరగాయాలు కావడంతో ఇక్కడే కూరగాయాలన్నీ అమ్ముడుపోతున్నయి. కష్ట పడితే పందిరి కూరగాయల సాగుకు మించింది లేదు.

– దాది లక్ష్మి, మహిళా రైతు

రైతులు ఆసక్తి చూపుతున్నారు



ఉపాధిహామీ పథకంలో భాగంగా 80 శాతం సబ్సిడీతో కేంద్ర ప్రభుత్వం చిన్న, సన్నకారులు రైతులకు పందిరి కూరగాయల సాగు యూనిట్లు మంజూరు చేస్తున్న ది. పందిరి కూరగాయాల సాగుకు మండలంలోని రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే గర్శకుర్తికి చెందిన దాది లక్ష్మి పందిరి కూరగాయలు సాగు చేస్తున్నారు. మండలంలో రైతులు అక్కడికి వెళ్లి సందర్శిస్తున్నారు. వాళ్ల భూముల్లో సైతం సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.సబ్సిడీతో యూనిట్లు మంజూరు చేస్తున్నాం. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు పందిరి కూరగాయాలు సాగు చేయడానికి దరఖాస్తు చేసుకున్నారు.మండలంలోని అన్నిగ్రామాల్లో పందిరి కూరగాయాల సాగును గురించి తెలియజేసి రైతులు ముందుకు వచ్చేలా చేస్తున్నాం.

- శ్రీలక్ష్మి, ఏపీవో, గంగాధర

జిల్లా కలెక్టర్ అభినందన

మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన మహిళా రైతు దాది లక్ష్మి పందిరి కూరగాయల పంటను సాగు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ సందర్శించారు. పందిరి కూరగాయాల సాగును గురించి మహిళా రైతును వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాగుకు మందుకు వచ్చి లాభాలు గడిస్తున్న లక్ష్మిని కలెక్టర్ అభినందించారు. జిల్లాలోని రైతులు సైతం లక్ష్మిని ఆదర్శంగా తీసుకొని పందిరి కూరగాయాలు సాగు చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

- బేతి గంగాధర్, గంగాధర రూరల్, 9959021021

పాలీహౌజ్‌లో
పూల సాగు బాగు

ఏ శుభకార్యాలకైనా అలంకరణ కోసం పూలు తప్పనిసరి. ఈ నేపథ్యంలోనే పూలసాగు లాభాల బాట పడుతున్నది. ప్రభుత్వం అందించే రాయితీతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాలీహౌజ్‌లో చామంతి పూల సాగు చేసిన రైతన్నలు లాభాల బాట పడుతున్నారు. సంవత్సరంలో సులువుగా మూడు పంటలు తీసుకోవచ్చు, చామాంతి పూల సాగు పెట్టుబడి మిగిలిన పూలసాగుతో పోల్చితే తక్కువగా ఉంటుంది. ఈ పంటను సాగు చేస్తున్న రైతులు మంచి ఫలితాలు పొందుతున్నారు.



మొక్కలు ఎప్పుడు నాటుకోవాలి

మార్కెట్‌లో మంచి గిరాకి ఉండే సమయానికి కోతకు వచ్చే విధంగా నాటుకోవాలి. మొక్క నాటిన తరువాత 90-110 రోజుల్లో పూలు కోతకు వస్తాయి. వచ్చిన 20-25 రోజుల్లో పూల కోతలు పూర్తవుతుంది. రైతులు ఒక ఎకరం పాలీహౌజ్‌లో 40 వేల మొక్కలు నాటుతున్నారు. మొక్కలన్నీ ఒకేసారి పూసి, కోతకు వస్తే, పూల కోత కష్టమవుతుంది, మార్కెట్‌లో మంచి ధర పలుకదు. కాబట్టి పాలీహౌజ్‌లో సగ భాగం ఒక్కసారి, 15-20 రోజుల వ్యవధిలో రెండో భాగం నాటుకొన్నట్లయితే ఎక్కవ కాలం పూలు కోతకు వచ్చి మంచి ధర వస్తుంది.

లైటెనింగ్, డార్కెనింగ్ ప్రక్రియ :

చామంతి తక్కువ సమయం పగలు, ఎక్కువ సమయం రాత్రి ఉన్నటువంటి వాతావరణం పరిస్థితుల్లో బాగా పెరిగి అనుకున్న సమయంలో పూతకు వస్తుంది. మొక్క నాటిన తర్వాత అన్నిరకాలు శాఖీయంగా 45సెం.మీ ఎత్తు 30-45 రోజుల్లో పెరుగాలి. శాఖీయంగా తొందరగా, ఆరోగ్యంగా పెరుగడానికి రోజుకు



3-5 గంటలు ఎక్కువ సమయం లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలి. అంటే ప్రతిరోజు రాత్రి అయిన తర్వాత రెండు గంటలు లైట్లు వేసి ఉంచి, తర్వాత గంట చీకటి చేయాలి(లైట్లు ఆర్పివేయాలి) గంట తర్వతా మళ్లీ లైట్లు వేసి రెండు గంట వెలుతురు చేసినట్లుయితే నాణ్యమైన పెరుగుదల కనిపిస్తుంది.
చామంతి మొక్కలు మంచి ఎత్తు వచ్చిన తర్వాత మాత్రమే, తక్కువ సమయం పగలు, ఎక్కువ సమయం రాత్రి ఉండి చీకటి ఉండేటట్లుగా ఏర్పాట్లు చేస్తే శాఖీయంగా పెరిగిన మొక్కలు, పూమొగ్గలను ఏర్పర్చుకుంటాయి. దీనికిగాను బెడ్స్‌పైన ఉన్న మొక్కలకు మీటరు ఎత్తులో జి.ఐ వైర్లతో పందిరి వేసి నల్లటి మందమైన పాలీఫిల్మ్ కప్పి ఉంచాలి. ఈ విధంగా 3-5గంటలు డార్కెనింగ్ ఏర్పాటు చేసుకోవాలి.
ఎటువంటి పరిస్థితుల్లోనూ ఉదయం 6 గంటల నుంచి 10గంటల వరకు బ్లాక్‌ఫిల్మ్‌తో మొక్కలను కవర్ చేయవద్దు. ఎందుకంటే ఆ సమయంలో మొక్కలు ఎక్కువగా ఆహారం తయారు చేసుకుంటాయి. ఒక వేల కవర్ చేస్తే కొమ్మలు బలహీనంగా ఉండి, పూమొగ్గలు సరిగా అభివృద్ధి చెందవు.

పూల కోత

చామంతి నాటిన 100-110 రోజుల్లో కోతకు వస్తాయి. పూసిన తర్వాత పొడవాటి కాడలతో కత్తిరించి, 10 కాడలను ఒక బంచ్‌గా కట్టి మార్కెట్‌కు పంపవచ్చు. వీటి నాణ్యత తగ్గకుండా ఉండాలంటే లీటరు నీటికి 5గ్రా. పంచదార + 1/2గ్రా. కార్బండిజం శిలింధ్రనాశికి కలిపిన ద్రావణంలో కాగడాలను ఉంచాలి.

- గుండెల రాజు
మహబూబాబాద్ అగ్రికల్చర్
72889 85757

మంచి ఆదాయం వచ్చింది



ఎంటెక్ పూర్తి చేసి, తల్లిదండ్రులకు ఆసరాగా గ్రామంలోనే ఉంటూ వ్యవసాయం చేస్తున్నాను. ప్రభుత్వం ఇస్తున్న 95 శాతం రాయితీపై ఎకరం భూమిలో గ్రీన్‌హౌజ్ నిర్మించుకుని చామంతి సాగు చేశాను. అందులో నాలుగు దఫాలుగా 40 వేల చొప్పున 1.60లక్షల మొత్తం మొక్కలు నాటాం. బంచ్ ధర రూ.100 నుంచి రూ.140 చొప్పున ఏడాదికి రూ. 4.80 లక్షలు ఖర్చులు పోను మొత్తం రూ.10 లక్షలు పైగా ఆదాయం వచ్చింది. పాలీహౌజ్‌తో అన్నిసీజన్‌లో పంట సాగు చేస్తున్నాం.

- గుగులోత్ రమేశ్, రైతు
97045 97385

అధిక లాభాలు



రాష్ట్రంలో పంటలు పండించడానికి అనువైన భూమి, తగినంత నీరు, అనుకూల వాతావరణం ఉన్న ప్రదేశాలు రోజురోజుకు తగ్గుతున్నాయి. ప్రస్తుతం లభ్యమయ్యే రకాలు తట్టుకోకపోవటం వల్ల దిగుబడులు బాగా తగ్గతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఔత్సాహిక రైతు పాలీహౌజ్, షెడ్‌నెట్‌లతో సంవత్సర పొడవునా పూల తోటలతో పాటు కూరగాయలు సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. దీంతో ఏడాది పొడవునా పూల సాగు చేసుకుని అధిక లాభాలు పొందే అవకాశం ఉన్నది.

- కె. సూర్యనారాయణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, మహబూబాబాద్
83744 49066, టోల్ ఫ్రీ నెంబర్: 18004250519


కాజల్ అగర్వాల్

గ..ఘూ..మేఘూ...


నితిన్, మేఘూ ఆకాష్

నితిన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. కృష్ణచైతన్య దర్శకుడు. మేఘూ ఆకాష్ కథానాయిక. శ్రేష్ఠ్ మూవీస్, పవన్‌కల్యాణ్ క్రియేటీవ్ వర్క్స్ పతాకంపై ఎన్. సుధాకర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కథ అందిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్ర టీజర్‌ను హీరో పవన్‌కల్యాణ్ ట్విట్టర్ వేదికగా విడుదల చేసిన విషయం తెలిసిందే. 'వర్షాకాలంలో కలుసుకుని సీతా కాలంలో ప్రేమించుకుని వేసవి కాలంలో విడిపోయాం' అంటూ హీరో నితిన్ డైలాగ్‌తో విడుదలైన ఈ టీజర్ విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. నితిన్ నటిస్తున్న 25వ చిత్రం కావడంతో ఆ అంచనాలు మరింత పెరిగాయి. ఆ క్రేజ్‌కు ఏ మాత్రం తీసిపోని స్థాయిలో సినిమా వుంటుందని, నితిన్ కెరీర్‌లో మరో భారీ హిట్ చిత్రంగా ఈ సినిమా నిలుస్తుందని చిత్ర బృందం చెబుతున్నది. ఈ నెల 24న ఈ సినిమాలోని తొలి పాటగా 'గ..ఘూ..మేఘూ...' అంటూ సాగే గీతాన్ని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేయాలని చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. డా.కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రాశ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, పమ్మి సాయి, రాజశ్రీ నాయర్, ఆశురెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బేబీ హాసిని, బేబీ కృతిక, మాస్టర్ జోయ్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. తమన్, ఛాయాగ్రహణం: ఎం. నటరాజ సుబ్రమణియన్, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్, స్టంట్స్: స్టంట్ సిల్వ, రవివర్మ, సమర్పణ: నిఖితారెడ్డి, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కృష్ణచైతన్య.



అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. అను ఇమ్మాన్యుయేల్ కథానాయక. నాగబాబు సమర్పణలో లగడపాటి శిరీషా శ్రీధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆయన జన్మదిన వేడుక బుధవారం ఈ చిత్ర షూటింగ్ లొకేషన్‌లో జరిగింది. ఈ సందర్భంగా హీరో అల్లు అర్జున్ , సీనియర్ హీరో అర్జున్, కథానాయిక అను ఇమ్మాన్యుయేల్, నిర్మాత లగడపాటి శ్రీధర్, నటి నదియా, సహ నిర్మాత బన్నీవాసు దర్శకుడు వక్కంతం వంశీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మిస్టర్ రైట్ కోసమే..!

దక్షిణాది తారల్లో క్రేజీ నాయికగా గుర్తింపును సొంతం చేసుకుంది ముంబై సోయగం కాజల్ ఆగర్వాల్. 'ఖైదీ నంబర్ 150'తో మళ్లీ విజయాల బాటపట్టిన ఆమె ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా వుంది. కాజల్ అగర్వాల్ నటించిన తాజా చిత్రం 'అ!' ఇటీవలే విడుదలై మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కాజల్ అగర్వాల్ ప్రేమ, పెళ్లి విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'ప్రేమ, పెళ్లి... నా కెరీర్‌కు ప్రతిబంధకంగా మారతాయని, దాంతో నాకు అవకాశాలు తగ్గుతాయని నేను ఎప్పుడూ అనుకోలేదు. ప్రేమించడానికీ..పెళ్లి చేసుకోవడానికీ నేను ఎప్పుడూ సిద్ధంగానే వున్నాను. నా సోదరి వివాహం చేసుకుని చాలా ఆనందంగా గడుపుతున్నది. మా ఇంట్లో వాళ్లు సరైన వ్యక్తిని ఎంచుకోమని చెబుతున్నారు. ఇంకా ఆ మిస్టర్ రైట్ తారసపడలేదు' అని తెలిపింది. కల్యాణ్‌రామ్ హీరోగా రూపొందుతున్న 'ఎంఎల్ఏ', బాలీవుడ్ హిట్ చిత్రం 'క్వీన్' ఆధారంగా తమిళంలో నిర్మిస్తున్న 'పారిస్ పారిస్' చిత్రాల్లో కాజల్ అగర్వాల్ నటిస్తున్నది.


రంజిత్

'రానా ఓ లక్ష్యం లేని యువకుడు. అలాంటి వ్యక్తికి ఓ అందమైన అమ్మాయి తారసపడుతుంది. ఆ అమ్మాయి కోసం రానా ఏం చేశాడనేదే 'జువ్వ' ప్రధాన ఇతివృత్తం. ప్రారంభంలో అనుకున్న బడ్జెట్ కన్నా ఎక్కువే అయింది. కథకు అవసరం అనిపించి ఎక్కడా రాజీపడలేదు. మేం పెట్టిన ఖర్చుకు మించి అవుట్‌పుట్ తెరపైన కనిపిస్తుంది' అన్నారు రంజిత్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'జువ్వ'. త్రికోటి దర్శకుడు. డా.భరత్‌సోమి నిర్మిస్తున్న ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో హీరో రంజిత్ ముచ్చటించారు.

చిరు ప్రశంస మరిచిపోలేను!

'మాది వైజాగ్. చిన్నతనం నుంచి సినిమాలంటే అమితాసక్తి. దాని వల్లే ఈ రంగంలోకి ప్రవేశించాను. హైదరాబాద్‌లో ఎంబీఏ పూర్తిచేసిన తరువాత చిన్నచిన్న పాత్రల్లో నటించాను. 'నువ్వు నేను ఒకటవుదాం' హీరోగా నేను నటించిన తొలి చిత్రమిది. దీని తరువాత నేను నటిస్తున్న రెండవ చిత్రం 'జువ్వ'. మా సొంత సంస్థలో నిర్మించాం. ఇదొక విభిన్న ప్రేమకథా చిత్రం. 'దిక్కులు చూడకు రామయ్య' చిత్రాన్ని దర్శకుడు త్రికోటి ఎలా కొత్త పంథాలో తెరకెక్కించారో అదే తరహాలో ఈ చిత్రాన్నీ రూపొందించారు.

కొత్త పంథాలో...

ఇప్పటి వరకు వచ్చిన ప్రేమకథా చిత్రాల్లో కొత్త పంథాలో సాగే చిత్రమిది. ముందు ఈ సినిమా అనుకున్నప్పుడు దర్శకుడు త్రికోటి రెండు కథలు చెప్పారు. అందులో రత్నం చెప్పిన కథ నచ్చి సినిమా చేశాం. డాక్టర్ అయిన అన్నయ్య భరత్ నా కోసం నిర్మాతగా మారి ఈ చిత్రాన్ని నిర్మించారు. లవ్, యాక్షన్, డ్రామా, ఎంటర్‌టైన్‌మెంట్ ...ఇలా అన్ని రకాల అంశాల్ని మిళితం చేసి ఈ చిత్రాన్ని ఆసక్తికరంగా దర్శకుడు తెరకెక్కించారు. కథలో చాలా ట్విస్టులుంటాయి. కీరవాణి పాటలు, నేపథ్య సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలం. మలయాళ నటుడు అర్జున్ ఇందులో విలన్‌గా నటించారు. కెరీర్ పరంగా నటుడిగా ఈ చిత్రం మంచి గుర్తింపును తెచ్చిపెడుతుందనే నమ్మకముంది.

చిరంజీవి ప్రశంసించారు..

ఈ చిత్ర టీజర్‌ను హీరో చిరంజీవి విడుదల చేశారు. టీజర్ చూసిన ఆయన నాది ఫొటో జెనిక్ ఫేస్ అని ప్రశంసించడం మరిచిపోలేను. ఈ చిత్రానికి ముందు 'జింతాత' అనే టైటిల్ అనుకున్నాం. కానీ 'జువ్వ'నే బాగుంటుందని చివరికి ఈ టైటిల్‌ను నిర్ణయించాం. సినిమా చూసి కీరవాణి అభినందించారు. ఆయన తరహాలోనే ప్రేక్షకులు కూడా ప్రశంసిస్తారని ఆశిస్తున్నాను. తదుపరి చిత్రం బయటి సంస్థలో వుంటుంది. ప్రస్తుతం చర్చల దశలో వుంది. అన్నీ కుదిరితే మేలో సెట్స్‌పైకి వచ్చే అవకాశం వుంది.


రెజీనా

గూఢచారి శోధన


అడివి శేష్

అడివి శేష్, శోభిత ధూళిపాళ్ళ జంటగా నటిస్తున్న చిత్రం 'గూఢచారి'. అభిషేక్ నామా, టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శశికిరణ్ తిక్క దర్శకుడు. ప్రస్తుతం అమెరికాలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఆధునిక గూఢచారి కథ ఇది. అతడి శోధన దేనికోసమన్నది తెరపై ఆసక్తిని పంచుతుంది. స్పైగా అడివి శేష్ పాత్ర నవ్య పంథాలో సాగుతుంది. తెలుగు తెరపై ఇప్పటి వరకు రానటువంటి సరికొత్త కథ, కథనాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు వినూత్న అనుభూతిని పంచుతుంది. వేసవిలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: షానిల్ డియో, మాటలు: అబ్బూరి రవి, సంగీతం: శ్రీచరణ్ పాకాల, కథ: అడివి శేష్.

బాలీవుడ్‌లో తొలి అడుగు!

దక్షిణాది నుంచి త్రిష, కాజల్ అగర్వాల్‌తో పాటు పలువురు కథానాయికలు హిందీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పరాజయాలు, గ్లామర్ పరిమితుల కారణంగా ఒకటి, రెండు సినిమాలతోనే వారి బాలీవుడ్ కలలు కరిగిపోయాయి. తాజాగా రెజీనా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వబోతున్నది. రాజ్‌కుమార్‌రావ్, సోనమ్‌కపూర్ ప్రధాన పాత్రల్లో 'ఎక్ లడికీ కో దేఖాతో ఐసా లగా' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. విధు వినోద్‌చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రానికి షెల్లీ చోప్రా ధార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో రెజీనా నటించనున్నది. గత కొంతకాలంగా తెలుగు, తమిళ భాషల్లో నటనకు ఆస్కారమున్న పాత్రల్లో కనిపిస్తున్నది రెజీనా. ఈ చిత్రాల్లో రెజీనా అభినయానికి ముగ్ధులైన బాలీవుడ్ దర్శకనిర్మాతలు ఆమెకు అవకాశం ఇచ్చినట్లు తెలిసింది. రెజీనాతో పాటు అనిల్‌కపూర్, జూహీచావ్లా ప్రధాన పాత్రల్లో నటించనున్న ఈ చిత్రం ఈ ఏడాది చివరలో ప్రేక్షకుల ముందుకురానున్నది. గతంలో హిందీ చిత్రం 'ఆంఖేన్-2'లో నటించే అవకాశం రెజీనాను వరించింది. కానీ అనివార్య కారణాల వల్ల ఆ సినిమా సెట్స్‌పైకిరాలేదు.

మరో నాలుగు కొత్త పారిశ్రామికపార్కులు

మాదాపూర్, ఇబ్రహీంపట్నం, కుత్బుల్లాపూర్, వరంగల్‌లో ఏర్పాటుకు ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మరో నాలుగు కొత్త ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ పారిశ్రామిక పార్కులను ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే ఐటీ సెజ్‌లోని నానక్‌రాంగూడ, గచ్చిబౌలి ప్రాంతాలను ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లుగా ప్రభుత్వం గుర్తించింది. కొత్తగా మాదాపూర్, ఇబ్రహీంపట్నం, కుత్బుల్లాపూర్, వరంగల్‌లో నాలుగు ప్రాంతాలను ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ పారిశ్రామిక పార్కులుగా గుర్తిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మాదాపూర్ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ పారిశ్రామికపార్కు పరిధిలోకి హైదరాబాద్ నాలెడ్జ్ సిటీ రాయదుర్గం, మియాపూర్.. కుత్బుల్లాపూర్ పరిధిలోకి గాజులరామారం ఇండస్ట్రియల్ పార్కు, ఇబ్రహీంపట్నం పరిధిలోకి కొంగరకోలం, వరంగల్ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ పారిశ్రామిక పార్కు పరిధిలోకి ఐటీ పార్కు, టెక్స్‌టైల్ పార్కు మడికొండ, కాకతీయ టెక్స్‌టైల్ పార్కులను తీసుకొచ్చినట్టు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐటీ, ఐటీఈఎస్, సెజ్‌ల అభివృద్ధికి టీఎస్ఐఐసీ సహకరిస్తున్నది. ఇండస్ట్రియల్ ఏరియా లోక్ అథారిటీ పారిశ్రామిక పార్కులలోని రహదారులు, సరస్సులు, నీటిపారుదలతోపాటు పార్కుల పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, జీహెచ్ఎంసీ వంటి స్థానికసంస్థల పరిధిలో సేవలు అందించేలా పారిశ్రామికపార్కులు, టౌన్‌షిప్‌లు పనిచేయాలని టీఎస్ఐఐసీ వైస్‌చైర్మన్, ఎండీ కోరారు. వీటిద్వారా ఆయా సంస్థలకు 35 శాతం ఆదాయం సమకూరే అవకాశాలున్నాయని అరవింద్‌కుమార్ ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. నిష్పత్తి ప్రకారం స్థానికసంస్థలకు ఆదాయ వనరులు సమకూరాలని పేర్కొన్నారు.

పేదలకు మీ సేవలు అమోఘం

మంత్రి పద్మారావుకు కెనడా నాయకురాలు ప్రశంసలు



సికింద్రాబాద్: రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి టీ పద్మారావుపై కెనడాలోని అల్బెర్టా రాష్ట్ర యునైటెడ్ కన్జర్వేటివ్ పార్టీ ఉప నాయకురాలు లీలా షరాన్ అహీర్ ప్రశంసలు కురిపించారు. పేదల వైద్యసేవలకు ముఖ్యమంత్రి సహాయ నిధితోపాటు వివిధ పథకాలను సద్వినియోగం చేయడంలో చొరవ చూపుతున్న మంత్రిని కొనియాడారు. ఆమె పంపిన లేఖ బుధవారం రాత్రి సికింద్రాబాద్‌లోని మంత్రి కార్యాలయానికి చేరింది. ఇటీవల వ్యక్తిగత పర్యటనలో భాగంగా లీలా భారతదేశానికి వచ్చారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని రెయిన్‌బో హోం కేంద్రాన్ని ప్రతినిధుల బృందంతో కలిసి సందర్శించారు. రెయిన్‌బో హోంలో చిన్నారులతో కలిసి చాలా సమయం ముచ్చటించానని లేఖలో పేర్కొన్నారు. హోంలో వలంటీర్లుగా పనిచేస్తున్న తన బంధువు గోవర్ధన్ దర్శి, రాధిక దర్శి అభ్యర్థన మేరకు కార్యకలాపాలను స్వయంగా పరిశీలించానని తెలిపారు. ఈ క్రమంలో మంత్రి పద్మారావు తన పని ఒత్తిడిలో కూడా నియోజకవర్గానికి చెందిన పేదల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చొరవ చూపడాన్ని అభినందించారు. అంకితభావం కలిగిన రాజకీయ నేతల్లో ఒకరిగా, నిబద్ధతతో పద్మారావు పనిచేయడం ప్రశంసనీయమని కొనియాడారు.

సీపీఎస్ రద్దు కోసం నేడు మండలకేంద్రాల్లో ధర్నా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ గురువారం మండల కేంద్రాల్లో ధర్నా చేపడుతామని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పీ సరోత్తం రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

త్వరలో ఈ-సెట్ ప్రవేశాలు

- ఆన్‌లైన్‌లో కుల, ఆదాయ, ఎస్సెస్సీ ధ్రువీకరణ పత్రాల పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో నేరుగా రెండో సంవత్సరంలో అడ్మిషన్ల (లాటరల్ ఎంట్రీ) కోసం త్వరలో నిర్వహించనున్న ఈ-సెట్ 2018ని సులభతరంగా చేయాలని ఈ-సెట్ అడ్మిషన్ కమిటీ అధికారులు భావిస్తున్నారు. నకిలీలను నిరోధించడం కోసం ఎస్సెస్సీతోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను కూడా ఆన్‌లైన్ ద్వారా పరిశీలించాలని నిర్ణయించారు. సాధ్యాసాధ్యాలపై బుధవారం ఉన్నత విద్యామండలిలో సమావేశమై చర్చించారు. డిప్లొమా విద్యార్థుల కోసం నిర్వహించనున్న ఈ-సెట్ ప్రవేశ పరీక్షల షెడ్యూల్ త్వరలో జారీచేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు.

పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టండి

- లేదంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధిచెప్తారు
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి.. కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశాల్లో బిల్లు పెట్టకుంటే వచ్చే ఎన్నికల్లో ఓట్ల ద్వారా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మోసం చేసిన ఈ రెండు పార్టీలను తెలంగాణ రాష్ట్రంలో బొందపెడుతారని బుధవారం సచివాలయంలో మీడియాతో అన్నారు. వర్గీకరణపై వేర్వేరు రాష్ట్రాల్లో మీటింగ్‌లు పెట్టడం కాదు.. దమ్ముంటే ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేయించాలని మంద కృష్ణమాదిగకు సవాల్ విసిరారు. ఈ నెల 25న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ మాదిగ సదస్సు పోస్టర్‌ను పిడమర్తి రవి ఆవిష్కరించారు. వర్గీకరణ పేరుతో కొందరు 25 ఏండ్లుగా ఉద్యమాన్ని తమ స్వప్రయోజనం కోసం వాడుకున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర నవ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కృషి చేస్తున్నారని చెప్పారు. దీనిని కొందరు స్వార్థపరులు జీర్ణించుకోవడం లేదన్నారు.

హైకోర్టు విభజన తరహాలో ఒత్తిడి తెండి: హైకోర్టు విభజన తరహాలోనే ఎస్సీ వర్గీకరణ విషయంలో కూడా రాష్ట్రప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ.. సీఎం కేసీఆర్‌ను కోరారు. బుధవారం ఆయన సచివాలయంలో పలువురు మంత్రులను, సీఎస్‌ను కలిశాక మీడియాతో మాట్లాడారు.

డబుల్ వేగం

- జూన్ వరకు 60 వేల ఇండ్లు పూర్తిచేయడమే లక్ష్యం
- జిల్లాలవారీగా లక్ష్యాల నిర్దేశం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి. కొద్దినెలలుగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నెమ్మదించిన నిర్మాణాలు.. ప్రభుత్వం ఇసుక సరఫరాలో ప్రత్యేక సదుపాయాలు కల్పించడం, స్టీల్, సిమెంట్ ధరలు తగ్గిన నేపథ్యంలో మళ్లీ ఊపందుకున్నాయి. స్టీల్ ధరలు టన్నుకు రూ. 9,440 తగ్గించిన వారం రోజుల్లోనే దాదాపు 30 వేల ఇండ్లకు టెండర్లు ఖరారయ్యాయి. గతంలో టెండర్లు ఖరారు చేసినా.. నిర్మాణాలు మొదలుకాని ఇండ్లు ప్రస్తుతం పునాదులు దాటాయి. వర్షాకాలం రాకముందే జూన్ వరకు 60 వేల ఇండ్లను పూర్తి చేయాలని గృహనిర్మాణశాఖ లక్ష్యాన్ని విధించుకున్నది.

అవసరమున్నంత ఇసుక

ఇసుక సరఫరాలో ఇప్పటివరకు సాగు, తాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చిన సర్కారు.. వాటి సరసన డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రాజెక్టును చేర్చింది. కాంట్రాక్టర్ల నుంచి దరఖాస్తు తీసుకుని, రెవెన్యూ అధికారులు గుర్తించిన ప్రాంతం నుంచి నేరుగా ఇసుకను నిర్మాణ ప్రాంతానికి తరలిస్తున్నారు. మైనింగ్ అధికారులు ఇప్పటివరకు గుర్తించిన ఇసుక రీచ్‌ల్లో దాదాపు 30 శాతం ఇండ్ల నిర్మాణాల కోసం అందుబాటులో పెట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. నిర్మాణంలో అవసరమయ్యే బూడిదను కూడా సింగరేణి నుంచి ఉచితంగా పంపిణీ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ఎన్టీపీసీతో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ఒప్పందం చేసుకుంది. రవాణా చార్జీలు మాత్రమే భరించాల్సి ఉంటుంది.

అందుబాటు ధరల్లో స్టీల్, సిమెంట్

స్టీల్ కంపెనీ యజమానులతో మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి పలు దఫాలుగా జరిపిన చర్చలతో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో స్టీల్ భారం తగ్గింది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను స్టీల్ ధర రూ. 53,100 ఉండగా.. బేస్‌రేట్‌కు అనుగుణంగా ఇప్పటినుంచి ఏప్రిల్ వరకు రూ.43,660కు టన్ను స్టీల్ ఇచ్చేందుకు కంపెనీల యజమానులు అంగీకరించారు. దీంతో ఒక్కో టన్నుపై రూ.9,440 తగ్గింది. ప్రస్తుతం జిల్లాల పరిధిలోని లక్ష ఇండ్లకు 1.45 లక్షల టన్నులు, పట్టణాల్లో 60 వేల ఇండ్లకు 1.04 లక్షల టన్నులు, జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష ఇండ్లకు రూ. 2.78 లక్షల టన్నుల స్టీల్ అవసరమున్నట్టు గుర్తించారు. ఏప్రిల్ 16 వరకు స్టీల్ ధరను పెంచకుండా బేస్‌రేట్‌కు కాంట్రాక్టర్లకు విక్రయించనున్నారు. దీంతో ఇప్పటివరకు నిర్ణయించి.. టెండర్లు ఖరారైన ఇండ్లతో కలుపుకుని రూ.264.60 కోట్ల భారం తగ్గుతున్నది. సిమెంట్ ధరల్లో మార్పు లేకుండా ఇప్పటివరకూ ఒకే ధరపై సరఫరా చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌తో సంబంధం లేకుండా డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి రూ.230 చొప్పున సిమెంట్ సరఫరా చేస్తున్నారు. ధరలు తగ్గిన నేపథ్యంలో ఇప్పటివరకు టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు ఇప్పుడు నిర్మాణం చేసేందుకు ఆమోదం తెలుపుతున్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 30వేల ఇండ్లు నిర్మించేందుకు కాంట్రాక్టర్లు ఒప్పందం చేసుకున్నారు.

ఇదీ లెక్క..

ప్రస్తుతం రాష్ట్రంలో 2.60 లక్షల ఇండ్లు ఈ ఏడాది నిర్మాణం చేసేందుకు పరిపాలనా అనుమతులు వచ్చాయి. 2.19 లక్షల ఇండ్ల నిర్మాణానికి భూ సేకరణ ఇబ్బందులు లేకపోవడంతో టెండర్లు ఆహ్వానించారు. దీనిలో 1,78,168 ఇండ్ల టెండర్లు ఖరారయ్యాయి. 1,49,242 ఇండ్ల నిర్మాణాలు మొదలుపెట్టారు. స్టీల్, ఇసుక, సిమెంట్ ధరల వ్యత్యాసాలతో ఇండ్ల నిర్మాణాలు కొంత తగ్గినప్పటికీ... ఇప్పుడు మళ్లీ ఊపందుకున్నాయి. ప్రస్తుతం 8,331 ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1,277.81 కోట్లను వెచ్చించింది.

చురుకుగా డబుల్ ఇండ్ల నిర్మాణం: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

డబుల్ బెడ్‌రూం ఇండ్ల టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం ఊపందుకున్నది. స్టీల్ కంపెనీలు కూడా సామాజిక బాధ్యతగా ఇనుమును తక్కువ ధరకు అమ్మేందుకు ముందుకు రావడం అభినందనీయం. జూన్ నాటికి 60 వేల ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నాం. జీహెచ్ఎంసీ పరిధిలో కూడా మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టడంతో నిర్మాణ ప్రక్రియ వేగవంతమైంది.



మీడియాతో మాట్లాడుతున్న మేయర్ బొంతు రామ్మోహన్. చిత్రంలో కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు

బాండ్ల నిధులతో ఎస్ఆర్డీపీకి ఊపు

జీహెచ్ఎంసీ బాండ్లలో రూ.427 కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చిన సంస్థలు

నేడు జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో లిస్టింగ్ వేడుకలు ● మేయర్ బొంతు రామ్మోహన్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: జీహెచ్‌ఎంసీ బాండ్ల జారీ ద్వారా సమకూరుతున్న నిధులతో ఎస్ఆర్డీపీ మరింత వేగంగా ముందుకు సాగుతుందని మేయర్ బొంతు రామ్మోహన్ దీమా వ్యక్తంచేశారు. బుధవారం కమిషనర్ జనార్దన్‌రెడ్డితో కలిసి మేయర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ బాండ్లకు సంబంధించి ఈ నెల 14న ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నిర్వహించిన ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ సందర్భంగా లిస్టింగ్ అయిన మూడు నిమిషాల్లోనే రూ.427 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆయా సంస్థలు ముందుకొచ్చాయన్నారు. అయినా ప్రస్తుతానికి రూ.200 కోట్లు మాత్రమే సేకరించనున్నారు. భారీ స్పందనను బట్టి జీహెచ్‌ఎంసీ ఆర్థిక పరిపుష్టి ఏ స్థాయిలో ఉన్నదో ఊహించుకోవచ్చన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు దక్కని, అతికొద్ది నగరాలకు మాత్రమే పొందే అర్హత గల 'ఏఏ' రేటింగ్ హైదరాబాద్‌కు రావడం గర్వకారణమన్నారు. బాండ్ల జారీ ద్వారా మున్సిపల్ రంగంలో జీహెచ్‌ఎంసీ సరికొత్త చరిత్రకు నాంది పలుకుతూ ఆదర్శంగా నిలిచిందన్నారు. రూ.1,000 కోట్లు సమీకరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకోగా, మొదటివిడుతలో రూ.200 కోట్లను సేకరించినట్లు వివరించారు. అవసరాలకు అనుగుణంగా నిధులను సమీకరించుకుంటామన్నారు. దేశంలోని స్థానిక సంస్థలు గత 50-60 ఏండ్లలో బాండ్ల ద్వారా కేవలం రూ.2 వేల కోట్లు సేకరిస్తే, జీహెచ్‌ఎంసీ ఒక్కటే ఇప్పుడు రూ.వెయ్యి కోట్లు సేకరించనున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ మార్గదర్శకాల మేరకు జీహెచ్‌ఎంసీ స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. బాండ్ల జారీ విజయవంతమైన నేపథ్యంలో గురువారం జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు లిస్టింగ్ వేడుకలు నిర్వహించనున్నామని వివరించారు.

ఏఏ+ రేటింగ్ వస్తే వడ్డీ తగ్గేది: కమిషనర్

ప్రస్తుతం బాండ్లపై 8.9 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆరు నెలలకు ఒకసారి వడ్డీ చెల్లిస్తూ పదేండ్ల తర్వాత అసలు మొత్తం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. హైదరాబాద్ నగరానికి ఏఏ(స్టేబుల్) రేటింగ్ వచ్చినందున 8.9 శాతం వడ్డీ చెల్లించాల్సివస్తున్నదని, ఏఏ+ రేటింగ్ వచ్చి ఉంటే వడ్డీ మరికొంత తగ్గేదన్నారు.

తెలుగు ఎన్నటికీ నిలిచే వెలుగు

- సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి
- రవీంద్రభారతిలో మాతృభాషా దినోత్సవ సదస్సు
- భాష పరిరక్షణకు సూచనలు చేసిన మేధావులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలుగెప్పుడూ ఓడిపోదని, ఆంగ్లాన్ని జయించి ఇప్పటికీ వెలుగుతున్న భాషని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు నందిని సిధారెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. తెలుగు భాష ఎన్నో ఆధిపత్య భాషల్ని ఎదురించి నిలబడిందని, అలాంటి తెలుగు భాష సజీవంగా, శాశ్వతంగా ఉంటుందన్నారు. తెలుగు భాష సంస్కృతాన్ని, అరబ్బీని, పారశీని, ఉర్దూని కూడా తనలో కలుపుకొన్నదని, తనదైన అస్తిత్వంతో నిలబడిందని పేర్కొన్నారు. అన్ని మాతృభాషలకు సంబంధించిన మాండలికాలన్నీ సమానమేనని, ఒకటి హెచ్చు మరొకటి తక్కువ కాదన్నారు. మాండలికాల పట్ల చిన్నచూపు ఉన్నచోట భాషా ఉద్యమాలు పుట్టుకొచ్చాయని గుర్తుచేశారు. 1956 కంటే ముందు తెలంగాణలో మనదే అస్సాంలో ఉమ్మడి రాష్ట్రంలో మూడు యాసలు మాత్రమే తెలుగు అనే వాదనకు వచ్చారని, దానివల్లే తెలంగాణ భాషా ఉద్యమం పుట్టుకొచ్చిందని చెప్పారు. నాలుగు ప్రాంతాలు కలిస్తేనే తెలుగని స్పష్టం చేశారు. తల్లి భాషను వదులుకోకుండా మిగతా భాషల్ని కూడా సమాంతరంగా చదువాల్సిన అవసరం ఉన్నదన్నారు. భాషపట్ల ఉన్న మమకారాన్ని, ప్రేమను నిలుపుకోవాలని, మనదైన మాండలిక పదాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.



మాతృభాషాదినోత్సవ సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి. చిత్రంలో అకాడమీ కార్యదర్శి నర్సింహారెడ్డి, తెలుగు వర్సిటీ వీసీ సత్యనారాయణ తదితరులు

భాష కేవలం భావ వ్యక్తీకరణే కాదు

చరిత్రలో భాష కోసం అనేక ఉద్యమాలు జరిగాయని, తెలంగాణలోనూ భాష కోసం ఉద్యమాలు జరిగాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ గుర్తు చేశారు. భాష కేవలం భావ వ్యక్తీకరణే కాదని, అదొక జీవన విధానమన్నారు. జాతి, సమాజం, మానవ సంబంధాలు, ఆహార విషయాలు భాష పరిగణలోకి వస్తాయన్నారు. పొట్టకూటి కోసం ఇతర భాషలు నేర్చుకోవడం తప్పుకాదన్నారు. సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కే రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. తెలుగు భాషపై పత్రికలు, ప్రసార మాధ్యమాల వల్ల కూడా దాడి జరుగుతున్నదని అభిప్రాయపడ్డారు. ప్రసార మాధ్యమాల్లో ఆంగ్ల పదాల వాడకాన్ని తగ్గించాలన్నారు. పాలకుల వైఫల్యం కారణంగా నేడు దేశంలో ఆంగ్లం చెలామణి అవుతున్నదని చెప్పారు. ఒకటి నుంచి ఐదుడు తరగతుల వరకు కేవలం తెలుగు మాధ్యమం, ఆ తర్వాత తరగతుల్లో మాత్రమే ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడితే బాగుంటుందన్నారు. కొత్త పదాలను రూపొందించే ప్రక్రియకు సాహిత్య అకాడమీ పూనుకోవాలని, భాషా నిపుణులతో నెలకోసారి సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అకాడమీ కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ దేశంలో హిందీ తర్వాత తెలుగే ప్రధానమైన భాషని, తెలుగుకు అంతరించిపోయే ప్రమాదం లేదన్నారు. లంబాడీ, గోండు, సవర, చెంచుల భాషలకు ప్రమాదం ముంచుకొస్తున్నదన్నారు. తెలుగు అభివృద్ధికి సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతామన్నారు.

ఇతర భాషా పదాలతో నష్టంలేదు

తెలుగుకు ఇతర భాషా పదాలను స్వీకరించే గుణం ఉన్నదని, ఇతర భాషా పదాలు చేరడం వల్ల నష్టమేమీ జరుగదని బహు భాషావేత్త నలిమెల భాస్కర్ పేర్కొన్నారు. ఒక భాషలో సరైన పదాలు లేనప్పుడు ఇతర భాషలోని పదాలను ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రముఖ సంస్కృత పండితుడు సంగనభట్ల నర్సయ్య మాట్లాడుతూ నన్నయ్య ఉపయోగించిన భాషలో తెలంగాణ మాండలిక పదాలే ఎక్కువని, కాబట్టి నన్నయ తెలంగాణవాడని తాను విశ్వసిస్తున్నట్టు చెప్పారు. ప్రాచీన కవి బవభూతి ఉత్తర తెలంగాణవాడని, తెలుగు నుడికారాలను సంస్కృత నాటకాల్లో చూపించారన్నారు. తెలుగును పాలనా భాషగా అమలు చేసేందుకు తెచ్చిన జీవోలను చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే సాగాలని విశ్రాంత ఐఏఎస్ ముక్తేశ్వర్‌రావు, రెవెన్యూ ఉద్యోగి చంద్రమోహన్ తదితర వక్తలు సూచించారు.

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు!

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల షార్ట్‌ఫాల్స్ ఈ నెలాఖరు వరకు సమర్పించవచ్చని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి తనిఖీలు పూర్తిచేసి 28వ తేదీ వరకు ప్రొసీడింగ్స్ జారీచేస్తూ ఈ పథకాన్ని పూర్తి చేయాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు దరఖాస్తుదారులకు షార్ట్‌ఫాల్స్ సమర్పించాలని కోరుతూ నోటీసులు జారీ చేసినా వారినుంచి స్పందన రావడం లేదు. దీంతో ఈ నెలాఖరు వరకు షార్ట్‌ఫాల్స్ సమర్పించే అవకాశం కల్పించారు. మరోవైపు ఈ నెలాఖరుతో ముగియనున్న దరఖాస్తుల పరిష్కారం గడువును మరింత పొడిగించాలని ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్టు ఓ ఉన్నతాధికారి తెలిపారు. జీహెచ్‌ఎంసీకి మొత్తం 71,764 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 60,317 (98శాతం) దరఖాస్తులను ప్రాసెస్ చేశారు. ఇందులో 15,197 (25శాతం) దరఖాస్తులకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. 1,408 దరఖాస్తులకు ఫీజు ఇంటిమేషన్ లేఖలు పంపగా, 4,320 దరఖాస్తులను తిరస్కరించారు. 32,935 (51శాతం)దరఖాస్తులకు షార్ట్‌ఫాల్స్ ఉన్నట్టు గుర్తించి సమర్పించాలని లేఖలు రాశారు. మిగిలిన దరఖాస్తుల్లో 14,698 దరఖాస్తులు యూఎల్‌సీ, 661 ఎఫ్‌టీఎల్, 475 వక్ఫ్‌బోర్డు, 150 మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌లో, 585 టైటిల్ లిటిగేషన్‌లో మొత్తంగా 18,068 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.86 కోట్ల ఆదాయం వచ్చిందని, మరో రూ.25 కోట్ల వరకు వస్తుందని అధికారులు తెలిపారు. .

ప్రభుత్వానికి లేఖ రాయనున్న జీహెచ్ఎంసీ

దేశంలోనే తొలిసారిగా యశోదలో '3టీ ఐఎంఆర్ఐ'

బ్రెయిన్ ట్యూమర్‌ను సమూలంగా తొలిగించొచ్చంటున్న వైద్యులు



3టీ ఐఎంఆర్ఐ యంత్రం పనితీరును వివరిస్తున్న యశోద దవాఖాన వైద్యులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సల విభాగంలో యశోద దవాఖాన దేశంలోనే తొలిసారిగా '3టీ ఐఎంఆర్ఐ' స్కానింగ్ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని సీనియర్ న్యూరోసర్జన్ బాలసుబ్రమణ్యం, డాక్టర్ రాజేశ్, డాక్టర్ సవిత్రశాస్త్రి, డాక్టర్ శ్రీనివాస్‌బొట్ల తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ యశోద దవాఖానలో ఐఎంఆర్ఐ పనితీరును వివరించారు. ఐఎంఆర్ఐతో మెదడులోని ట్యూమర్ల రియల్‌టైమ్ ఇమేజ్‌లను తీయొచ్చని, వాటి సాయంతో మెదడులోని ట్యూమర్లను పూర్తిగా తొలిగించొచ్చన్నారు. సాధారణంగా బ్రెయిన్ ట్యూమర్ రోగులకు శస్త్రచికిత్సకు ముందు ఎంఆర్ఐ స్కాన్ చేసి ట్యూమర్లను గుర్తిస్తారని, రిపోర్ట్ ప్రకారం శస్త్రచికిత్స చేస్తారన్నారు. ఆ తర్వాత మరోసారి ఎంఆర్ఐ స్కాన్ చేసి ఎక్కడైనా ట్యూమర్లు మిగిలిపోతే రెండోసారి శస్త్రచికిత్స నిర్వహించాల్సి ఉంటుందన్నారు. దీంతో రోగికి పలుమార్లు శస్త్రచికిత్స చేయాల్సి వస్తుందన్నారు. రోగి ప్రాణాలకు ముప్పు పొంచిఉండటంతోపాటు ఆర్థికభారం కూడా పడుతుందన్నారు. దీనిని అధిగమించేందుకే ఐఎంఆర్ఐని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఐఎంఆర్ఐ ద్వారా బ్రెయిన్ ట్యూమర్ల అంచులను ఖచ్చితంగా నిర్ధారించవచ్చన్నారు. శస్త్రచికిత్స సమయంలోనే తొలిగించిన ట్యూమర్‌కు సంబంధించిన కణజాలం, అసాధారణ కణాలు ఇంకా ఏమైనా మిగిలి ఉన్నాయా వంటి విషయాలు తెలుసుకునేందుకు ఐఎంఆర్ఐ ద్వారా తీసిన రియల్‌టైమ్ ఇమేజెస్ ఎంతో ఉపయోగపడుతాయన్నారు. దీంతో పలుమార్లు శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఉండదన్నారు. ఐఎంఆర్ఐ ద్వారా ఇప్పటికే యశోదలో పలువురు బ్రెయిన్ ట్యూమర్ బాధితులకు శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామన్నారు. మొదటిసారిగా యూపీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వావిన్ కపాడియా(34)కు గత అక్టోబర్ 4న ఆపరేషన్ చేశామని, రెండో శస్త్రచికిత్స హైదరాబాద్‌కు చెందిన వజ్రమ్మ(72)కు నిర్వహించామన్నారు. మరికొంత మందికి సైతం ఆపరేషన్లు జరిగాయన్నారు. ప్రస్తుతం వారందరూ కోలుకొని సాధారణ జీవనాన్ని గడుపుతున్నట్టు వివరించారు. సమావేశంలో పలువురు వైద్యులు, శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు పాల్గొన్నారు.

రోగులు వేగంగా కోలుకునేందుకే..: డాక్టర్ జీఎస్ రావు

బ్రెయిన్ ట్యూమర్ నుంచి రోగులు వేగంగా కోలుకునేందుకు యశోద దవాఖాన ఎప్పటికప్పుడు అత్యాధునిక వైద్యసాంకేతికతను సమకూర్చుకుంటున్నదని యశోద గ్రూప్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ జీఎస్ రావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఐఎంఆర్ఐని అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ వైద్య సంస్థల్లో శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన సర్జన్లు అత్యాధునిక చికిత్సా విధానాలను ఉపయోగించి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలను నిర్వహిస్తున్నట్టు వివరించారు.

టీజీబీ కుంభకోణంలో సీబీఐ దర్యాప్తు ముమ్మరం

మొయినాబాద్: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో వెలుగుచూసిన కుంభకోణంలో సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా సాగుతున్నది. రూ.8.94 కోట్ల ఈ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది బ్యాంక్ అధికారులు, సిబ్బందిపై సీబీఐ అధికారులు ఈ నెల 19న కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సీబీఐ అధికారులు రెండు రోజులుగా అజీజ్‌నగర్‌లోని బ్యాంకులో విచారణ జరుపుతున్నారు. నిందితులను ప్రశ్నిస్తున్నారు. మొయినాబాద్ పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో సేకరించిన వివరాల సీడీని సీబీఐ అధికారులు తీసుకున్నారు. విచారణలో ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. పోలీసుల కస్టడీలో ఉన్న ప్రధాన సూత్రధారి జైపాల్‌రెడ్డిని తమ కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. సీబీఐ డీఐజీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దర్యాప్తు సాగుతున్నట్టు తెలుస్తున్నది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ.4 కోట్లకు పైగా కుంభకోణం జరిగితే కేసు సీబీఐ పరిధిలోనికి వస్తుంది.

వీసా గడువు ముగిసినా ఇక్కడే తిష్ఠ

11 మందిని స్వదేశాలకు పంపించే ఏర్పాట్లు

44 మందికి వీసా గడువు పొడిగించుకునే అవకాశం

హైదరాబాద్ వెస్ట్‌జోన్‌లో పోలీసుల ఆకస్మిక తనిఖీ

మెహిదీపట్నం: అక్రమంగా హైదరాబాద్‌లో తిష్ఠవేసిన విదేశీయులను గుర్తించేందుకు వెస్ట్‌జోన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వీసా, పాస్‌పోర్టుల గడువు ముగిసినా అక్రమంగా ఉంటున్న 11 మందిని గుర్తించి, వారిని స్వదేశానికి పంపించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పశ్చిమ మండలం ఆసిఫ్‌నగర్ డివిజన్ హుమాయూన్‌నగర్, లంగర్‌హౌస్, గోల్కొండ, బంజారాహిల్స్, ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉంటున్న విదేశాలకు చెందినవారి వివరాలు సేకరించేందుకు పోలీసులు బుధవారం ఉదయం 5 గంటల నుంచి తనిఖీలు చేపట్టారు. హుమాయూన్‌నగర్ స్టేషన్ పరిధిలోని టోలిచౌకి, హుమాయూన్‌నగర్, మాసబ్‌ట్యాంక్, ఫస్ట్‌లాన్సర్, శ్రీరాంనగర్, కైలాశ్‌నగర్, విజయ్‌నగర్‌కాలనీల్లో సుమారు 120 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నైజీరియా, ఒమన్, సొమాలియాకు చెందినవారు ఉన్నారు. అదుపులోకి తీసుకున్న వారి పత్రాలను తనిఖీ చేశారు. ఇందులో 55 మంది వద్ద సరైన పత్రాలు లేవని గుర్తించారు. వీరిలో కొందరు సర్టిఫికెట్లు, రెన్యూవల్స్‌ను ఇక్కడి నుంచే పొందే అవకాశాలున్నాయి. 44 మంది వీసా గడువు ఇటీవల ముగిసిందని, గడువు పొడిగించుకునే అవకాశం ఉండటంతో విదేశాంగశాఖకు సమాచారం ఇచ్చామని పోలీసులు తెలిపారు. మిగతా 11 మంది పాస్‌పోర్టు, వీసాల గడువు పూర్తయినా ఇక్కడే తిష్ఠ వేశారని, వారిని స్వదేశాలకు పంపిస్తామని పశ్చిమ మండలం డీసీపీ వెంకటేశ్వర్ రావు, టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు తెలిపారు.



హుమాయూన్‌నగర్‌లో నైజీరియన్‌ను ప్రశ్నిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజు

సెన్సెక్స్	నిఫ్టీ
33,845	10,397
↗ 141	↗ 37

ముడి చమురు (బ్రెంట్) ↘ 65.18 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,585
22 క్యారెట్లు	30,435
వెండి (కిలో)	38,180

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.68	68.04
బహ్రెయిన్ దినార్	158.92	185.11
కువైట్ దినార్	178.04	221.64
సౌదీ రియాల్	15.60	18.50
యూఏఈ దిర్హామ్	15.97	18.67

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	75.00
రిటైల్ లైవ్	97.00
డ్రెస్డ్	141.00
స్కిన్‌లెస్	160.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	355-00
రంగారెడ్డి	355-00
మెదక్	355-00
కరీంనగర్	357-00
వరంగల్	357-00
రిటైల్ ప్రైస్	4-15

35 వేల వరకు పెరుగనున్న స్కోడా ధర



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ప్రముఖ కార్ల తయారీ సంస్థ స్కోడా.. వచ్చే నెల 1 నుంచి అన్ని రకాల వాహన ధరలను రూ.35 వేల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో కస్టమ్ డ్యూటీని పెంచుతున్నట్లు ప్రకటనకు అనుగుణంగా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నది. సంస్థపై పడుతున్న భారాన్ని వినియోగదారులకు మళ్లించడంతో కార్ల ధరలు రూ.10 వేల నుంచి రూ.35 వేల వరకు పెంచాల్సి వచ్చిందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం సంస్థ రూ.8.32 లక్షల ధర కలిగిన మిడ్‌సైజ్ సెడాన్ ర్యాపిడ్‌తోపాటు రూ.34.5 లక్షల విలువైన ఎస్‌యూవీ కొడిక్యూను దేశవ్యాప్తంగా విక్రయిస్తున్నది. పాత కస్టమర్లకు మాత్రం రూ.50 వేల వరకు లాయల్టీ బోనస్‌ను ప్రకటించింది.

అమ్మకానికి ఖాయిలాపడిన పీఎస్‌యూలు

- రెండో జాబితాను సిద్ధంచేసిన నీతి ఆయోగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఖాయిలా పడిన ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడానికి కేంద్రం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి మరో జాబితాను త్వరలో విడుదల చేయనున్నట్లు నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ తెలిపారు. పీఎంవో ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే నీతి ఆయోగ్ నాలుగు జాబితాలను రూపొందించగా, తాజాగా ఇది ఐదోదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌యూల్లో వాటాల విక్రయం ద్వారా రూ.80 వేల కోట్లు సేకరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.

మహిళా వ్యాపారవేత్తలకు ప్రత్యేక సెల్

- హైదరాబాద్‌లో జరిగిన జీఈఎస్ సదస్సుతో సత్ఫలితాలు: నీతి ఆయోగ్

వాషింగ్టన్, ఫిబ్రవరి 21: భారత్‌లో మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడానికి ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు నీతి ఆయోగ్ ప్రకటించింది. వారి కార్యాక్రమాలకు మరింత ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నీతి ఆయోగ్ సభ్యురాలు అన్నా రాయ్ తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని వాషింగ్టన్ డీసీతో అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్(జీఈఎస్) సత్ఫలితాలనిచ్చిందన్న ఆమె.. ముఖ్యంగా మహిళ వ్యాపారవేత్తల్లో నమ్మకం పెరుగడానికి ఇలాంటి సదస్సులు దోహదం చేయనున్నాయని పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూతురు ఇవాంకా ట్రంప్ హాజరయ్యారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులకు హాజరుకావడం వల్ల వ్యాపార రంగంలో ఉన్న మెలుకువలు, మరిన్ని నూతన విషయాలు తెలుసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. మహిళలకు అన్ని రకాలుగా ప్రోత్సహం లభిస్తే వ్యాపార రంగంలో వారు రాణించే అవకాశం ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన జీఈసీ సదస్సు వారిలో చైతన్యం పెంచడానికి దోహదపడిందని అమెరికాలో భారత రాయబారి నవ్‌టేజ్ సింగ్ శర్మ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీ సంక్షేమ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.

ఎఫ్‌డీఐలో నిస్తేజం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో(ఎఫ్‌డీఐ) మళ్లీ నిస్తేజం నెలకొన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలానికి 3,594 కోట్ల డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన 3,584 కోట్ల డాలర్లతో పోలిస్తే కేవలం 0.27 శాతం పెరుగుదల కనిపించిందని డీఐపీపీ డాటా వెల్లడించింది. రూపాయిల్లోకి మారిస్తే నాలుగు శాతం తగ్గి రూ.2,31,457 కోట్లకు పరిమితమయ్యాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీయల్ పాలసీ అండ్ ప్రమోషన్(డీఐపీపీ) తెలిపింది. గడిచిన తొమ్మిది నెలల్లో సేవల రంగంలోకి 4.62 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు రాగా, టెలి కమ్యూనికేషన్స్‌లోకి 6.13 బిలియన్ డాలర్లు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ అండ్ హార్డ్‌వేర్‌లోకి 5.15 బిలియన్ డాలర్లు, నిర్మాణ రంగంలోకి 2.50 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వచ్చాయి. ప్రధానంగా సింగపూర్, మారిషస్, నెదర్లాండ్, జపాన్ దేశాల నుంచి అధిక మొత్తంలో ఎఫ్‌డీఐలు వచ్చాయి. వీటిలో మారిషస్ నుంచి 13.34 బిలియన్ డాలర్లు రాగా, సింగపూర్ నుంచి 9.21 బిలియన్ డాలర్లు, నెదర్లాండ్ నుంచి 2.38 బిలియన్ డాలర్లు వచ్చాయని డీఐపీపీ నివేదిక తెలిపింది.

హైదరాబాద్‌లో ఐడీఎఫ్‌సీ బ్యాంక్ సేవలు


- మరో ఆరు నెలల్లో నాలుగు శాఖల ఏర్పాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 21: మౌలిక రంగానికి రుణాలు అందించే దేశంలో అతిపెద్ద సంస్థయైన ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ అనుబంధ సంస్థయైన ఐడీఎఫ్‌సీ బ్యాంక్..హైదరాబాద్‌లో తన బ్యాంకింగ్ సేవలను ప్రారంభించింది. ఇప్పటికే రాష్ట్రంలో డిజిటల్ ద్వారా సేవలు అందిస్తున్న సంస్థ..బుధవారం హైదరాబాద్‌లో తన తొలి బ్రాంచ్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అవ్‌తార్ మోంగా మాట్లాడుతూ..వచ్చే ఆరు నెలల్లో ఒక హైదరాబాద్‌లోనే నాలుగు శాఖలను ప్రారంభించాలనుకుంటున్నట్లు చెప్పారు. వ్యాపార విస్తరణలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో ఒక శాఖను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఎప్పటిలోగా ఏర్పాటు చేసేదానిపై ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 135 శాఖలను నిర్వహిస్తున్న సంస్థ..వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ సంఖ్య 200కి పెంచుకోనున్నట్లు చెప్పారు. సామాన్యుడికి సైతం డిజిటల్ ద్వారా బ్యాంకింగ్ సేవలు అందించడంలో బ్యాంక్ దూసుకుపోతున్నదని, దీంట్లోభాగంగా కేవలం నాలుగు నిమిషాల్లో ఖాతాను తెరిచే సౌలభ్యాన్ని బ్రాంచ్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఆధార్ ఆధారంగా నగదు విత్‌డ్రా, డిపాజిట్ చేసుకునే అవకాశాన్ని కూడా ఖాతాదారులకు కల్పించిన తొలి బ్యాంక్ తమదేనని ఆయన పేర్కొన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 7.5 శాతం వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్, గృహ రుణాలపై 8.60 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో 750 ప్రాంతాల్లో మైక్రో ఏటీఎం ద్వారా సేవలను అందిస్తున్న బ్యాంక్..ఒక సిద్దిపేట జిల్లాలో రైతు బజార్, చిన్న రిటైల్ అవుట్‌లెట్లకు ఇలాంటి సదుపాయం కల్పించింది.

నోయిడాలో పల్సస్ కేంద్రం


- వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 21: రాష్ర్టానికి చెందిన ప్రముఖ టెక్నాలజీ సేవల సంస్థ పల్సస్..నోయిడాలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. లక్నోలో జరుగుతున్న పెట్టుబడిదారుల సదస్సులో భాగంగా కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో గేదెల శ్రీనుబాబు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ ఒక్కరికి శాస్త్ర, ఆరోగ్య రక్షణకు సంబంధించిన సమాచారాన్ని ఉచితంగా అందుబాటులో తెచ్చే ఈ బృహత్తర ప్రాజెక్టుతో వెయ్యి మందికిపైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. వైద్యారోగ్య శాస్త్ర, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సమస్త సమాచారాన్ని ప్రాంతీయ భాషల్లోకి అనువదించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా వివరించారు. ఇప్పటి వరకు ఇంగ్లీష్‌కే పరిమితమైన సైంటిఫిక్, హెల్త్‌కేర్ ఇన్ఫర్మేషన్‌ను తెలుగుతోపాటు హిందీ, గుజరాతీ, తమిళం, బెంగాలీ భాషల్లో అందించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు.



ఆనంద్ మహీంద్రాతో శ్రీనుబాబు

మొండి బకాయే



కొఠారీ రుణంపై బీవోఐ, బీవోబీలు

2015-16లోనే నిరర్థక ఆస్తిగా మారిందని వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: రొటోమాక్ గ్రూప్ కంపెనీలకు రుణాలిచ్చిన బ్యాంకుల కూటమి (కన్సార్టియం)లో తామూ ఉన్నామని, 2015-16 ఆర్థిక సంవత్సరంలోనే తమ రుణాలు మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)గా మారాయని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థలైన బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ)లు తెలిపాయి. రొటోమాక్ రుణాల వ్యవహారంపై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇచ్చిన వివరణలో ఈ విషయాన్ని బ్యాంకులు పేర్కొన్నాయి. అయితే తామెంత రుణమిచ్చామన్నది మాత్రం బుధవారం స్టాక్ మార్కెట్లకు తెలిపిన వివరాల్లో బీవోఐ చెప్పలేదు. మంగళవారం బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లు ఇదే విషయంపై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే. రొటోమాక్ గ్లోబల్‌కు దాదాపు రూ.456.60 కోట్ల రుణం ఇచ్చినట్లు ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వెల్లడించింది. 2015 అక్టోబర్‌లో ఇది మొండి బకాయిగా మారిందని, 2016 అక్టోబర్‌లో డెట్ రికవరీ ట్రిబ్యునల్‌కు రుణ వసూలు ప్రక్రియ నిమిత్తం వెళ్లినట్లు తెలిపింది. సర్ఫేసీ చట్టం కింద కూడా చర్యలు చేపట్టినట్లు వివరించింది. మరోవైపు రొటోమాక్ తమకు రూ.516.79 కోట్లు బకాయిపడిందని అలహాబాద్ బ్యాంక్ చెప్పింది. రొటోమాక్ ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.43.09 కోట్లు, రొటోమాక్ గ్లోబల్ రూ.314.56 కోట్లు, రొటోమాక్ ఎక్స్‌పోర్ట్స్ రూ.159.14 కోట్లు ఇవ్వాల్సి ఉన్నట్లు వివరించింది. ఇందులో రొటోమాక్ గ్లోబల్, రొటోమాక్ ఎక్స్‌పోర్ట్స్ బకాయిలపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు గతేడాది సెప్టెంబర్ 20న వెళ్లినట్లు చెప్పింది. 2006 నుంచి ఈ సంస్థలు తమకు బాకీపడ్డారని స్పష్టం చేసింది.

కొఠారీని ప్రశ్నిస్తున్న సీబీఐ

రొటోమాక్ పెన్నుల యజమాని విక్రమ్ కొఠారీ, ఆయన కుమారుడు రాహుల్‌ని బుధవారం కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ప్రశ్నించింది. ఏడు జాతీయ బ్యాంకులకు రూ.3,695 కోట్ల రుణాల ఎగవేత ఆరోపణలపై ఇక్కడున్న సీబీఐ ప్రధాన కార్యాలయంలో వీరిరువురిని అధికారులు ప్రశ్నించారు. ఇంతకుముందు కాన్పూర్‌లో కొఠారీని సీబీఐ ప్రశ్నించిన విషయం తెలిసిందే. కాన్పూర్‌లోనే కొఠారీ కంపెనీ, నివాసాలున్నాయి. అయితే ఈసారి కొఠారీ, రాహుల్‌ను సీబీఐ.. ఢిల్లీకి పిలిపించి విచారణ జరుపడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కొఠారీ, ఆయన భార్య సాధన, కొడుకు రాహుల్‌లు రొటోమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లుగా ఉండగా, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల మొత్తాలను వీరు పక్కదారి పట్టించారని సీబీఐ అధికారులు చెబుతున్నారు. ఈ రుణాలు పొందినది.. వినియోగించినది వేర్వేరు అవసరాలకని అంటున్నారు. కాగా, రుణాలు ఎగవేసి దేశం విడిచి కొఠారీ పారిపోయే వీలుందంటూ బ్యాంక్ ఆఫ్ బరోడా సీబీఐని ఆశ్రయించడంతోనే ఆయనపై ఈ నెల 18న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇదే రోజున ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సైతం మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద రొటోమాక్, దాని ప్రమోటర్లపై నేరాలను నమోదు చేసింది. కొఠారీ, ఆయన కుటుంబ సభ్యులు దేశం విడిచి పారిపోకుండా మంగళవారం అన్ని భారతీయ విమానాశ్రయాలకు ముందస్తు హెచ్చరికలనూ ఈడీ జారీ చేసింది. అలాగే వివిధ పోర్టులకూ సమాచారమిచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్, కాన్పూర్ తదితర చోట్లా కొఠారీ ఆస్తులపై సోదాలు నిర్వహించింది. కాగా, తొలుత కొఠారీ బకాయిల విలువ రూ.800 కోట్లుగానే అంచనా వేసినప్పటికీ.. సీబీఐ దర్యాప్తు మొదలయ్యాక దాదాపు రూ.3,700 కోట్లకు పెరిగింది. అసలు రుణాల విలువ రూ.2,919 కోట్లుగా ఉంటే, వడ్డీ, ఇతరత్రా వాటితో ఇది రూ.3,695 కోట్లకు చేరిందని సీబీఐ చెబుతున్నది. బ్యాంక్ ఆఫ్ బరోడాతోపాటు బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌ల నుంచి కొఠారీ రుణాలు తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఈ కేసులో డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ కూడా విచారణ చేస్తున్నది.

కాన్పూర్, అహ్మదాబాద్‌ల్లో ఆస్తుల జప్తు

రొటోమాక్ బ్యాంక్ మోసం కేసులో ఆదాయం పన్ను (ఐటీ) శాఖ.. కాన్పూర్, అహ్మదాబాద్‌ల్లోని సంస్థ ఆస్తులను జప్తు చేసింది. పన్ను ఎగవేతల ఆరోపణలపై విచారణలో భాగంగా రొటోమాక్ గ్రూప్, దాని ప్రమోటర్లకు చెందిన నాలుగు స్థిరాస్తులను అటాచ్ చేసినట్లు బుధవారం ఐటీ శాఖ వెల్లడించింది. కాన్పూర్‌లో మూడు, అహ్మదాబాద్‌లో ఒక ఆస్తిని మంగళవారం సీజ్ చేసినట్లు వెల్లడించారు. రొటోమాక్ గ్రూప్ ఐటీ శాఖకు సుమారు రూ.85 కోట్ల మేర పన్ను బకాయి పడినట్లు అధికారులు చెప్పారు. మంగళవారమే ఐటీ శాఖ.. ఉత్తరప్రదేశ్‌లోని వివిధ బ్యాంకుల్లోగల రొటోమాక్, కొఠారీలకు చెందిన 14 ఖాతాలను అటాచ్ చేసిన విషయం తెలిసిందే.

ఇక జీతాలివ్వలేను

వేరే ఉద్యోగాలు చూసుకోండి! ▪ సిబ్బందికి నీరవ్ మోదీ లేఖ

న్యూఢిల్లీ/ముంబై, ఫిబ్రవరి 21:

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం నేపథ్యంలో వేరే ఉద్యోగాలు చూసుకోవాలంటూ తమ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందిని నీరవ్ మోదీ కోరాడు. తనకు చెందిన అన్ని సంస్థల్లోని స్టాక్‌ను దర్యాప్తు సంస్థలు సీజ్ చేశాయని, బ్యాంక్ ఖాతాలను ఆదాయం పన్ను (ఐటీ) శాఖ స్తంభింపజేసిందని, దీనివల్ల మీకిప్పుడు జీతాలు ఇవ్వలేనంటూ సిబ్బందికి ఓ ఈ-మెయిల్ సందేశాన్ని నీరవ్ పంపాడు. రూ.11,400 కోట్ల ఈ స్కాంలో వజ్రాల వ్యాపారి నీరవ్ ప్రధాన నిందితుడుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా ఉన్న నీరవ్ ఇండ్లు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలు విస్తృత తనిఖీలు చేపడుతున్నాయి. వజ్రాలు, బంగారు ఆభరణాలు, నగదు ఇతరత్రా విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేస్తున్నది. ఈ పరిస్థితుల్లోనే మంగళవారం నీరవ్ తమ సిబ్బందికి పైవిధంగా ఓ ఈ-మెయిల్ ఇచ్చాడు. 'సమీప భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొన్నది. మన సంస్థ ఇబ్బందుల్లో పడింది. ఫ్యాక్టరీలు, షోరూంలలోని స్టాక్ మొత్తాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంక్ అకౌంట్లను ఐటీ శాఖ స్తంభింపజేసింది. దీంతో మీ జీతాలను చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. అందుకే వేరే ఉద్యోగాలను చూసుకోవాలని చెబుతున్నాను. అయితే ఈ పరిస్థితులు చక్కబడితే తప్పక మీ బకాయిలను చెల్లిస్తాను. అంతా మంచే జరిగితే.. మనమంతా మళ్లీ కలిసి పనిచేస్తామని ఆశిస్తున్నాను.' అని నీరవ్ ఆ ఈ-మెయిల్‌లో సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నాడు. అంతేగాక మీడియా, రాజకీయ రంగాల అత్యుత్సాహం.. ఆక్షేపణీయమన్న నీరవ్.. వేగంగా మారుతున్న పరిణామాలపట్ల ఆందోళన వ్యక్తం చేశాడు. మరోవైపు ఈ-మెయిల్ విశ్వసించదగినదేనని నీరవ్ లీగల్ బృందంతో పనిచేస్తున్న వ్యక్తి ఒకరు అన్నారు. తన పాస్‌పోర్టును రద్దు చేసిన విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు, సీబీఐ, ఈడీలకూ మోదీ లేఖ రాయవచ్చన్న సంకేతాలనూ సదరు వ్యక్తి ఇచ్చారు. ఈ కేసులో నీరవ్ మోదీ, ఆయన భార్య అమీ, సోదరుడు నిషాల్ మోదీ, మేనమామ మెహుల్ చోక్సీలు నిందితులుగా ఉండగా, వీరంతా దేశం విడిచి జనవరిలోనే పారిపోయారు. జనవరి ఆఖర్లో సీబీఐకి పీఎన్‌బీ ఫిర్యాదు చేయగా, అప్పట్నుంచి ఇప్పటిదాకా నీరవ్ నుంచి వచ్చిన రెండో లేఖ ఇది. ఈ నెల 15న పీఎన్‌బీకి రాసిన ఓ లేఖలో బ్యాంక్ తీరు తనను బాధిస్తున్నదని, బకాయిలను చెల్లించడానికి ఉన్న అవకాశాల్ని చేజేతులారా పీఎన్‌బీ దూరం చేసుకున్నదన్న నీరవ్.. తాను బకాయిపడినది రూ.11,400 కోట్లు కాదని, చాలా తక్కువని అన్న విషయం తెలిసిందే. కాగా, ఈ కేసులో సీబీఐ పలువురిని అరెస్టు చేయగా, ఇందులో తన అకౌంటెంట్ హేమంత్ భట్ 64 ఏండ్ల వయసువారని, హృద్రోగి అని దాన్ని గమనించకుండా అరెస్టు చేశారంటూ నీరవ్ ఆరోపించాడు. నీరవ్, చోక్సీలకు చెందిన సంస్థల ఉద్యోగులను సీబీఐ అదుపులోకి తీసుకుంటుండగా, మంగళవారం మరో ఐదుగురిని అరెస్టు చేసిన సంగతి విదితమే. అంతకుముందు అరెస్టైన ముగ్గురికి సీబీఐ ప్రత్యేక కోర్టు.. మార్చి 3దాకా పోలీస్ కస్టడీ విధించింది. అలాగే బ్యాంక్ ప్రస్తుత, మాజీ అధికారుల అరెస్టులూ జరుగుతున్నాయి.



భువనేశ్వర్‌లో నిరవ్‌కు సంబంధించిన ఆభరణాల షోరూంలో ఈడీ అధికారుల సోదాలు

షెల్ కంపెనీలపై ఈడీ దాడులు

పీఎన్‌బీ కుంభకోణంలో నీరవ్ మోదీ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనిఖీలు కొనసాగుతున్నాయి. ఏడో రోజైన బుధవారం దేశవ్యాప్తంగా 17చోట్ల ఈడీ అధికారులు సోదాలను నిర్వహించారు. ఇప్పటిదాకా రూ.5,736 కోట్ల విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలు, విలువైన రాళ్లను సీజ్ చేశారు. బుధవారం ఒక్కరోజే రూ.10 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ సీజ్ చేసింది. మరోవైపు ఆదాయం పన్ను శాఖ ఈ కేసులో రూ.145 కోట్ల విలువైన ఆస్తులను జప్తుచేసింది. మొత్తం 141 బ్యాంక్ ఖాతాలను, రూ.145.74 కోట్ల విలువైన నీరవ్ మోదీ గ్రూపు ఫిక్స్‌డ్ డిపాజిట్లను అటాచ్ చేసుకున్నట్లు ఐటీ శాఖ వర్గాలు తెలిపాయి. ఇక పీఎన్‌బీ ఫిర్యాదుతో మనీలాండరింగ్ కేసును నమోదు చేసిన ఈడీ.. నీరవ్‌తోపాటు గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మెహుల్ చోక్సీ, ఇతరుల బోగస్ సంస్థలపైనా దృష్టి సారించింది. ఇందులోభాగంగానే ముంబైలోని నాలుగు షెల్ కంపెనీలపై బుధవారం దాడులు జరిగాయి. తూర్పు గుర్గావ్‌లోని పెడర్ రోడ్డులోగల ఒపెరా హౌజ్, ముంబైలోని పొవాయ్ ప్రాంతంలోని నాలుగు చోట్ల ఈడీ బృందాలు ఈ దాడుల్ని జరిపాయి. రూ.11,400 కోట్ల ఈ కుంభకోణంలో కనీసం 200 షెల్ కంపెనీల పాత్రైనా ఉండొచ్చన్న అనుమానాల్ని ఈడీ, ఐటీ శాఖలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ కేసులో నిందితుల అక్రమ సంపద ఎంతుంటుందన్న దానిపైనా అంచనాలు వేస్తున్నామని ఓ సీనియర్ అధికారి చెబుతుండగా, 2011 నుంచి పీఎన్‌బీ ఆడిట్ నివేదికల్ని రిజర్వ్ బ్యాంక్ నుంచి కోరుతున్నామని ఆయన చెప్పారు. కాగా, ఈ నెల 23న ఈ కేసు విచారణలో భాగంగా ముంబైలోని ఈడీ కార్యాలయానికి హాజరుకావాలంటూ నీరవ్, చోక్సీలకు ఈడీ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే.

నీరవ్ ఫామ్‌హౌజ్‌కు సీబీఐ సీల్



పీఎన్‌బీ కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు నీరవ్ మోదీకి చెందిన అలీబాగ్ ఫామ్‌హౌజ్‌ను సీబీఐ సీజ్ చేసింది. ముంబై సమీపంలోని ఈ లగ్జరీ ప్రాపర్టీకి బుధవారం సీల్ వేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. అరేబియా సముద్రానికి కూతవేటు దూరంలో ఒకటిన్నర ఎకరాల్లో విస్తరించిన ఈ ఫామ్‌హౌజ్‌ను 2004లో రూ.32 కోట్లకు నీరవ్ కొనుగోలు చేశాడు. ఈ ఫామ్‌హౌజ్ ప్రాంతంలో వ్యాపార, సినీవర్గాలే ఎక్కువగా నివాసముంటుండగా, ఇందులో 12,000 చదరపు అడుగుల్లో నిర్మించిన ఐదు పడక గదులున్న సుందరమైన భవంతి, ఓ భారీ స్విమ్మింగ్ పూల్, సినిమా థియేటర్, గ్రంథాలయం ఉన్నాయి. తన వద్దకు వచ్చే సంపన్న కస్టమర్ల ఆతిథ్యానికి నీరవ్ దీన్ని వినియోగించేవాడని సీబీఐ అధికారులు చెప్పారు. తాము స్వాధీనం చేసుకున్న పత్రాల ద్వారా ఈ ఫామ్‌హౌజ్‌ను గుర్తించామన్నారు. ఇదిలావుంటే నీరవ్‌కు అక్రమంగా రెండు పాస్‌పోర్టులున్నాయన్న సమాచారం తమకు లేదని చెప్పారు. ఈ కేసులో మంగళవారం అరెస్టు చేసిన విపుల్ అంబానీసహా ఆరుగుర్ని సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చగా, వారికి మార్చి 5దాకా కస్టడీ విధించారు.

త్వరలో బ్యాంకర్లతో ఆర్థిక శాఖ సమావేశం

త్వరలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)తోపాటు ఇతర బ్యాంకుల ఉన్నతాధికారులతో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సమావేశం కానున్నది. ఈ రూ.11,400 కోట్ల కుంభకోణంలో నీరవ్ మోదీ సంస్థలు.. పీఎన్‌బీకి చెందిన ముంబై బ్రాడీ హౌజ్ శాఖ నుంచి మోసపూరితంగా జారీ అయిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ లేదా అండర్‌స్టాండింగ్స్ (ఎల్‌వోయూ) ద్వారానే ఇతర దేశీయ బ్యాంకుల విదేశీ శాఖల నుంచి రుణాలను పొందాయన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పీఎన్‌బీకి, ఇతర బ్యాంకులకు మధ్య ఏర్పడిన చెల్లింపులుసహా వివిధ సమస్యలను సామరస్యపూర్వకంగా చర్చించడానికి ఆర్థిక మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగనుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. కాగా, తమ శాఖ ద్వారా జరిగిన ఈ మోసం వల్ల నష్టపోయిన ఇతర బ్యాంకులకు మొండి చెయ్యి చూపించాలనుకోవడం లేదని పీఎన్‌బీ ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ మరికొన్ని అంశాలు అపరిష్కృతంగా ఉండటంతో వీటిని పరిష్కరించడానికి ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం నడుం బిగించింది. ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ రెండు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయగా, అందులో మొత్తం 293 ఎల్‌వోయూలు, మరో 224 ఫారిన్ లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)లు జారీ అయినట్లు పీఎన్‌బీ పేర్కొన్నది. కాగా, ఎస్‌బీఐ, అలహాబాద్, యూనియన్ బ్యాంక్‌లకు ఈ ఎల్‌వోయూలతో రూ.5,000 కోట్లకుపైగా నష్టం వాటిల్లింది.

మూడు రోజుల నష్టాలకు తెర

- 141 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్

ముంబై, ఫిబ్రవరి 21: స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలకు తెరపడింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, చమురు రంగ షేర్ల నుంచి వచ్చిన మద్దతుతో వరుసగా మూడు రోజులుగా దిగువముఖం పట్టిన సూచీలు ఎట్టకేలకు లాభాల్లో ముగిశాయి. పీఎన్‌బీ కుంభకోణం బయట పడిన నాటి నుంచి కుదుపునకు గురైన బ్యాంకింగ్ రంగ సూచీ తొలిసారిగా లాభాల్లోకి వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు దిగువముఖం పట్టడం, ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల వార్తలు ఇందుకు దోహదం చేశాయి. ఒకదశలో 33,911.36 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సూచీ చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే 141.27 పెరిగి 33,844.86 వద్ద స్థిరపడింది. గడిచిన మూడు సెషన్లలో సూచీ 593.88 పాయింట్లు కోల్పోయింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 37.05 పాయింట్లు తగ్గి 10,397.45 వద్ద ముగిసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఐటీ పరిశ్రమ రెండంకెల స్థాయిలో వృద్ధిని కనబరుచనున్నదని నాస్కాం అంచనాతో ఈ రంగ షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఆసక్తి చూపారు. ఫలితంగా ఈ రంగ సూచీ నాలుగు శాతానికి పైగా లాభపడింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీ 3.88 శాతం, టెక్ మహీంద్రా 3.73 శాతం, టీసీఎస్ 3.33 శాతం లాభపడ్డాయి. అలాగే ఐటీసీ, ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, ఆర్ఐఎల్, కొటక్ బ్యాంక్, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, విప్రో, డాక్టర్ రెడ్డీస్, కోల్ ఇండియాలు ఒక శాతంకు పైగా మార్కెట్ వాటాను పెంచుకున్నాయి. కానీ, సన్‌ఫార్మా, ఇండస్ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, టాటా మోటార్స్, బజాజ్ ఆటో, ఎన్‌టీపీసీ, ఎల్ అండ్ టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌యూఎల్, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రాలు నష్టపోయాయి.



ఉచితంగా మహీంద్రా సర్వీస్ క్యాంప్

ముంబై, ఫిబ్రవరి 21: దేశవ్యాప్తంగా మెగా సర్వీస్ క్యాంప్‌ను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా ప్రకటించింది. 'ఎం-ప్లస్' పేరుతో నిర్వహిస్తున్న ఈ సర్వీస్ క్యాంప్ ఈ నెల 27 వరకు అందుబాటులో ఉండనున్నది. ఈ క్యాంప్‌లోభాగంగా కంపెనీకి చెందిన బొలేరో, స్కార్పియో, ఎక్స్‌యూవీ500, టీయూవీ300, కూయూవీ100, రెక్స్టాన్, థార్, గ్జైలో, వెరిటో, వెరిటో వైబ్, లోగన్ వంటి మోడళ్లను దేశీయంగా ఉన్న 350 వర్క్‌షాప్‌లలో ఉచితంగా సర్వీసింగ్ చేసి ఇవ్వనున్నట్లు కంపెనీ చీఫ్ మార్కెటింగ్ అధికారి రామ్ నక్రా తెలిపారు. అలాగే విడిభాగాలపై రాయితీ ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందుకోసం 1800-209-6006కి ఫోన్ చేసి ముందస్తు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని కంపెనీ సూచించింది.

3,872 కోట్ల బ్యాంక్ మోసం కేసు

మరో రూ.100 కోట్ల ఆర్ఈఐ అగ్రో ఆస్తుల జప్తు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఆర్ఈఐ అగ్రో లిమిటెడ్‌కు చెందిన రూ.100 కోట్లకుపైగా విలువైన ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం జప్తు చేసింది. రూ.3,871.71 కోట్ల బ్యాంక్ మోసం కేసులో భాగంగానే బాస్మతి బియ్యాన్ని శుద్ధిచేసే ఈ సంస్థకు చెందిన రూ.100.23 కోట్ల ఆస్తుల్ని ఈడీ సీజ్ చేసింది. తాజా అటాచ్‌మెంట్‌తో ఈ కేసులో ఈడీ స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల విలువ రూ.511.47 కోట్లకు చేరింది. 2016లో ఆర్ఈఐ అగ్రో లిమిటెడ్‌పై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఆర్ఈఐ అగ్రో, దాని డైరెక్టర్లు సందీప్ ఝున్‌ఝున్‌వాలా, సంజయ్ ఝున్‌ఝున్‌వాలా, ఇతరులు యూకో బ్యాంక్ నేతృత్వంలోని 14 బ్యాంకుల కూటమి (కన్సార్టియం) నుంచి రుణాలు పొందారు. 2013 నుంచి బ్యాంకర్లను మోసం చేస్తూ వస్తున్నారని, బకాయిల విలువ రూ.3,871.71 కోట్లుగా ఉందని ఈడీ తెలిపింది. బాస్మతి రైస్ ప్రాసెసింగ్‌లో ఆర్ఈఐ అగ్రో ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా ఉన్నది.



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మాట్లాడుతున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

పోలీస్‌శాఖలో 28వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

- హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

జహీరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడేందుకు కొత్తగా 28 వేల ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన వెంటనే పోలీసు వ్యవస్థల్లో మార్పులు తీసుకొచ్చి, శాంతి భద్రతలు కాపాడేందుకు కృషి చేశామన్నారు. శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జేసీ వాసం వెంకటేశ్వర్లు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే సంజీవ్‌రావు, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్, జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి తదితరులున్నారు.

నిర్మల్‌లో 'ఈఎస్‌ఐ' ఏర్పాటు చేయండి

కేంద్ర కార్మికశాఖ మంత్రికి మంత్రి అల్లోల వినతి

నిర్మల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ : నిర్మల్ జిల్లా కేంద్రంలో 50 పడకల ఈఎస్‌ఐ దవాఖానను ఏర్పాటు చేయాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్‌ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. బుధవారం ఢిల్లీలోని శ్రమశక్తి భవన్ కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందించారు. నిర్మల్‌లో ఈఎస్‌ఐ దవాఖాన ఏర్పాటుకు అవసరమైన పాత ఏరియా దవఖాన భవనాన్ని అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసిందనీ, ఈ భవనంలో ఈఎస్‌ఐ దవఖాన ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని అల్లోల వివరించారు. దవాఖాన ఏర్పాటుతో జిల్లాతో పాటు ఇతర సరిహద్దు జిల్లాల బీడీ కార్మికులకు వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు.



కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్‌ని కలిసిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	37.2	13.8
మేడ్చల్	35.7	14.0
మహబూబ్‌నగర్	37.0	14.0
వికారాబాద్	37.3	14.2
నాగర్‌కర్నూల్	37.2	14.5
యాదాద్రి భువనగిరి	37.2	15.5
నల్లగొండ	37.2	15.7
కామారెడ్డి	36.0	15.8
సిద్దిపేట	37.1	15.8
జనగామ	37.2	16.0
జోగుళాంబ గద్వాల	37.3	16.3
రాజన్న సిరిసిల్ల	37.2	16.4
సంగారెడ్డి	36.5	16.6
మెదక్	37.2	16.6
నిర్మల్	37.3	17.0
భద్రాద్రి కొత్తగూడెం	37.3	17.0
కుమ్రంభీం ఆసిఫాబాద్	37.3	17.1
వరంగల్ రూరల్	37.3	17.2
ఖమ్మం	37.4	17.2
నిజామాబాద్	37.2	17.3
మహబూబాబాద్	37.2	17.4
వనపర్తి	37.1	17.5
కరీంనగర్	37.4	17.7
మంచిర్యాల	37.2	17.7
హైదరాబాద్	37.2	17.8
జగిత్యాల	37.2	17.9
జయశంకర్ భూపాలపల్లి	37.4	17.9
పెద్దపల్లి	37.2	18.1
సూర్యాపేట	37.2	18.4
వరంగల్ అర్బన్	36.5	18.7
ఆదిలాబాద్	35.7	19.0



బుధవారం మంత్రి ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

జీపీఎఫ్ అమలుచేయండి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: 1999-2004 మధ్యకాలంలో నియమితులైన 4,700 మంది విద్యుత్ ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపజేయాలని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. బుధవారం ఆయన నివాసంలో కలిసి ఈటలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని కలిసి విభజన అంశంపై వివరించారు. కార్యక్రమంలో నాయకులు రత్నాకర్‌రావు, సదానందం, కిరణ్‌కుమార్, ప్రశాంత్, సురేశ్ బాబు, వెంకటేశ్, భానుప్రకాశ్, తులసి, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల చరిత్ర రచనకు శ్రీకారం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: భాషోద్యమానికి, తెలంగాణ సాయుధ పోరాటానికి, సారస్వతాభివృద్ధికి, భాష, సాహిత్యగ్రంథాల పరిరక్షణకు పాటుపడిన అలనాటి గ్రంథాలయాల చరిత్రను రేపటితరాలకు అందించడానికి తెలంగాణ గ్రంథాలయ పరిషత్ సంకల్పించింది. తెలంగాణలో వందేండ్లకు పూర్వం స్థాపించిన గ్రంథాలయాల చరిత్ర రచన కోసం ఆయా గ్రంథాలయాల వివరాలను కోరుతూ బుధవారం ఒక ప్రకటన విడుదలచేసింది. 2017 నాటికి వందేండ్లు పూర్తిచేసుకున్న 28 గ్రంథాలయాల జాబితాను రూపొందించామని, ఇవి కాకుండా ఇంకేమైనా ఉంటే వివరాలను పంపించాలని గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అయాచితం శ్రీధర్ కోరారు. ఈ జాబితాలో చేర్చదగిన గ్రంథాలయాల వివరాలు, లేదా కొత్త గ్రంథాలయాల వివరాలను sreedhar. ayachitam<\@>gmail.comకు మెయిల్ చేయాలని, ఇతర సమాచారం కోసం 040 2461 3238, 040 2750 2160 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. వందేండ్లనాటి గ్రంథాలయాల పేర్ల జాబితాను ఆయన విడుదలచేశారు.

మైనారిటీ అభ్యర్థులకు 9 నుంచి ఉచిత శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీసీ, ఎస్సీ సంక్షేమశాఖల హాస్టళ్లలో హాస్టల్ సంక్షేమ అధికారి పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నిర్వహించే పరీక్ష కోసం మైనారిటీ ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, క్రైస్తవ అభ్యర్థులకు మార్చి తొమ్మిది నుంచి ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని మైనారిటీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌ఏ షుకూర్ తెలిపారు.

ఆర్టీసీ ఈడీగా వెంకటేశ్వర్‌రావు బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ)గా, సంస్థ కార్యదర్శిగా ఎం వెంకటేశ్వర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో పనిచేసిన వేణు పదవీ విరమణ పొందగా, హైదరాబాద్ రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్‌రావు పదోన్నతిపై నియమితులయ్యారు. బస్‌భవన్‌లోని తన చాంబర్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. టీఎస్‌ఆర్టీసీ ఈడీలు రవీందర్ (ఇంజినీరింగ్), సత్యనారాయణ (అడ్మినిస్ట్రేషన్, ఆపరేషన్స్), సంస్థ సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్, ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జీఆర్ కిరణ్ వెంకటేశ్వర్‌రావుకు అభినందనలు తెలిపారు. టీఎస్‌ఆర్టీసీ ఎండీతో భేటీ అయ్యారు.

బిల్డర్‌కు లక్ష జరిమానా విధించిన హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గతంలో జారీచేసిన ఉత్తర్వులను ఉల్లంఘించి భవన అక్రమ నిర్మాణం చేపట్టిన నగరానికి చెందిన ఓ బిల్డర్‌కు రూ. లక్ష జరిమానాను ఉమ్మడి హైకోర్టు బుధవారం విధించింది. హైదరాబాద్ టోలిచౌకిలోని అంజయ్యనగర్‌లో అనుమతుల్లేకుండా సయ్యద్ మొయినుద్దీన్ సెల్లార్, ఐదంతస్తుల భవన నిర్మాణం చేపట్టాడు. ఈ వ్యవహారం హైకోర్టుకు చేరింది. ఆ తర్వాత 1,152 చదరపు అడుగుల్లో నిర్మించేందుకు అనుమతికి దరఖాస్తు చేసుకుని, 15,171 చదరపు అడుగుల్లో నిర్మించిన విషయాన్ని జీహెచ్‌ఎంసీ.. హైకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. దీంతో న్యాయస్థానం మొయినుద్దీన్‌కు రూ.లక్ష జరిమానా విధించింది. అక్రమ నిర్మాణాలను కూల్చివేసే అధికార పరిధిని ఉపయోగించి చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీని ఆదేశించింది.

పురుషోత్తంరెడ్డి బావమరిది అరెస్టు

హైదరాబాద్/అమీర్‌పేట్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో 20 రోజులుగా అజ్ఞాతంలో ఉన్న హెచ్‌ఎండీఏ మాజీ అధికారి పురుషోత్తంరెడ్డి బావమరిది శ్రీనివాస్‌రెడ్డిని ఏసీబీ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సార్‌నగర్‌లోని తన ఇంటికి శ్రీనివాస్‌రెడ్డి లాయర్‌తో కలిసి వచ్చాడు. అప్పటికే అక్కడ వేచిఉన్న ఏసీబీ అధికారులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గతంలో సీజ్‌చేసిన ఇంటిని అతడితోనే తెరిపించిన అధికారులు ఏసీబీ డీఎస్పీ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో సోదాలు చేశారు. శ్రీనివాస్‌రెడ్డి ముందస్తుగానే జాగ్రత్తపడడంతో కేసుకు సంబంధించి కీలక డాక్యుమెంట్లు లభించలేదని తెలుస్తున్నది. ఈ కేసులో ప్రధాన నిందితుడు పురుషోత్తంరెడ్డి కస్టడీ కోరుతూ ఏసీబీ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం కోర్టులో వాదనలు ముగిశాయి. న్యాయస్థానం నిర్ణయాన్ని గురువారం వెల్లడించనుంది. పురుషోత్తంరెడ్డి ఇద్దరు బినామీలు యాదవరెడ్డి, నిశాంత్‌రెడ్డిల కస్టడీ ముగియడంతో బుధవారం వారిని రిమాండ్‌కు తరలించారు.

తిరుమలలో అన్యమత ఉద్యోగుల ఉద్వాసనకు బ్రేక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పరిధిలోని వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న హిందూయేతర ఉద్యోగులను తదుపరి ఆదేశాలు జారీచేసేవరకు తొలిగించవద్దని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఉద్యోగం కొనసాగింపుపై జారీచేసిన షోకాజ్ నోటీసులపై టీటీడీకి సంజాయిషీ ఇవ్వాల్సిన బాధ్యత నోటీసులు అందుకున్న హిందూయేతర ఉద్యోగులపై ఉంటుందని న్యాయస్థానం స్పష్టంచేసింది. హిందూయేతరులు సంస్థ పరిధిలోని ఆలయాల్లో పనిచేయడానికి వీల్లేదనే అన్యమత ఉద్యోగులకు టీటీడీ షోకాజ్ నోటీసులు జారీచేసింది. దీన్ని సవాల్ చేస్తూ ముస్లిం, క్రిస్టియన్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించగా.. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది.

పోలవరం కాంక్రీట్ పనులకు 1244 కోట్లు

హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ: పోలవరం ప్రాజెక్టు కాంక్రీట్ పనులు చేపట్టిన నవయుగ సంస్థకు రూ.1244 కోట్ల పరిపాలనా ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక విడుత కరువు భత్యం ఇస్తామని ప్రకటించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశ వివరాలను రాష్ట్ర మంత్రి కాల్వ శ్రీనివాసులు మీడియాకు వెల్లడించారు. మార్చి 5న బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ ప్రసంగం, 8న బడ్జెట్ ప్రవేశపెడుతారని చెప్పారు.

ఎర్రజొన్న రైతుకు సర్కార్

వంద కోట్ల అండ

నాడు రూ.12 కోట్ల బకాయిల చెల్లింపు

నేడు మద్దతు ధరతో రైతులకు రూ.89 కోట్ల లబ్ధి

హర్షం వ్యక్తం చేస్తున్న ఇందూరు రైతాంగం

నిజామాబాద్/నమస్తే తెలంగాణ ప్రతినిధి:

తెలంగాణ ప్రభుత్వం ఎర్రజొన్న రైతులకు అండగా నిలిచింది. ఉద్యమ సమయంలో అధినేత కేసీఆర్ ఇచ్చిన హామీకి కట్టుబడి రాష్ట్రం ఏర్పడగానే సీఎం హోదాలో పెండింగ్ బకాయిలు రూ.12 కోట్లు చెల్లించారు. ఎక్కడలేని విధంగా ఎర్రజొన్న రైతులకు రూ.89 కోట్ల మేర లబ్ధి చేకూరుస్తున్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి దాకా ఎర్రజొన్న రైతులకు సర్కార్ రూ.వంద కోట్ల మేర లబ్ధి చేకూర్చి, అండగా నిలిచింది. 11 కోట్ల బకాయిలు చెల్లించమంటే, రైతులపై కాల్పులు జరిపిన కాంగ్రెస్ పాలనను చూసిన రైతులు.. ఎర్రజొన్న రైతుల కోసం వందకోట్ల రూపాయలు వెచ్చించిన సీఎం కేసీఆర్‌ను కొనియాడుతున్నారు. ఎర్రజొన్న పంట నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్‌లో అత్యధికంగా సాగవుతుండగా.. నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో స్వల్పంగా సాగవుతున్నది. కర్నాటకలోని బళ్లారిలో అధికంగానే సాగు చేస్తారు. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు, పలు దేశాలకు ఎర్రజొన్న ఎగుమతికి డిమాండ్ పెరుగుతుండటంతో క్రమంగా రైతులకు కూడా గిట్టుబాటు ధర దక్కేది. దీంతో ఆర్మూర్, బాల్కొండ రూరల్ ప్రాంతాల్లో సాగు పెరుగుతూ వచ్చింది. క్రమంగా ఉత్పత్తి పెరుగడంతో ఎర్రజొన్నకు డిమాండ్ తగ్గింది. వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో రైతులకు ఆశించిన ధర దక్కలేదు. దీంతో రైతులు ఆందోళన బాటపట్టారు. నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో అప్పటిప్రభుత్వం రైతులపై కాల్పులు జరిపింది. నిరసనలకు మద్దతు తెలిపిన సీఎం కేసీఆర్ ఎర్రజొన్నరైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మద్దతు ధరపై దృష్టి సారించారు. ఎంపీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్దన్ విజ్ఞప్తి మేరకు 2014లో రూ.12 కోట్ల బకాయిలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సంవత్సరం మార్కెట్ పరిస్థితులు, వ్యాపారుల వైఖరి మూలంగా మళ్లీ ధర తగ్గింది. వ్యాపారులు కేవలం రూ.15 వందలు మాత్రమే ఇవ్వనున్నారని తెలుసుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు సీఎంకు వివరించడంతో రూ.89 కోట్లతో భరోసా కల్పించారు. నిజామాబాద్ జిల్లాలో 85 వేల 726 టన్నులు, జగిత్యాల జిల్లాలో 680 టన్నులు, నిర్మల్ జిల్లాలో 693 టన్నుల ఎర్రజొన్నను కొనుగోలు ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. ఈ ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనేందుకు ఎర్రజొన్న రైతుల కోసం రూ.89 కోట్ల,71 లక్షలు ఖర్చు చేస్తున్నది. ఈలెక్కన ఇప్పుడు రూ.89 కోట్లు, నాడు బకాయిల కోసం రూ.12 కోట్లు కలుపుకొని కేవలం ఎర్రజొన్న రైతుల కోసమే రూ.101 కోట్లతో అండగా నిలిచిందని రైతులు గుర్తుచేసుకుంటున్నారు.



నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో రైతులతో కిటకిటలాడుతున్న కొనుగోలు కేంద్రం

కేసీఆర్ అండగా ఉంటున్నారు..



ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరతో నేను సంతృప్తిగా ఉన్నాను. గతంలో ఎర్ర జొన్న బకాయిలు ఇచ్చి, ఇప్పుడు మద్దతు ధర ఇచ్చి, కడ్తా లేకుండా కొంటున్నారు. ఇదంతా ఎర్రజొన్న రైతుకు ఎంతో మేలు చేస్తున్నది.

- భూమన్న,రైతు,కమ్మర్‌పల్లి

ప్రభుత్వంపై విశ్వాసం రెట్టింపైంది



గతంలో ప్రభుత్వం రూ.12 కోట్లు బకాయిలు ఇచ్చిన విషయాన్ని ఎర్ర జొన్న రైతులు మరువలేదు.ఇప్పుడు రూ.89 కోట్లు వ్యయం చేస్తుండడం టిఆర్‌ఎస్ ప్రభుత్వంపై రైతుల్లో విశ్వాసం రెట్టింపైంది.

- పన్నాల గంగారెడ్డి, రైతు, కమ్మర్‌పల్లి

కువైట్ నుంచి స్వదేశానికి..

జాగృతి సహాయంతో స్వస్థలానికి క్షమాభిక్ష బాధితులు

నిజామాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ : కువైట్ ఆమ్నెస్టీ(క్షమాభిక్ష)బాధితులు ఏడేండ్ల తర్వాత జాగృతి సహాయంతో స్వదేశానికి చేరారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్ చేరుకున్నారు. మొదటి బృందంలో తొమ్మిది మంది రాగా, వీరికి శంషాబాద్ విమానాశ్రయంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌ఆచారి, జాగృతి యువత అధ్యక్షుడు కొరబోయిన విజయ్, ఇతర జా గృతి నాయకులు స్వాగతం పలికారు. కువైట్ నుంచి వచ్చిన వారు తమ చేదు అనుభవాలను మీడియాకు వివరించారు. ఎంపీ కవితకు కృతజ్ఞతలు తెలిపారు. వీరిని ఇండియాకు రప్పించడంలో జాగృతి అధ్యక్షుడు నవీనాచారి, కువైట్ జాగృతి అధ్యక్షుడు వినయ్‌కుమార్, గంగాధర్, అభిలాష, విస్‌డమ్ ఆచారి క్రియాశీలకంగా వ్యవహరించారు. మిగిలిన వారెవరైనా ఉంటే, తమను సంప్రదించాలని నవీనాచారి సూచించారు. ఎంపీ కవిత ఆదేశాల మేరకు అర్హులైన వారందరిని రప్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.



బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఎదుట కువైట్ బాధితులకు స్వాగతం పలుకుతున్న జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి

స్వదేశానికి చేరింది వీరే..

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం సంపల్లి తండా ప్రకాశ్, గుగులోత్ దేవీదాస్, సాంపల్లికి చెందిన అంతిరెడ్డి రాజు, జక్రాన్‌పల్లి తాండకు చెందిన ఎం రవికుమార్, తొర్లికొండ గ్రామానికి చెందిన అనుకుమార్, ధర్పల్లి మండలం సీతాయిపేట్ తండాకు చెందిన జెత్యా, హొన్నాజిపేట్‌కు చెందిన పీ రంజిత్, సిరికొండ మండలం కొండాపూర్‌కు చెందిన ఏ శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గిద్దకు చెందిన మహిపాల్ ఉన్నారు.



కరీంనగర్ జిల్లా దేవంపల్లిలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకృష్ణ



నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరులో ఎమ్మెల్యే గువ్వల సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

కొనసాగుతున్న చేరికలు

నెట్‌వర్క్: వివిధ పార్టీల నుంచి టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్, బల్మూర్ మండలాల కాంగ్రెస్ నాయకులు దాదాపు 60 మంది ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మానకొండూర్ మండలం దేవంపల్లి గ్రామ సర్పంచ్ గాడిచర్ల కొమురయ్యతో పాటు మరో 200 మంది కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. తిమ్మాపూర్ మండలం అల్గునూర్‌లోని నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ జెడ్పీ సభ్యుడు ఎడ్ల సుగుణాకర్, ఎంపీపీ మాతంగి లింగయ్య, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరెల్లి నగేశ్, టీఆర్‌ఎస్ నాయకుడు జీవీ రామకృష్ణారావు, పాల్గొన్నారు.

ఆస్తికోసం తల్లీ, చెల్లి వెలి

- పాల్వంచలో ఓ అన్న నిర్వాకం

పాల్వంచ రూరల్: ఆస్తి కోసం ఓ కొడుకు కన్నతల్లి, చెల్లిని ఇంటి నుండి గెంటేశాడు. దీంతో దిక్కుతోచని ఆ అభాగ్యులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని బొల్లోరిగూడానికి చెందిన నల్లపు పిచ్చయ్య-దేవకర్ణకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు. పిచ్చయ్య 70 ఏండ్ల క్రితం రెండువందల గజాల స్థలాన్ని కొన్నాడు. పెద్దకుమారుడు వెంకటేశ్వర్లు కేటీపీఎస్ ఓఅండ్‌ఎంలో పర్మినెంటు కార్మికుడిగా పనిచేస్తూ తండ్రి నిర్మించిన ఇంట్లో ఉంటుండగా, పెళ్లికావాల్సిన చెల్లి, తల్లి వెనుక గుడిసెలో ఉంటున్నారు. తండ్రి చనిపోయిన తర్వాత వెంకటేశ్వర్లు తల్లికి తెలియకుండా ఇంటి స్థలాన్ని తన భార్య పేరిట చేయించుకున్నాడు. కూతురు సరితకు పెండ్లి సంబంధాలు వస్తుండటంతో దేవకర్ణ ఇంటి స్థలం అమ్మి పెండ్లి చేద్దామని చెప్పగా, తల్లి, కొడుకుల మధ్య ఘర్షణలు మొదల య్యాయి. తనకు ఇల్లు ఇచ్చినట్లు రాసిస్తే పెళ్లికి రూ. లక్ష ఇస్తానని వెంకటేశ్వర్లు చెప్పాడు. ఘర్షణలు భరించలేక దేవకర్ణ కూతురితో మూడు నెలలుగా బంధువుల ఇండ్లల్లో ఉంటూ మంగళవారం వెంకటేశ్వర్లు ఇంటికి రాగా, వారిని బయటికి గెంటేశాడు. ఇంటికి తాళం వేసి, భార్యతో వెళ్లిపోయాడు. ఈ విషయం గురించి స్థానికులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



నాయ్యం చేయాలని వేడుకుంటున్న తల్లి,కూతురు

నేడు ఉచిత వైద్య పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మాజీ సైనికుల కుటుంబాల కోసం రాష్ట్రంలో పలుచోట్ల గురువారం ఉచితంగా వైద్యపరీక్షలు చేయనున్నారు. వరంగల్(అర్బన్)లోని విట్స్‌లో సైనిక వెల్ఫేర్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తారు. సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో వరంగల్(రూరల్), జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లిలో క్యాంపులు నిర్వహించనున్నారు.

ఎన్టీపీసీకి హీట్ రేట్ ట్రోఫీ రన్నరప్ అవార్డు

జ్యోతినగర్: రామగుండం ఎన్టీపీసీకి జాతీయ అవార్డు దక్కింది. భూగర్భ ఉష్ణోగ్రతల శాతాన్ని తగ్గించినందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. ఈ నెల 15న జరిగిన ఢిల్లీలో ఇంటర్నేషనల్ పవర్‌ప్లాంట్ సదస్సులో 2016-17 ఏడాదికి హీట్ రేట్ ట్రోఫీ రన్నరప్ అవార్డును ప్రదానంచేశారు. ఎన్టీపీసీ డైరెక్టర్ కమర్షియల్ ఏకే గుప్తా, ఎన్టీపీసీ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ ఎస్కే రాయ్ చేతుల మీదుగా రామగుండం ఈడీ కే దూబే, డీజీఎం మనోజ్ అందుకున్నారు.



ఢిల్లీలో రన్నరప్ పురస్కారాన్ని అందుకుంటున్న రామగుండం ప్రాజెక్టు ఈడీ

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కావేరమ్మపేటలోని కమ్యూనిటీహాల్‌లో బుధవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



నీటిగుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

సిరికొండ: ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం ముత్యంపేట్‌లో నీటిగుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. ముత్యంపేట్‌లో మంగళవారం ఓ కార్యం జరుగగా, అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములు కనక లచ్చు, కనక సుదర్శన్ కుటుంబ సమేతంగా వచ్చారు. భోజనాల అనంతరం లచ్చు కూతురు పరమేశ్వరి(5), సుదర్శన్ కూతురు పుష్ప(6) బహిర్భూమికని గ్రామ సమీపంలోకి వెళ్లి, నీటిగుంతలో కాలుజారి పడిపోయారు. సాయంత్రం దాకా చిన్నారులు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఉదయం బహిర్భూమికి వెళ్లిన గ్రామస్థులకు నీటిగుంతలో పిల్లల శవాలు కనిపించగా, పోలీసులకు సమాచారం అందించారు.

ఈతకెళ్లి ముగ్గురు విద్యార్థుల దుర్మరణం

శాయంపేట: వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం మాందారిపేటలో బుధవారం పెండ్లికొచ్చిన ముగ్గురు విద్యార్థులు ఈతకెళ్లి మృతి చెందారు. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్ అర్బన్ జిల్లా కొత్తవాడకు చెందిన ఆలేటి సునీల్(21), దేవలపల్లి వంశీ(17), రంగుసాయికృష్ణ(17) ముగ్గురు స్నేహితులు. సునీల్ నర్సంపేట బిట్స్‌లో, వంశీ అర్బన్ జిల్లా భద్రకాళి జూనియర్ కాలేజీలో, సాయికృష్ణ బిట్స్ కళాశాలలో చదువుతున్నారు. ముగ్గురు స్నేహితులతో పాటు మరో నలుగురు బుధవారం మాందారిపేటలో జరిగిన వివాహానికి హాజరయ్యారు. అనంతరం వీరంతా మాందారిపేట శివారు గోగుకుంటలో ఈతకొట్టేందుకు వెళ్లారు. ముందుగా వంశీ చెరువులోకి దిగి, మునిపోతుండగా, అతన్ని కాపాడేందుకు సునీల్ దిగాడు. అతనూ మునిగిపోతుండటంతో సాయికృష్ణ కూడా దిగి, అందులోనే మునిగిపోయాడు. తోటి స్నేహితులు విషయాన్ని బంధువులకు చేరవేశారు. పరకాల ఏసీపీ వైవీఎస్. సుధీంద్ర ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పరకాలకు తరలించారు.

విరాట్ గ్రేట్ కెప్టెన్



న్యూఢిల్లీ: గత 25 ఏండ్లలో ఏ కెప్టెన్ సాధించని ఘనతలను విరాట్ అందుకున్నాడని మాజీ సారథి సౌరవ్ గంగూలీ ప్రశంసలు కురిపించాడు. అద్భుతమైన సక్సెస్ రేట్‌తో దూసుకెళ్తున్నాడని కితాబిచ్చాడు. 'సచిన్, ద్రవిడ్, నా కంటే విరాట్ గొప్ప కెప్టెన్. మేం సాధించిన విజయాలకంటే అతను అందుకున్న ఘనతలు ఎక్కువ. భారత క్రికెట్‌కు అతను ఫ్లాగ్ బేరర్. విరాట్ బ్యాటింగ్, కెప్టెన్సీలో చాలా నిలకడ ఉంది' అని దాదా పేర్కొన్నాడు. రాబోయే ఇంగ్లండ్, ఆసీస్ పర్యటనలు విరాట్ సత్తాకు అసలు సిసలు పరీక్ష అన్నాడు.

హైదరాబాద్ ఔట్

క్వార్టర్స్‌లో కర్ణాటక చేతిలో ఓటమి ● విజయ్ హజారే ట్రోఫీ

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ పోరా టం ముగిసింది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్ 103 పరుగుల తేడాతో కర్ణాటక చేతిలో ఘో రంగా ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. కర్ణాటక నిర్దేశించిన 348 పరుగుల లక్ష్యఛేదనలో హైదరాబాద్ 42.5 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. శ్రేయాస్ గోపాల్(5/31) హైదరాబాద్ పతనాన్ని శాసించాడు. భారీ లక్ష్యఛేదనలో 19 పరుగులకే అక్షత్‌రెడ్డి(10) వికెట్ చేజార్చుకున్న హైదరాబాద్ జట్టులో కెప్టెన్ రాయుడు(64), రవితేజ(53) అర్ధసెంచరీలతో రాణించారు. 35 ఓవర్లకు 202/3 స్కోరుతో మెరుగైన స్థితిలో కనిపించిన రాయుడుసేన..42 పరుగుల తేడాతో ఆఖరి ఏడు వికెట్లు చేజార్చుకుంది. స్టువర్ట్ బిన్నీ(3/45) మూడు వికెట్లు తీశాడు. తొలుత మయాంక్ అగర్వాల్(140), రవికుమార్ సమర్థ్ (125) సెంచరీలతో కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లలో 347/8 స్కోరు చేసింది. అగర్వాల్‌ల తన ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో ఎనిమిదో సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. మరో క్వార్టర్స్‌లో మహారాష్ట్ర 7 వికెట్ల తేడాతో ముంబైపై గెలిచింది. తొలి సెమీస్‌లో కర్ణాటక, మహారాష్ట్ర తలపడుతాయి.

'ముక్కోణపు టీ20 విజేత' ఆస్ట్రేలియా

■ ఫైనల్లో కివీస్‌పై గెలుపు



ఆక్లాండ్: లీగ్ దశలో వరుస విజయాలతో హోరెత్తించిన ఆస్ట్రేలియా.. ముక్కోణపు టీ20 సిరీస్ ఫైనల్లోనూ చెలరేగిపోయింది. బుధవారం జరిగిన టైటిల్ పోరులో 19 పరుగుల తేడా (డక్‌వర్త్ లూయిస్ పద్ధతి)తో న్యూజిలాండ్‌పై గెలిచింది. పలుమార్లు వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో.. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 150 పరుగులు చేసింది. టేలర్ (43), మున్రో (14 బంతుల్లో 29) రాణించారు. లక్ష్య ఛేదనలో షార్ట్ (30 బంతుల్లో 50; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) దుమ్మురేపడంతో ఆస్ట్రేలియా 14.4 ఓవర్లలో 3 వికెట్లకు 121 పరుగులు చేసింది. ఈ దశలో భారీ వర్షం రావడంతో మ్యాచ్‌ను నిలిపి వేశారు. వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేసి ఆసీస్‌ను విజేతగా ప్రకటించారు. ఎగర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', మ్యాక్స్‌వెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

సఫారీ టూర్‌కు ఆసీస్ జట్టు

గురువారం దక్షిణాఫ్రికా-ఎతో జరిగే ప్రాక్టీస్ మ్యాచ్‌కు ఆస్ట్రేలియా జట్టును ప్రకటించారు. స్మిత్ (కెప్టెన్), ఖవాజా, హ్యాండ్స్‌కోంబ్, షాన్ మార్ష్, మిచెల్ మార్ష్, టిమ్ పైనీ, కమిన్స్, స్టార్క్, లియోన్, హాజెల్‌వుడ్, బాంక్రాఫ్ట్.



అమెరికాలోని డల్లాస్ నగరంలో జరిగిన ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన కొండా సహదేవ్, అబ్దుల్ ఖలీల్, సింధూ తపస్వి. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వీరిని అభినందించిన తైక్వాండో కోచ్ జయంత్ రెడ్డి తదితరులు.

మెదక్ ఉత్కంఠ విజయం

జీ వెంకటస్వామి మెమోరియల్ తెలంగాణ టీ 20 లీగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: నాకౌట్‌లో నిలువాలంటే తప్పకుండా గెలువాల్సిన మ్యాచ్‌లో మెదక్ మావెరిక్స్ జట్టు సత్తా చాటింది. నల్లగొండ లయన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మికీ జైస్వాల్ (54), అభిరాత్ రెడ్డి(23) పరుగులతో రాణించడంతో 19.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసిన మెదక్ జట్టు ఉత్కంఠ విజయం సాధించింది. వరుణ్‌గౌడ్(53), ఆశిష్ రెడ్డి (28) పరుగులు చేయడంతో తొలుత బ్యాటింగ్ చేసిన నల్లగొండ లయన్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. మెదక్ మావెరిక్స్ బౌలర్ ప్రణీత్ రాజ్ 2 వికెట్లు పడగొట్టాడు. 9 మ్యాచ్‌లలో 6 విజయాలు, 3 ఓటమిలతో 12 పాయింట్లు సాధించిన మెదక్ జట్టు దాదాపు సెమీస్ స్థానాన్ని ఖాయం చేసుకుంది.

గెలిచి నిలిచారు





క్లాసెన్ (69)

■ రెండో టీ20లో దక్షిణాఫ్రికా గెలుపు
■ 6 వికెట్ల తేడాతో ఓడిన భారత్
■ చెలరేగిన క్లాసెన్, డుమిని

సెంచూరియన్: సిరీస్‌లో ఆశలు సజీవంగా నిలువాలంటే కచ్చితంగా గెలువాల్సిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జూలు విదిల్చింది. భారీ లక్ష్య ఛేదనలో క్లాసెన్ (30 బంతుల్లో 69; 3 ఫోర్లు, 7 సిక్సర్లు) దుమ్మురేపడంతో బుధవారం జరిగిన రెండో టీ20లో సఫారీ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. టాస్ గెలిచి ఆతిథ్య జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 188 పరుగులు చేసింది. మనీష్ పాండే (48 బంతుల్లో 79 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), ధోనీ (28 బంతుల్లో 52 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) చెలరేగి ఆడారు. తర్వాత దక్షిణాఫ్రికా 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 189 పరుగులు చేసింది. డుమిని (40 బంతుల్లో 64 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆకట్టుకున్నాడు. 38 పరుగులకే హెండ్రిక్స్ (17 బంతుల్లో 26; 5 ఫోర్లు), స్మట్స్ (2) ఔటైనా... డుమిని యాంకర్ పాత్రకు తోడుగా క్లాసెన్ సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో పవర్‌ప్లేలో 50 పరుగులు చేసిన ఆతిథ్య జట్టు స్కోరు 11వ ఓవర్లు ముగిసేసరికి 100 పరుగులకు చేరింది. 22 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న క్లాసెన్ 12వ ఓవర్‌లో చాహల్ బౌలింగ్‌లో 23 పరుగులు రాబట్టాడు. కానీ తర్వాతి ఓవర్‌లోనే ఔట్‌కావడంతో మూడో వికెట్‌కు 8.1 ఓవర్లలో 93 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మిల్లర్ (5) విఫలమైనా.. డుమిని, బెహార్డిన్ (16 నాటౌట్) విజయానికి అవసరమైన పరుగులు జోడించారు. ఈ ఇద్దరు ఐదో వికెట్‌కు అజేయంగా 48 పరుగులు జోడించారు. ఇరుజట్ల మధ్య మూడో టీ20 శనివారం కేప్‌టౌన్‌లో జరుగుతుంది.

మనీష్, మహీ జోరు..

ఆరంభంలో కాస్త ప్రభావం చూపినా సఫారీ బౌలర్లను స్లాగ్ ఓవర్లలో పాండే, ధోనీ ఊచకోత కోశారు. ఇన్నింగ్స్ ఏడో బంతికే రోహిత్ (0) వెనుదిరిగినా.. 3వ ఓవర్‌లో ధవన్ (14 బంతుల్లో 24; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) 20 పరుగులు రాబట్టాడు. వన్‌డౌన్‌లో వచ్చిన రైనా (24 బంతుల్లో 31; 5 ఫోర్లు) కూడా మూడు ఫోర్లు బాది కుదురుకున్నాడు. కానీ రెండో ఎండ్‌లో 8 బంతుల తేడాలో ధవన్, కోహ్లీ (1) ఔట్‌కావడంతో పవర్‌ప్లేలో టీమ్‌ఇండియా 3 వికెట్లకు 45 పరుగులే చేసింది. ఇక రైనాతో జతకలిసిన మనీష్ పాండే ఆరంభంలో జాగ్రత్తగా ఆడాడు. 10వ ఓవర్‌లో 4,6,6తో 19 పరుగులు రాబట్టాడు. అయితే తర్వాతి ఓవర్‌లోనే రైనా అనూహ్యంగా ఎల్బీ కావడంతో నాలుగో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ సమయంలో ధోనీ సమయోచితంగా స్పందించాడు. పాండే వేగంగా ఆడినా 11 నుంచి 15 ఓవర్ల మధ్య కేవలం 39 పరుగులే వచ్చాయి. 16వ ఓవర్ నుంచి ఈ ఇద్దరూ గేర్ మార్చడంతో చివరి ఐదు ఓవర్లలో 69 పరుగులు వచ్చాయి. ఓవరాల్‌గా తొలి 10 ఓవర్లలో 85 పరుగులు చేసిన టీమ్‌ఇండియా చివరి 10 ఓవర్లలో 103 పరుగులు చేసింది. పాండే 33, ధోనీ 27 బంతుల్లోనే అర్ధసెంచరీలు చేశారు. ఈ ఇద్దరు ఐదో వికెట్‌కు అజేయంగా 98 పరుగులు జోడించారు.

స్కోరు బోర్డు

భారత్ ఇన్నింగ్స్: ధవన్ (సి) బెహార్డిన్ (బి) డుమిని 24, రోహిత్ ఎల్బీ (బి) డాల 0, రైనా ఎల్బీ (బి) పెహెల్‌కావో 31, కోహ్లీ (సి) క్లాసెన్ (బి) డాల 1, మనీష్ పాండే నాటౌట్ 79, ధోనీ నాటౌట్ 52, **ఎక్స్‌ట్రాలు:** 1, **మొత్తం:** 20 ఓవర్లలో 188/4.
వికెట్లపతనం: 1-0, 2-44, 3-45, 4-90.
బౌలింగ్: మోరిస్ 4-1-42-0, డాల 4-1-28-2, పీటర్సన్ 4-0-51-0, డుమిని 2-0-13-1, షమ్సీ 2-0-24-0, పెహెల్‌కావో 2-0-15-1, స్మట్స్ 2-0-15-0.
దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హెండ్రిక్స్ (సి) పాండ్యా (బి) ఠాకూర్ 26, స్మట్స్ (సి) రైనా (బి) ఉనాద్కట్ 2, డుమిని 64 నాటౌట్, క్లాసెన్ (సి) ధోనీ (బి) ఉనాద్కట్ 69, మిల్లర్ (సి) ఠాకూర్ (బి) పాండ్యా 5, బెహార్డిన్ నాటౌట్ 16, **ఎక్స్‌ట్రాలు:** 7, **మొత్తం:** 18.4 ఓవర్లలో 189/4.
వికెట్లపతనం: 1-24, 2-38, 3-131, 4-141.
బౌలింగ్: భువనేశ్వర్ 3-0-19-0, శార్దూల్ 4-0-31-1, ఉనాద్కట్ 3.4-0-42-2, హార్దిక్ 4-0-31-1, చాహల్ 4-0-64-0.

మ్యాచ్ వర్షార్పణం

భారత్, దక్షిణాఫ్రికా మహిళల నాలుగో టీ20 రద్దు



సెంచూరియన్: దక్షిణాఫ్రికా గడ్డపై చరిత్ర సృష్టించేందుకు భారత మహిళల జట్టు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం జరిగిన నాలుగో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా పూర్తిగా రద్దయ్యింది. తొలుత టాస్ గెలిచిన భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్..దక్షిణాఫ్రికాను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్లు లీ(58), కెప్టెన్ వాన్ నీకెర్క్(55) అర్ధసెంచరీలతో జట్టుకు మెరుగైన శుభారంభం అందించారు. టీమ్‌ఇండియా బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు కొల్లగొట్టారు. ఈ జోడీని విడగొట్టేందుకు కెప్టెన్ కౌర్ ఎన్ని రకాలుగా ప్రయత్నించినా సఫలం కాలేకపోయింది. దీప్తిశర్మ(2/33) బౌలింగ్‌లో నీకెర్క్ ఔట్ కావడంతో తొలి వికెట్‌కు 103 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. 18 పరుగుల తేడాతో ట్రియన్(2), లూస్(5) ఔటయ్యారు. ఇన్నింగ్స్ 16వ ఓవర్లో మొదలైన వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. దాదాపు రెండు గంటల పాటు కుండపోత వర్షం కురువడంతో మైదానం మొత్తం చిత్తడిగా మారిపోయింది. ఆటకు అనుకూలంగా లేని కారణంగా మ్యాచ్‌ను రద్దుచేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. ఇరు జట్ల మధ్య ఐదో మ్యాచ్ ఈనెల 24న కేప్‌టౌన్‌లో జరుగుతుంది.

పీఎన్‌బీకి కోహ్లీ గుడ్‌బై!

న్యూఢిల్లీ: భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) బ్రాండ్ అంబాసిడర్‌గా వైదొలుగనున్నట్లు సమాచారం. బ్యాంక్‌లో జరిగిన రూ. 11,400 కోట్ల కుంభకోణం నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. ఈ మేరకు బ్యాంక్‌తో ఉన్న అన్ని సంబంధాలకు ఫుల్‌స్టాప్ పెట్టనున్నాడు. 2016లో బ్రాండ్ అంబాసిడర్‌గా బాధ్యతలు స్వీకరించిన విరాట్.. ఈ బ్యాంక్‌లో అకౌంట్లను తెరువాలని విరివిగా ప్రచారం చేశాడు. ఇదే బ్యాంక్‌లో కోహ్లీకి 16వ ఏట నుంచే అకౌంట్‌ను కలిగి ఉన్నాడు. ప్రతికూలతలు ఉన్న బ్రాండ్‌కు ప్రచారం కల్పించాలని ఎవరూ కోరుకోరని, అలాంటి పరిస్థితుల్లో తప్పుకోవడానికే మొగ్గు చూపుతారని కోహ్లీ సన్నిహిత వర్గాలు తెలిపాయి. గతంలో మాజీ సారథి ధోనీ కూడా అమరపాలి గ్రూప్ బ్రాండ్ అంబాసిడర్ నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే. నిర్మాణ ప్రాజెక్ట్‌లను తొందరగా పూర్తి చేయకపోవడం, ఇతర ఫిర్యాదుల నేపథ్యంలో అప్పట్లో మహీ ఈ నిర్ణయం తీసుకున్నాడు.

తెలంగాణకు 21.082, ఏపీకి 6.393 టీఎంసీలు

■ సాగర్, శ్రీశైలంలో ఎండీడీఎల్‌కు ఎగువన రెండు రాష్ట్రాలకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వాటా
■ సాగర్‌కు వెంటనే 18.007 టీఎంసీలు విడుదల చేయాలని ఏపీకి కృష్ణాబోర్డు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వేసవి సమీపిస్తుండటంతో కృష్ణాబేసిన్‌లోని నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లోనూ నీటి నిల్వలు గణనీయంగా తగ్గుతున్నాయి. 19వ తేదీనాటికి రెండు జలాశయాల్లో కనీస నీటిసేకరణస్థాయి (ఎండీడీఎల్)కు ఎగువన కేవలం 49.860 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు కృష్ణాబోర్డు తెలిపింది. ఈ క్రమంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు తెలంగాణ ఇంకా 21.082 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 6.393 టీఎంసీలు వినియోగించుకోవచ్చునని బోర్డు స్పష్టం చేసింది. ఈమేరకు బుధవారం రెండు రాష్ట్రాలకు నీటి వినియోగ లెక్కలు పంపింది. 19వ తేదీనాటికి సాగర్‌లో 523.600 అడుగుల నీటిమట్టంపై 155.920 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఎండీడీఎల్‌కు ఎగువన వాడుకునేందుకు వాటిలో 24.251 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. శ్రీశైలంలో 849.700 అడుగుల నీటిమట్టంపై 79.460 టీఎంసీలు ఉండగా, ఎండీడీఎల్‌పై 25.609 టీఎంసీలు వాడుకునేందుకు అందుబాటులో ఉన్నట్లు బోర్డు పేర్కొంది.

బోర్డు ఆదేశాలకు స్పందించని ఏపీ..

ఇదిలావుండగా, నీటి విడుదల విషయంలో ఏపీ బోర్డు ఆదేశాలకు అనుగుణంగా వెంటనే స్పందించడం లేదు. రెండు రాష్ట్రాలు బోర్డుకు సమర్పిస్తున్న ఇండెంట్లను దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 26 టీఎంసీల నీటిని కుడి గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా విడుదల చేయాలని కృష్ణాబోర్డు ఈనెల 8వ తేదీన ఉత్తర్వులు జారీ చేసినా ఇప్పటికీ ఏపీ వాటిని అమలు చేయలేదు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు కుడిగట్టు ద్వారా 5.222 టీఎంసీలు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా తెలంగాణ మరో 2.771 టీఎంసీలను విడుదల చేసింది. అంటే 26 టీఎంసీలకుగాను కేవలం 7.993 టీఎంసీలు మాత్రమే సాగర్‌కు విడుదలయ్యాయి. దీంతో మిగిలిన 18.007 టీఎంసీలను వెంటనే సాగర్‌కు విడుదల చేయాలని బోర్డు ఏపీని ఆదేశించింది. ఒకవేళ విద్యుత్ ఉత్పత్తికి డిమాండ్ లేనట్లయితే రివర్ స్లూయిజ్‌ల ద్వారా విడుదల చేయాలని బోర్డు తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

దామాషాను మించి జోన్-3కి నీటి విడుదల..

నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని జోన్-3కి దామాషాను మించి, అందునా తెలంగాణ వాడుకున్న నీటితో ఏమాత్రం పొంతన లేకుండా నీటిని విడుదల చేస్తున్నారని తెలంగాణ నీటిపారుదలశాఖ కృష్ణాబోర్డును ప్రశ్నించినట్లు తెలిసింది. వాస్తవంగా ఉమ్మడిరాష్ట్రంలో సాగర్ ఎడమకాల్వ కింద 132 టీఎంసీల కేటాయింపు జరిగింది. అందులో 113 టీఎంసీలు తెలంగాణ పరిధిలోని జోన్-1, 2లకు, మిగిలిన 29 టీఎంసీలు ఏపీ పరిధిలోని జోన్-3కు కేటాయించారు. ఈ క్రమంలో చూసినా ఇప్పటివరకు తెలంగాణ ఎడమకాల్వ కింద సుమారు 35 టీఎంసీల వరకు మాత్రమే వాడుకుంది. ఈ లెక్కన ఏడెనిమిది టీఎంసీలలోపే జోన్-3 వాడకం ఉండాలి. కానీ కృష్ణాబోర్డు మాత్రం ఏపీ ఇచ్చిన ఇండెంట్లకు ఎడాపెడా ఆమోదం తెలుపుతున్నది. జోన్-3కి 14.427 టీఎంసీల విడుదలకు అనుమతిచ్చింది. పైగా తెలంగాణ నీళ్లొదిలినా ఆవిరి, సరఫరా నష్టాలతో తమకు సరిగా రావడంలేదంటూ ఏపీ పేచీ పెట్టడం, ఆమేరకు బోర్డు తెలంగాణపై ఒత్తిడి చేయడం పరిపాటిగా మారింది. ఇదే విషయంపై తెలంగాణ ఇంజినీర్లు బోర్డు అధికారులను ప్రశ్నించారు. సాగర్ ఎడమకాల్వ కింద ఆవిరి, సరఫరా నష్టాలను 20 శాతంగా ఏపీ పరిగణిస్తూ బోర్డుకు లేఖ రాస్తే దానిని అమలు చేయాలంటూ బోర్డు సభ్యకార్యదర్శి తెలంగాణను కోరారు. ఈ క్రమంలో నష్టాలను తేల్చేందుకు బోర్డు నియమించిన కమిటీకి విలువ ఏమున్నదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణ

ఏపీ సాక్షి క్రాస్ ఎగ్జామినేషన్ కొనసాగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీపై బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట గురువారం నుంచి ఆంధ్రప్రదేశ్ తరపు సాక్షి క్రాస్ ఎగ్జామినేషన్ జరుగనున్నది. గత డిసెంబర్‌లో ప్రారంభమైన క్రాస్ ఎగ్జామినేషన్ తరువాత జనవరి 31కి వాయిదాపడింది. తన భార్య అనారోగ్య కారణంగా తాను ఆరోజు విచారణకు హాజరు కాలేనని ఏపీ సాక్షి కేవీ సుబ్బారావు వాయిదా కోరడంతో బ్రిజేశ్ అప్పుడు అందుకు అంగీకరించారు. ఈ నెల 22న జరిగే విచారణకు కూడా తాను రాలేనని సుబ్బారావు తెలియజేశారు. దాంతో ఆయనకు బదులుగా ఏపీ తరపున వ్యవసాయ రంగంపై మరో సాక్షి సత్యనారాయణ క్రాస్ ఎగ్జామినేషన్‌ను కొనసాగిస్తామని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. రెండురోజులపాటు జరిగే విచారణ కోసం తెలంగాణ నీటిపారుదలశాఖ (ఇంటర్‌స్టేట్ విభాగం) చీఫ్ ఇంజినీర్ నర్సింగరావు, ఇతర అధికారులు బుధవారం రాత్రి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

ఎఫ్‌డీసీ ఆస్తులపై ఏపీ జీవో చెల్లదు

■ రాష్ట్ర వాదన ఢిల్లీలో వినిపిస్తా: సీఎస్
■ పబ్లిక్‌సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులకు హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పబ్లిక్ సెక్టార్ సంస్థలన్నింటిపైన పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. ఎఫ్‌డీసీ ఆస్తులు విక్రయిస్తామని ప్రకటించిన ఏపీ వైఖరిపై కేంద్రంలో జరిగే ఉన్నత స్థాయి సమావేశంలో చర్చిస్తామని చెప్పారు. ఏపీ ప్రభుత్వం ఏకపక్షంగా ఇచ్చిన జీవో చెల్లనే చెల్లదని సీఎస్ కొట్టిపారేశారు. ఈనెల 23న కేంద్ర హోంశాఖలో జరిగే సమావేశంలో పబ్లిక్ సెక్టార్ సంస్థల విభజన అంశాలపై తెలంగాణ వాదనలను వినిపిస్తానని సీఎస్ స్పష్టంచేశారు. ఎఫ్‌డీసీ ఆస్తులను విక్రయిస్తామని ఏపీ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. ఆ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించాలని తెలంగాణ పబ్లిక్‌సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉద్యోగసంఘాల నాయకులు బుధవారం ప్రధానకార్యదర్శికి విన్నవించారు. రాష్ట్ర పబ్లిక్‌సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ రాజేశం, ప్రధాన కార్యదర్శి జీవన్, వ్యవస్థాపక చైర్మన్ సుధీర్, విజయమోహన్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు సీఎస్‌ను కలిశారు. సినవారిలో ఉన్నారు. పబ్లిక్‌సెక్టార్‌లోని సంస్థలన్నింటినీ రక్షించుకోవాల్సిన బాధ్యత తెలంగాణ ప్రజలపైన ఉన్నదని ఫెడరేషన్ నాయకులు పిలుపునిచ్చారు. ఏపీ సర్కార్ కుట్రపూరితంగా ఈ సంస్థలన్నింటినీ వివాదాస్పదం చేస్తున్నదని పేర్కొన్నారు. సీఎస్‌ను కలిసిన తర్వాత వారు ప్రత్యేకంగా సమావేశమాయ్యారు. ఈ నెల 27, 28 తేదీలలో షీలాబీడే కమిటీ సమావేశాల తర్వాత తదుపరి కార్యాచరణను నిర్ణయించుకుంటామని తెలిపారు.



బుధవారం సీఎస్ ఎస్కే జోషితో సమావేశమైన రాష్ట్ర పబ్లిక్‌సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉద్యోగులు

ఏమిటీ గోదా'వర్రీ'?

■ అకినేపల్లి అనుసంధానంపై కేంద్రం అత్యుత్సాహం
■ ప్రాజెక్టు డీపీఆర్ తయారీపై ఒప్పందానికి తొందర
■ ఇంద్రావతిలో ఛత్తీస్‌గఢ్ వాటాను తరలిస్తామంటూ కొత్త మెలిక
■ గోదావరిలో నీటి లభ్యతపై శాస్త్రీయ అధ్యయనం అనివార్యమన్న తెలంగాణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శకునం చెప్పే బల్లి కుడితిలో పడిందట.. నదుల అనుసంధానంపై కేంద్ర ప్రభుత్వం తీరు ఇలాగే తయారైంది. దేశవ్యాప్తంగా అనేక ట్రిబ్యునల్స్ ఉండటం వల్ల జలవివాదాలు సత్వరం పరిష్కారం కావడం లేదంటూ జాతీయ ట్రిబ్యునల్‌కు కేంద్రం సమాయత్తమవుతున్నది. కానీ దక్షిణాదిలో నదుల అనుసంధానం విషయం వచ్చేసరికి మాత్రం తాత్కాలిక ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ భవిష్యత్తులో ఎదురయ్యే క్లిష్టమైన సమస్యలను విస్మరిస్తున్నది. గోదావరి (అకినేపల్లి)-కావేరీ (గ్రాండ్ ఆనకట్ట) అనుసంధానంపై ఇప్పటికే ప్రతిపాదనలు తయారుచేసిన కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ తాజాగా మరో చర్యకు ఉపక్రమించింది. ఈ ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకిగాను నాలుగు రాష్ట్రాలతో ఒప్పందం (ఎంవోఏ) చేసుకుందామని చూస్తున్నది. ఈ మేరకు నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమ్మతి కోసం ఎంవోఏ కాపీలను ఆయా రాష్ట్రాలకు పంపింది. ఒకవైపు గోదావరిలో నీటి లభ్యతపై శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాతే అనుసంధానంపై ముందుకు వెళ్లాలని తెలంగాణ పదేపదే కోరుతున్నా పట్టించుకోకుండాకేంద్రం ఈ విధంగా అత్యుత్సాహం ప్రదర్శించడం పట్ల అనుమానాలు కలుగుతున్నాయి. అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించి ముందుముందు ఎదురయ్యే చిక్కులను పట్టించుకోకుండా కేంద్రం గోదావరిజలాలను కావేరీకి తరలించాలని చూస్తున్నదని సాగునీటి నిపుణులు విశ్లేషిస్తున్నారు.

గోదావరి-కావేరీ అనుసంధానంపై కేంద్ర సర్కారు పావులు కదుపుతూనే ఉన్నది. గోదావరిలో నీటి లభ్యతపై శాస్త్రీయ అధ్యయనం జరగడంతో పాటు తెలంగాణ అవసరాల నిమిత్తం 1500 టీఎంసీలను మినహాయించి, మిగులు ఉంటే కావేరీకి తరలించుకోవచ్చని తెలంగాణ ఘంటాపథంగా చెప్తున్నది. గత నెల 17వ తేదీన కేంద్ర జలవనరులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ నిర్వహించిన సమావేశంలో, రెండు రోజుల కిందట హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సులోనూ రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ఈ సంగతి స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కేజోషి సైతం కేంద్రానికి ఈ మేరకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనూ కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి యూపీసింగ్ నదుల అనుసంధానంపై ఎంవోఏ కోసం లేఖరాయడం చర్చనీయంగా మారింది. అనుసంధాన ప్రాజెక్టుపై డీపీఆర్ తయారీకి సమ్మతిస్తూ ఎంవోఏపై సంబంధిత రాష్ట్రాల సీఎంలు సంతకం చేయాలని అందులో కోరారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్ర సీఎంలతో కేంద్రం ఈ ఒప్పందం కుదుర్చుకుంటుందనేది దాని సారాంశం. దీంతోపాటు దానిపై బేసిన్ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్ర సీఎంల సంతకాలను కూడా కోరారు. ఈ ఒప్పందంలోకి ప్రవేశిస్తే డీపీఆర్ తయారీకిగాను ఏపీ తన పరిధిలోని కృష్ణా-పెన్నా అనుసంధానం కోసం 394 కిలోమీటర్లు, పెన్నా-కావేరీ అనుసంధానం కోసం 167 కిలోమీటర్ల మేర సర్వేకు అంగీకరించాలి. తమిళనాడు తన పరిధిలో 362 కిలోమీటర్ల మేర పెన్నా-కావేరీ అనుసంధానానికి అంగీకరించాలి. అకినేపల్లి వద్ద హెడ్‌రెగ్యులేటర్, పంపింగ్‌తో పాటు గోదావరి-కృష్ణా అనుసంధానానికి అవసరమయ్యే 341 కిలోమీటర్ల లింకు కోసం తెలంగాణ సర్వేకు అంగీకరించాలని అందులో రాశారు. అకినేపల్లి స్థలం నిర్ణయమైతే అక్కడ హెడ్‌రెగ్యులేటర్, పంపింగ్ జరుగుతుందని కూడా ప్రస్తావించారు.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

ఎంవోఏలోని పలు అంశాలపై సాగునీటి రంగ నిపుణులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని సందేహాల నడుమ అనుసంధానాన్ని ముందుకు తీసుకుపోతే భవిష్యత్తులో అనేక చిక్కుముళ్లు వస్తాయని సూచిస్తున్నారు. వాటిలో ప్రధానంగా. గోదావరిలో మిగులుతో పాటు ఇంద్రావతిలో ఛత్తీస్‌గఢ్‌కు బచావత్ కేటాయించిన నీటి పరిమాణాన్ని ప్రస్తుతం ఆ రాష్ట్రం వాడుకోనందున కావేరీ తరలింపులో జోడించామని కేంద్రం చెప్తున్నది. ముమ్ముందు ఛత్తీస్‌గఢ్‌కు ఆ నీటిని వాడుకునేందుకు సంపూర్ణ హక్కు ఉంటుందని ఎంవోఏలో రాసి ఉంది. వాస్తవానికి ఇంద్రావతిలో బచావత్ అవార్డు ప్రకారం ఛత్తీస్‌గఢ్‌కు భూపాలపట్నం వరకు 273 టీఎంసీలు, దాని దిగువన 27 టీఎంసీలు మొత్తం 300 టీఎంసీల కేటాయింపు ఉంది. ఇప్పుడు ఇంద్రావతిలో ఛత్తీస్‌గఢ్ వాటాను తరలిస్తామంటూ కేంద్రం కొత్త మెలిక పెడుతున్నది. ఒకవేళ ముమ్ముందు ఛత్తీస్‌గఢ్ ఈ నీటిని వినియోగించుకుంటే తరలింపులో జోడించిన ఆ మేరకు పరిమాణాన్ని భరించేదెవరు? కేంద్రం దాన్నెలా సర్దుబాటు చేస్తుంది? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. గోదావరిలో మిగులును ప్రధానంగా ఈ అనుసంధానంలో వినిపిస్తున్నారు. వాస్తవంగా కృష్ణా తరహాలో ఈ నదిలో నీటిలభ్యత, మిగులుపై ఇప్పటివరకు ఎలాంటి శాస్త్రీయ హైడ్రాలజీ అధ్యయనం జరుగలేదు. కేవలం బేసిన్ రాష్ట్రాలు కుదుర్చుకున్న ఒప్పందాలను కలిపి దానిని బచావత్ అవార్డుగా పరిగణించారే తప్ప బచావత్ నేరుగా అధ్యయనంతో చేసిన కేటాయింపులు కావు. ఈ క్రమంలో వాటి ఆధారంగా ముందుకుపోవడం ఎంతవరకు శ్రేయస్కరం అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హిమాలయ నదులు, మహానది, అక్కడి నుంచి గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరీ అనుసంధానమనేది వాస్తవంగా కేంద్రం లక్ష్యం. కానీ ఇప్పుడు మొదటి వాటిని వదిలి గోదావరి నుంచి కావేరీ తరలింపును ముందుగా చేపట్టడం ఎంతవరకు సమంజసమని తెలంగాణ ప్రశ్నిస్తున్నది. మహానదిలో మిగులు తేలనందున ప్రస్తుతానికి గోదావరి నుంచి అనుసంధానాన్ని చేపడుతున్నామని కేంద్రం చెప్తున్నది. మహానది మిగులుపై ఎన్‌డబ్ల్యూడీఏ రెండుదఫాలుగా నివేదికలు తయారుచేసినా దాన్ని ఒడిశా అంగీకరించలేదు. ఎన్‌డబ్ల్యూడీఏ, ఒడిశా నివేదికలను బేరీజు వేసి వాస్తవ లెక్కలు తేల్చే బాధ్యతను ఐఐటీ రూర్కీకి అప్పగించారు. అయినా తుది నిర్ణయం జరుగలేదు. ఈ మాత్రం కసరత్తు కూడా గోదావరిపై జరుగలేదు. శాస్త్రీయ అధ్యయనం చేయించకుండా డీపీఆర్ తయారీపై ఒప్పందం చేసుకోవడం ఎందుకన్న ప్రశ్న బలంగా వినిపిస్తున్నది.

విద్యుత్ సరఫరాలో రికార్డుల మోత

➤ మొదటిపేజీ తరువాయి...

యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేయడం ఒక రికార్డు. ఈ నెల 20 తారీఖు.. మంగళవారం. ఇప్పటివరకు ఎప్పుడూ లేనంతగా 202 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేయడం గమనార్హం. గతేడాది ఇదే రోజు (2017 ఫిబ్రవరి 20 తారీఖు)న కేవలం 170.4 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను డిమాండ్ మేరకు సరఫరా చేశారు. కేవలం ఒక సంవత్సరం వ్యవధిలోనే సుమారు 32 మిలియన్ యూనిట్ల విద్యుత సరఫరా పెరిగిందని చెప్పవచ్చు. విద్యుత్ సరఫరా, పంపిణీ సంస్థల పటిష్టత కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా.. ఎంతటి భారీ డిమాండ్‌ను అయినా తట్టుకునేలా తెలంగాణ విద్యుత్ వ్యవస్థలు దృఢంగా మారాయి.

సమైక్యరాష్ట్రం సరఫరాను దాటే అవకాశం

ఇది కేవలం ప్రారంభం మాత్రమే. రాబోయే రోజుల్లో సమైక్య రాష్ట్రంలో గరిష్ఠంగా సరఫరా చేసిన విద్యుత్‌నుకూడా దాటే అవకాశం ఉంది. సమైక్య రాష్ట్రంలో గరిష్ఠంగా సరఫరా చేసిన విద్యుత్ 220 మిలియన్ యూనిట్లు. ఇదికూడా దాదాపు 7 సంవత్సరాల క్రితం నమోదయ్యింది. వ్యవసాయానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే మార్చి నెలలో గరిష్ఠ డిమాండ్ సుమారు 10,500 నుంచి 11 వేల మెగావాట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరా దాదాపు 225 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని.. అయినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామనే ధీమా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల్లో కనపడుతున్నది. ఇప్పటివరకు విద్యుత్ డిమాండ్‌ను పరిశీలిస్తే.. బుధవారం ఉదయం 7.40 గంటలకు గరిష్ఠంగా 9894 మెగావాట్లు. ఇదొక రికార్డు. పంటలు ఊపుమీద ఉన్న నేపథ్యంలో ఈ ఫిబ్రవరి నెలాఖరునాటికి డిమాండ్ 10,500 మెగావాట్లకు చేరుకుంటుందని అంచనా.

నాలుగు అంశాల మద్దతుతోనే..:
డీ ప్రభాకర్‌రావు, సీఎండీ, ట్రాన్స్‌కో

ఎంతటి డిమాండ్ వచ్చినా.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయడానికి నాలుగు అంశాలు మాకు సంపూర్ణంగా సహకరించడమే కారణమని గర్వంగా చెప్పగలను. ఇందులో ప్రధానంగా చెప్పాల్సింది.. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పర్యవేక్షణ. ఎప్పటికప్పుడు విద్యుత్ పరిస్థితిని పరిశీలించి, భవిష్యత్తు అవసరాలను అంచనా వేసి తగు సూచనలు ఇవ్వడం నిజంగా అద్భుతం. ఇక విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి నుంచి మాకు లభిస్తున్న సహకారం. ఎప్పుడేం కావాలన్నా ఆయన సానుకూలంగా స్పందించడం ప్రోత్సాహాన్నిస్తున్నది. ఇక మా విద్యుత్ సంస్థల టీం. పైస్థాయిలో తీసుకున్న నిర్ణయాల మేరకు సమిష్టిగా కష్టపడి, నిర్దేశించిన పనిని నిర్దేశించిన సమయంలో పూర్తిచేయడం మా ఉద్యోగులు, కార్మికులు, అధికారులు కలిసికట్టుగా సాధించిన విజయాలు. అలాగే భవిష్యత్తును సరిగ్గా అంచనా వేసి సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం.. ఈ నాలుగు అంశాలతోనే ఇలాంటి విజయాలు, రికార్డులు సాధించగలుగుతున్నాం.

మిషన్ కాకతీయ మీడియా అవార్డుల ప్రకటన

'నమస్తే తెలంగాణ'కు నాలుగు అవార్డులు

'తెలంగాణ టుడే'కు ఒకటి ● శుభాకాంక్షలు తెలిపిన మంత్రి హరీశ్‌రావు


ఎక్కల్‌దేవి శ్రీనివాస్
స్టేట్ బ్యూరో ఇంచార్జి


చిన్నారెడ్డి
నిర్మల్ ప్రధాన ప్రతినిధి


రజనీకాంత్ గౌడ్
ఫొటోజర్నలిస్టు (హైదరాబాద్)


గొట్టె వెంకన్న
ఫొటోజర్నలిస్టు (వరంగల్)


పీ శ్రీనివాస్
తెలంగాణటుడే (నల్లగొండ)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న మిషన్ కాకతీయ మూడో విడుత (2017) మీడియా అవార్డులను బుధవారం ప్రకటించింది. ప్రింట్ అండ్ ఫొటో విభాగంలో 'నమస్తే తెలంగాణ'కు నాలుగు అవార్డులు దక్కాయి. న్యాయనిర్ణేతలుగా మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ టుడే డిప్యూటీ ఎడిటర్ బాలకోటేశ్వర్‌రావు, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి వ్యవహరించారు. అవార్డు విజేతలకు మంత్రి హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. త్వరలో ఓ ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులు అందజేయనున్నారు. ప్రథమ బహుమతి కింద రూ.లక్ష, రెండో బహుమతికి రూ.75 వేలు, మూడో బహుమతికి రూ.50 వేలు, స్పెషల్ జ్యూరీ బహుమతిగా రూ.25 వేలు అందజేయనున్నారు. ప్రింట్‌మీడియా విభాగంలో మొదటి బహుమతికి నోముల రవీందర్‌రెడ్డి (ఆంధ్రజ్యోతి), రెండో బహుమతికి ఎక్కల్‌దేవి శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ), మూడో బహుమతికి కే మల్లికార్జున్‌రెడ్డి (సాక్షి) ఎంపికయ్యారు. స్పెషల్ జ్యూరీ అవార్డులకు పీ శ్రీనివాస్ (తెలంగాణ టుడే), చిన్నారెడ్డి (నమస్తే తెలంగాణ) ఎంపికయ్యారు. ఫొటో జర్నలిస్టుల విభాగంలో గొట్టె వెంకన్న (నమస్తే తెలంగాణ), రజనీకాంత్‌గౌడ్ (నమస్తే తెలంగాణ)లను ఎంపిక చేశారు. ఎలక్ట్రానిక్ మీడియా విభాగంలో మొదటి బహుమతికి కే శ్రీశైలం (ఈటీవీ), రెండో బహుమతికి బీ గురుప్రసాద్ (టీవీ1), మూడో బహుమతికి కే విక్రమ్‌రెడ్డి (సాక్షి టీవీ) ఎంపికయ్యారు. వీడియో జర్నలిస్టుల విభాగంలో స్పెషల్ జ్యూరీ అవార్డుకు డీ సూర్యనారాయణ (ఈటీవీ), అంజి (టీవీ1), శ్రీరాములు గౌడ్ (దూరదర్శన్ యాదగిరి) ఎంపికయ్యారు. ఓయూ సోషియాలజీ విభాగం 2016 నవంబర్‌లో జాతీయ సెమినార్‌లో సమర్పించిన వ్యాసాల సంకలనానికి స్పెషల్ జ్యూరీ అవార్డు కింద రూ.లక్ష నగదును అందజేస్తారు.

మార్చిలో తెలంగాణకు దుబాయ్ కంపెనీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో మాంసం ఎగుమతి కేంద్రం ఏర్పాటుకు సమ్మతించిన దుబాయ్‌కు చెందిన వివిధ సంస్థల ప్రతినిధులు వచ్చే నెలలో రాష్ట్రంలో పర్యటిస్తారని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. ఈ పర్యటనలో భాగంగా వారు రాష్ట్రంలో మాంసం ఉత్పత్తిరంగాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తారని తెలిపారు. దుబాయ్‌లో జరుగుతున్న గల్‌ఫుడ్-2018 ట్రేడ్‌షోకు హాజరైన మంత్రి తలసాని బృందం బుధవారం రెండోరోజు వివిధ సంస్థల ప్రతినిధులతో చర్చించింది. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్నిరకాల అనుమతులను సింగిల్‌విండో విధానం ద్వారా అమలుచేస్తున్నామని ఈ సందర్భంగా తలసాని దుబాయ్ ప్రతినిధులకు వివరించారు. మాంసాన్ని ఎగుమతి చేసేస్థాయికి రాష్ట్రం అభివృద్ధి చెందాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని తలసాని స్పష్టం చేశారు. ఇప్పటికే రూ.5 వేల కోట్లతో 44 లక్షల గొర్రెలను గొల్లకుర్మలకు పంపిణీ చేయగా అవి 15 లక్షల పిల్లలను ఉత్పత్తి చేసినట్టు తెలిపారు. రిజర్వాయర్లు, చెరువుల్లో వేసేందుకు మత్స్యకారులకు పెద్దఎత్తున చేపపిల్లలను పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ ట్రేడ్‌షోలో మంత్రి వెంట తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ నిర్మల, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వీ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

మాంసం ఉత్పత్తుల పరిశీలనకు రానున్నట్టు మంత్రి తలసాని వెల్లడి
గల్‌ఫుడ్-2018 ట్రేడ్‌షోలో ప్రతినిధులతో సమావేశం


దుబాయ్‌లో జరుగుతున్న గల్‌ఫుడ్-2018 ట్రేడ్‌షోకు హాజరై అక్కడి వివిధ సంస్థల ప్రతినిధులతో చర్చిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

కాళేశ్వరం పరిశీలనకు ఎమ్మెల్సీల బృందం

రేపటినుంచి రెండు రోజుల పర్యటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు రాష్ట్ర ఎమ్మెల్సీల బృందం శుక్ర, శనివారాల్లో వెళ్లనున్నది. 23న ఉదయం రెండు బస్సుల్లో ఎమ్మెల్సీలు మండలి ప్రాంగణం నుంచి బయలుదేరి మధ్యాహ్నానికి భూపాలపల్లికి చేరుకుంటారు. అక్కడ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ఎమ్మెల్సీలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. అనంతరం 3.30 కి మేడిగడ్డ బరాజ్ చేరుకొంటారు. సాయంత్రం గం. 5.15 కి కాళేశ్వరానికి సమీపంలో ఉన్న కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శిస్తారు. రాత్రి కాళేశ్వరం సమీపంలోని హరిత గెస్ట్‌హౌస్‌లో బసచేస్తారు. మర్నాడు ఉదయం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం సందర్శిస్తారు. అనంతరం అన్నారం బరాజ్, మధ్యాహ్నం సుందిళ్ల బరాజ్‌ను సందర్శిస్తారు. లంచ్ అనంతరం మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్, ఎమ్మెల్సీలు.. గొలివాడ వద్ద సుందిళ్ల పంప్‌హౌజ్‌ను సందర్శిస్తారు. సాయంత్రం ఎల్లంపల్లి ప్రాజెక్ట్, ప్యాకేజ్-6, పంప్‌హౌస్, సర్జ్‌పూల్, టన్నెల్‌ను సందర్శిస్తారు. రాత్రి 8 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. మొత్తం 40 మంది ఎమ్మెల్సీలను మండలి చైర్మన్ కే స్వామిగౌడ్ ఆహ్వానించినట్టు అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వేదాంత నరసింహాచార్యులు తెలిపారు.



బుధవారం శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ మధుసూదనాచారిలను మర్యాదపూర్వకంగా కలుసుకున్న సీఎస్ ఎస్కే జోషి


బుధవారం సచివాలయంలో విద్య, వైద్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

విద్యార్థులందరికీ హెల్త్‌కార్డులు

- విద్యార్థినులకు హెల్త్, హైజీన్ కిట్లు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అందజేత
- మంత్రులు కడియం శ్రీహరి, లక్ష్మారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోని 30 లక్షల మంది విద్యార్థులకు హెల్త్‌కార్డులు అందించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి నిర్ణయించారు. జూలైలో ఆరోగ్య పరీక్షలు ప్రారంభించి ఆరునెలల్లో పూర్తిచేయాలని, విద్యార్థులకు హెల్త్‌కార్డులు, బాలికలకు హెల్త్, హైజీన్ కిట్లు ఇవ్వాలని అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలోని ఉపముఖ్యమంత్రి చాంబర్‌లో మంత్రులు ఇద్దరు విద్యా, వైద్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యాశాఖలు నిర్వహిస్తున్న గురుకుల విద్యాలయాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు హెల్త్, హైజీన్ కిట్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే కేజీబీవీలు, గురుకుల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థినులకు హెల్త్ కిట్లు అందజేస్తున్నామని కడియం శ్రీహరి పేర్కొన్నారు. 31 జిల్లాల్లోని విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు, హెల్త్ కార్డుల అందజేతపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని 7, 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు ఆరోగ్య సమస్యలు, సంరక్షణపై అవగాహనా తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు.

దేశంలోనే మొదటిసారి తెలంగాణలో..

దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు, హెల్త్‌కార్డుల జారీకి చర్యలు చేపట్టామని, దీనిని సమర్థంగా నిర్వహించాలని అధికారులకు మంత్రులు సూచించారు. సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ, పాఠశాల విద్య డైరెక్టర్ కిషన్, ఆరోగ్యశ్రీ సీఈవో మనోహర్, ఎన్‌హెచ్‌ఎం చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, మోడల్ స్కూల్స్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది క్యాన్సర్ స్క్రీనింగ్, చికిత్స కేంద్రాలు

- సహకారం అందించేందుకు సిద్ధం
- మంత్రి లక్ష్మారెడ్డికి టాటా ట్రస్ట్ ప్రతినిధుల వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని క్యాన్సర్ బాధితుల కోసం క్యాన్సర్ స్క్రీనింగ్, చికిత్స కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎనిమిదిచోట్ల ఏర్పాటుచేసే కేంద్రాల్లో టాటా ట్రస్ట్ సహకారం తీసుకోవాలని భావిస్తున్నది. మెహది నవాజ్ జంగ్ (ఎంఎన్‌జే) క్యాన్సర్ దవాఖాన అపెక్స్ సెంటర్‌గా ఆదిలాబాద్ రిమ్స్, వరంగల్ కాకతీయ వైద్యకళాశాల, మహబూబ్‌నగర్ వైద్యకళాశాల, నిజామాబాద్ వైద్యకళాశాల, ఖమ్మం, కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో ఒకటి చొప్పున మొత్తం 8 కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు. విధివిధానాలు ఖరారైతే రాష్ట్రంలో క్యాన్సర్ పరీక్షలు, చికిత్స విస్తృతమవుతాయి. క్యాన్సర్ స్క్రీనింగ్, చికిత్స కేంద్రాల ఏర్పాటుపై మంత్రి సీ లక్ష్మారెడ్డి టాటా ట్రస్ట్ ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో సమావేశమయ్యారు. వైద్యరంగంలో పలు సేవలందిస్తున్న టాటా ట్రస్ట్ రాష్ట్రంలో తమ సేవలను అందించేందుకు ముందుకొచ్చింది. క్యాన్సర్ పరీక్షలు, చికిత్సకు సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ సంస్థ ప్రతినిధులు మంత్రితో చెప్పారు. సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, నేషనల్ హెల్త్ మిషన్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, టాటా ట్రస్ట్ ప్రతినిధులు శ్రీనివాస్, అభిషేక్, మృణాళిని పాల్గొన్నారు.



తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు

- కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సాధిస్తాం
- ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఎస్టీలు, మైనార్టీలకు తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు పెంచడం న్యాయమైన హక్కు అని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. రిజర్వేషన్ల పెంపుపై సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట కు కట్టుబడి ఉన్నారని, కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించినా రిజర్వేషన్లు పెంచి తీరుతామని స్పష్టంచేశారు. రిజర్వేషన్ల విషయంలో ప్రతిపక్షాల విమర్శలు, పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆయన బుధవారం స్పందించారు. రాష్ట్రంలో దాదాపు 91 శాతం వెనుకబడిన తరగతులవారున్నారని, దీనికి అనుగుణంగా రిజర్వేషన్ల పెంపు అనివార్యమని స్పష్టం చేశారు. గతంలో తమిళనాడులో సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సమగ్ర అధ్యయనాల తర్వాతనే రిజర్వేషన్ల పెంపునకు ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు సహేతుక కారణాలను చూపిందని పేర్కొన్నారు. కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల్లో మైనార్టీలు, ఎస్టీల రిజర్వేషన్లకు సంబంధించి వాస్తవాలు, కారణాలు పొందుపరిచినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎలాంటి సందేహాలకు తావు లేదని స్పష్టం చేశారు.

కృష్ణబిలాలకు తాత

అత్యంత బరువైన బ్లాక్‌హోల్‌ను కనుగొన్న శాస్త్రవేత్తలు



టొరంటో : నాసా శాస్త్రవేత్తలు అత్యంత భారీ కృష్ణబిలాలను కనుగొన్నారు. వీటిని అల్ట్రామాసివ్ బ్లాక్‌హోల్స్ అని పిలుస్తున్నారు. నాసాకు చెందిన చంద్ర టెలిస్కోప్ సాయంతో భూమికి 350 కోట్ల కాంతిసంవత్సరాల దూరంలోని నక్షత్ర మండలాల సమాచారాన్ని సేకరించారు. కెనడాలోని మాంట్రియల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు 72 గెలాక్సీల సమాచారాన్ని విశ్లేషించగా భారీ కృష్ణబిలాలు బయటపడ్డాయి. అందులో ప్రకాశవంతంగా కనిపిస్తున్న ఒక కృష్ణబిలం బరువును కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటివరకు 40శాతం బరువును అంచనా వేయగా వెయ్యి కోట్ల సూర్యుళ్ల బరువు (10 బిలియన్ సోలార్‌మాస్) కన్నా ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

ఢిల్లీ సీఎస్‌కు గాయాలు నిజమే

వైద్య నివేదిక వెల్లడి.. ఎమ్మెల్యేలను కోర్టులో హాజరుపరచిన పోలీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అన్షు ప్రకాశ్ గాయపడ్డ మాట వాస్తవమేనని వైద్య పరీక్షల నివేదిక స్పష్టం చేసింది. ముఖం వద్ద తెగిన గాయాలతోపాటు వాపు ఉన్నదని పరీక్షల్లో తేలింది. రెండు చెవుల వెనుక వాపు వచ్చినట్టు నిర్ధారణ అయింది. కింది పెదవిపై చర్మం కమిలిపోయిన గాయంతోపాటు కుడివైపు తల కింది భాగంలో కూడా వాపు వచ్చినట్టు వైద్య పరీక్షల నివేదిక తేల్చింది. ఢిల్లీ సీఎస్‌పై దాడికి సంబంధించిన వ్యవహారంపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ ఆధ్వర్యంలో రూపొందించిన నివేదిక బుధవారం కేంద్ర హోంశాఖకు చేరింది. మరోవైపు సీఎస్‌పై దాడికి సంబంధించి ఆప్ ఎమ్మెల్యేలు అమానతుల్లా ఖాన్, ప్రకాశ్ జర్వాల్‌ల పోలీసు కస్టడీకి ఢిల్లీ మెట్రోపాలిటన్ కోర్టు నిరాకరించింది. అంతకుముందు ఎమ్మెల్యేలను బందోబస్తు మధ్య కోర్టుకు తీసుకొచ్చారు.

దాడిని ఖండించిన తెలంగాణ ఐఏఎస్‌లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఢిల్లీ సీఎస్ అన్షు ప్రకాశ్‌పై అధికార ఆప్ పార్టీ ఎమ్మెల్యేలు దాడి చేయడాన్ని తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం గౌరవ కార్యదర్శి నవీన్ మిత్తల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగా రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారమే ఎమ్మెల్యే దాడి చేసినట్టు అర్థమవుతున్నదని ఆరోపించారు. దీనిని ప్రజాస్వామిక సంస్థలపై చేసిన దాడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఢిల్లీ సీఎస్‌కు సంఘీభావం తెలియజేశారు. ఢిల్లీ ఐఏఎస్‌ల చేసే పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు.